

నంది పత్రిక

మా కలం - సామాన్యుడి బలం

GSTIN 37AMRPM5719R1ZX

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162



ఎడిటర్: మహేష్ యాదవ్ | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2030 | సంచిక : 310 | ఆదివారం 22 - నవంబర్ - 2026 | పేజీలు : 12 | వెల-3

Published From : KURNOOL circulated at Nandyal Alluri SitharamaRaju,Anakapalli,Anantapur,Annamayya,Bapatla,Chittoor, Konaseema,East Godavari,Eluru,Guntur,Kakinada,Krishna,,NTR, Palnadu,Parvathipuram Manyam,Prakasam,Nellore,Sri Sathya Sai,Srikakulam,Tirupati,Visakhapatnam,Vizianagaram,West Godavari, YSR Kadapa,Hyderabad,Ranga Reddy,Medchal-Malkajgiri,Warangal,Hanamkonda,Nizamabad,Karimnagar, Khammam,

విలువైన ఓటును అమ్ముకోవద్దు


స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు అండగా నిలిచారన్న సీఎం చంద్రబాబు

జిల్లా పరిషత్ ఎన్నికల్లో 96.42 శాతం స్ట్రయిక్ రేట్ సాధించినట్లు వెల్లడి

సామాన్య కార్యకర్తలు మరియు మహిళలకు పదవుల్లో అధిక ప్రాధాన్యం

వైసీపీ కుట్రలను ప్రజలు తిప్పికొట్టారన్న ముఖ్యమంత్రి 2లో

ప్రజాప్రతినిధుల పనితీరు ఆధారంగా తగిన చర్యలు ఉంటాయని స్పష్టీకరణ



స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ పన్నిన కుట్రలు, కుతంత్రాలను ప్రజాస్వామ్యబద్ధంగా తిప్పికొట్టిన రాష్ట్ర ఓటర్లకు హ్యాట్సాఫ్ చెబుతున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారనే విషయాన్ని ఈ తీర్పు మరోసారి రుజువు చేసిందని స్పష్టం చేశారు. ఎన్నికలు జరగకుండా ఆపేందుకు కోర్టుల్లో 63 పిటిషన్లు వేసి, బీసీ రిజర్వేషన్లు, డీలిమిటేషన్ పేరిట అడ్డంకులు సృష్టించారని, హింసకు పాల్పడుతూ ఎదురు ఫిర్యాదులు చేసిన వైసీపీ డ్రామాలను ప్రజలు ఏమాత్రం నమ్మలేదని సీఎం మండిపడ్డారు.

ముగ్గురు టీడీపీ నేతలు అలిగారు.. అలా అలగడం నాకు నచ్చలేదు!

రాజకీయాల్లో డబ్బిస్తే ఓటేస్తారనే భావన పోయిందని, ఇటీవల ఒక ఓటరు అభ్యర్థి ఇచ్చిన డబ్బును



కొత్త ఎయిర్‌లైన్స్‌కు భోగాపురం కేంద్రస్థానం కావాలి

కుప్పం, పలాస ఎయిర్‌పోర్టులకు భూసేకరణ జరుగుతోందన్న రామ్మోహన్ నాయుడు

భోగాపురంపై కేంద్ర పౌర విమానయాన శాఖ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని వెల్లడి

సీఐఐ సమ్మిట్‌తో ఏపీ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేశామన్న కేంద్ర మంత్రి 2లో


2లో

రాజమండ్రి మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించండి:



హే రామ్.. ఆంధ్రప్రదేశ్‌ను కాపాడు

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్రస్థాయిలో మండిపడ్డ జగన్

నామినేషన్లు చించేసి గెలిచినవారిని ఓడించారంటూ వైసీపీ అధినేత ఆరోపణలు 2లో

ఎంపీ అవినాశ్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిలపై హత్యాయత్నాలు జరిగాయని ఆవేదన

పోలీసులు, అధికారులు అధికార పార్టీతో కుమ్మక్కయ్యారని జగన్ ఆగ్రహం

ఎన్నికల అక్రమాలకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన జగన్

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై వైసీపీ అధినేతజగన్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మున్సిపల్, జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలతో పాటు ప్రస్తుతం పార్టీ రహితంగా జరుగుతున్న పంచాయతీ ఎన్నికలను కూడా అధికార కూటమి రిగ్గింగ్ చేస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్య సూత్రాలే అమలు కావడం లేదని, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచేలా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయని ఆయన సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. హే రామ్.. ఆంధ్రప్రదేశ్ ను కాపాడు అంటూ ట్వీట్ చేశారు.

చంద్రబాబు మూల్యం చెల్లించుకోక తప్పదు



ఏపీ స్థానిక ఎన్నికల్లో దౌర్జన్యాలు విపరీతంగా పెరిగిపోయాయని రామకృష్ణ

ఎన్నికల్లో పోటీ చేయలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపణ

పాలకపక్ష నేతల కంటే పోలీసుల బెదిరింపులే అధికంగా ఉన్నాయని విమర్శ 2లో

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు తీవ్రస్థాయికి చేరాయని సీపీఐ

మారుతి కంపెనీలో సోనియాకు 50 శాతం వాటా

విదేశీ పౌరురాలైనప్పటికీ మారుతి సంస్థలో 50 శాతం వాటా ఉన్నట్లు వ్యాఖ్య

1970లో సోనియా సంస్థ డైరెక్టర్‌గా ఎలా అయ్యారని ప్రశ్న 2లో

హర్యానాలో విదేశీ పౌరురాలికి భూమి ఎలా కేటాయించారంటూ ఎక్స్‌లో పోస్ట్



యలహంక ప్యాలెస్ భూవివాదంలో బిగ్ ట్విస్ట్


2లో

బెంగళూరులోని అత్యంత విలువైన యలహంక ప్యాలెస్ భూవివాదం ఇప్పుడు మరో కీలక మలుపు తిరిగింది. ఈ ఆస్తిపై యాజమాన్య హక్కుల కోసం సాగుతున్న న్యాయపోరాటంలో న్యాయస్థానం సంచలన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వివాదాస్పద భూమి విషయంలో 'సిలికాన్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ కోర్టును ఆశ్రయించింది. తమ ఆస్తిలోకి ఇతరులు అక్రమంగా ప్రవేశించే ప్రయత్నం చేస్తున్నారని, నిర్మాణాలకు నష్టం కలిగించే అవకాశం ఉందని పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై లోతుగా విచారణ చేపట్టిన కోర్టు, పిటిషనర్ వాదనలతో ఏకీభవిస్తూ ప్రతివాదులకు గట్టి హెచ్చరికలు జారీ చేసింది.వివాదాస్పద స్థలంలోకి ప్రతివాది షర్మిలతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, అనుచరులు ఎవరూ అడుగుపెట్టకూడదని కోర్టు స్పష్టమైన 'ఇంజక్షన్ ఆర్డర్స్' జారీ చేసింది. ఆ స్థలంలో ప్రస్తుతం ఉన్న ఎలాంటి నిర్మాణాలను కూల్చివేయడం గానీ, ధ్వంసం చేయడం గానీ చేయకూడదని తేల్చి చెప్పింది. ప్రాంగణంలోని ఇతర ఆస్తులకు ఎలాంటి నష్టం కలిగించకూడదని కఠినంగా ఆదేశించింది.

కొత్త పింఛన్లపై సీఎం రేవంత్‌కు కౌశిక్ రెడ్డి రాజీనామా సవాల్

హుజురాబాద్‌లో కొత్త పింఛన్లు ఇవ్వలేదని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శ

ఒక్క కొత్త పింఛను మంజూరు చేసినట్లు తేలితే రాజీనామా చేస్తానని సవాల్

నియోజకవర్గంలో 1,029 పింఛన్లను రద్దు చేశారని ఆరోపణ



ఈ ఆపరేషన్‌లో పులికి, ప్రజలకు హాని జరగకూడదు

ఏ.కొండూరు అటవీ ప్రాంతంలో పులి కదలికలపై నిరంతర నిఘా

థర్మల్ డ్రోన్లు, ఏఐ కెమెరా ట్రాప్‌ల వినియోగానికి పవన్ ఆదేశం

హనుమాన్ బృందాలతో విస్తృత గస్తీ

అవసరమైతే ఇతర రాష్ట్రాల రెస్క్యూ టీమ్‌ల సహకారం 2లో



ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు పరిసర అటవీ ప్రాంతాల్లో సంచరిస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న పులిని సురక్షితంగా పట్టుకునేందుకు పకడ్బందీ కార్యాచరణతో ముందుకు వెళ్లాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, అటవీ-పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. పులి కదలికలపై నిరంతర నిఘా ఉంచుతూనే, పరిసర గ్రామాల ప్రజల భద్రతకు పూర్తి భరోసా కల్పించాలని స్పష్టం చేశారు. ఏ.కొండూరు అటవీ ప్రాంతంలో ప్రస్తుత పరిస్థితి, ఇప్పటివరకు చేపట్టిన చర్యలపై ఉన్నతాధికారులతో ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు.

కార్తీక దీపోత్సవానికి ఇంద్రకీలాద్రి ముస్తాబు!


2లో



అనిరుధ్-కావ్య వెడ్డింగ్ రిసెప్షన్.. కుటుంబ సమేతంగా హాజరైన నారా లోకేశ్..

2లో

అనిరుధ్ కావ్య మారన్ వెడ్డింగ్ రిసెప్షన్‌కు హాజరైన మంత్రి నారా లోకేశ్

రాజమండ్రి మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించండి:

కూటమితోనే ఏపీ అభివృద్ధి సాధ్యమన్న పురందేశ్వరి

రాజమండ్రిలో కూటమికి పట్టం కట్టాలని పిలుపు

2024 ఎన్నికల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సుపరిపాలన అందిస్తున్నామన్న ఎంపీ

రాజమండ్రి సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారం కోసం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజమండ్రిలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని పురందేశ్వరి స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో ప్రజలు డబుల్ ఇంజిన్ ప్రభుత్వంపై విశ్వాసంతో కూటమికి పట్టం కట్టారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రభుత్వం ప్రస్తుతం సుపరిపాలన అందిస్తోందని ఆమె పేర్కొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య ఉన్న సమన్వయం, పరస్పర సహకారమే కూటమి విజయాలకు ప్రధాన బలమని తెలిపారు. నగరంలో తాగునీటి సమస్య వంటి కీలక అంశాలను పరిష్కరించడంతో పాటు మౌలిక వసతులను వేగవంతంగా అభివృద్ధి చేయాలంటే స్థానిక సంస్థల్లోనూ కూటమి విజయం కీలకమని ఆమె పేర్కొన్నారు. కాగా, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు నవంబర్ 26న పోలింగ్ జరగనుంది. కూటమి ఒప్పందంలో భాగంగా మేయర్ స్థానాన్ని బీజేపీకి కేటాయించగా, మాజీ కార్పొరేటర్ రేలంగి శ్రీదేవి ఎన్డీయే కూటమి తరఫున మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నగర ప్రగతిని కాంక్షించి ఓటర్లంతా కూటమికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని పురందేశ్వరి కోరారు.

చంద్రబాబు మూల్యం చెల్లించుకోక తప్పదు:

నేత రామకృష్ణ ఆరోపించారు. ఏపీలో ప్రస్తుతం స్థానిక ఎన్నికల్లో విపక్షాలు కనీసం పోటీ కూడా చేయలేని పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా సాగాల్సిన ఎన్నికల్లో దౌర్జన్యం పెరిగిపోయిందని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే జరుగుతుండటంతో ఆయన రాజకీయ జీవితానికి మాయని మచ్చగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. కర్నూలులో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. “అధికార పార్టీ నేతల కంటే పోలీసుల ఎక్కువ బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతున్నారు. ఈ ఎన్నికలు చంద్రబాబుకు మచ్చగా తయారయ్యాయి. దీనికి చంద్రబాబు మూల్యం చెల్లించుకోక తప్పదు. ఏపీలో ఓటు హక్కు కోసం ఎన్నికల నిర్వహణపై ప్రజలు ఉద్యమాలు చేయాలి. డబ్బులు చెల్లిస్తే ఓటు వేసే సంస్కృతిని ఈ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఎన్నికల్లో డబ్బు, దౌర్జన్యాలతో ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంగా మార్చారు“ అని ఆరోపించారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణ కోసం ప్రజలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికలు ముగిసిన తర్వాత చోటుచేసుకున్న దాడులు, దౌర్జన్యాలపై సీపీఐ ఆధ్వర్యంలో మేధావులతో ప్రత్యేక చర్చా వేదికలు, సభలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తెస్తామని వెల్లడించార్నుంరిజె

కొత్త పింఛన్లపై సీఎం రేవంత్‌కు కౌశిక్ రెడ్డి రాజీనామా సవాల్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క కొత్త పింఛను కూడా మంజూరు చేయలేదని, పైగా అర్హులైన పేదల పింఛన్లను తొలగించిందని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో పింఛన్ల అంశంపై సీఎంకు ఆయన నేరుగా రాజీనామా సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ... “ఒక్క కొత్త పింఛను ఇచ్చినా నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. లేకుంటే సీఎం పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తారా” అంటూ ఆయన సవాల్ చేశారు. తన నియోజకవర్గంలో లబ్ధిదారుల సంఖ్య పెరిగినట్లు అధికార పక్షం నిరూపిస్తే తాను క్షమాపణ చెప్పి పదవి నుంచి తప్పుకుంటానని, అలా నిరూపించలేకపోతే సీఎం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం హుజూరాబాద్‌లో దాదాపు 1,029 చేయూత పింఛన్లను రద్దు చేసిందని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. గతంలో వృద్ధులకు ఉన్న రూ. 200 పింఛన్‌ను కేసీఆర్ రూ. 2 వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ. 4 వేలకు పెంచి పేదలకు అండగా నిలిచారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గతంలో ప్రతి నెలా 45 లక్షల మందికి పింఛన్లు అందేవని పేర్కొన్నారు.

మారుతి కంపెనీలో సోనియాకు 50 శాతం వాటా:

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ లక్ష్యంగా బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే సంచలన ఆరోపణలు చేశారు. విదేశీ పౌరురాలై ఉండి కూడా ఆమెకు ఓ భారతీయ కంపెనీలో భారీగా వాటాలున్నాయని, ఆమె పేరిట భూమి కేటాయింపులు కూడా జరిగాయని పేర్కొన్నారు. శనివారం ‘ఎక్స్‘ వేదికగా “కాంగ్రెస్ చీకటి అధ్యాయం – చాప్టర్ 250“ పేరుతో ఆయన ఓ సుదీర్ఘ పోస్ట్ చేశారు. విదేశీ పౌరురాలైనప్పటికీ సోనియా గాంధీ ‘మారుతి టెక్నికల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‘ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించారని, ఆ సంస్థలో ఆమెకు 50 శాతం వాటా ఉందని ఆరోపించారు.1970 నవంబర్ 21న సోనియా గాంధీకి చెందిన ‘మారుతి టెక్నికల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‘తో సంజయ్ గాంధీ ఒప్పందం కుదుర్చుకున్నారని దూబే తెలిపారు. మారుతి సంస్థకు అసలైన యజమాని సోనియా గాంధీనే అని వ్యాఖ్యానించారు. మారుతి 1970లో ఏర్పాటవగా, కార్ల తయారీకి సంబంధించిన లేఖ 1968లోనే ప్రభుత్వానికి చేరిందన్నారు. 1969లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ తన కోడలు సోనియా నేతృత్వంలోని కంపెనీ కార్లు తయారు చేసేందుకు కేబినెట్ ఉత్తర్వులు ఇప్పించారా? అని నిలదీశారు. భారత ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక విదేశీయుడు భారతీయ సంస్థలో డైరెక్టర్ కాలేరని, మరి 1970లో సోనియా ఎలా డైరెక్టర్ అయ్యారని ప్రశ్నించారు. అప్పట్లో హర్యానా ప్రభుత్వ నిబంధనల ప్రకారం విదేశీయులకు భూమి కేటాయించే అవకాశం లేనప్పుడు సోనియా పేరిట భూమి ఎలా కేటాయించారని దూబే ప్రశ్నించారు. ప్రధానమంత్రి కార్యాలయంలో ఒక ప్రైవేట్ కంపెనీ కార్యాలయం ఎలా తెరిచారని, ప్రధాని ప్రైవేట్ సెక్రటరీ ధావన్ దానికి డైరెక్టర్ ఎలా అయ్యారని నిలదీశారు. ఎలాంటి సొంత పెట్టుబడి పెట్టకుండానే ఇంత పెద్ద కంపెనీని ఎలా నిర్మించారో సోనియా గాంధీ తన తాజా పుస్తకంలో వివరిస్తే బాగుండేదని ఎద్దేవా చేశారు. ఈ వ్యవహారాలపై 1979 నాటి జస్టిస్ ఏసీ గుప్తా కమిషన్ విచారణ నివేదికను ఉటంకిస్తూ, 1973 నుంచి 1975 మధ్య సంస్థలో సోనియా పాత్ర, ఆమె రాజీనామా వివరాలను కూడా నిషికాంత్ దూబే ప్రస్తావించారు.

పేదరికాన్ని జయించిన ప్రతిభ.. గుంటూరు అమ్మాయికి అమెజాన్‌లో రూ.46 లక్షల ఉద్యోగం

గుంటూరు జిల్లాకు చెందిన ఓ పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని తన ప్రతిభతో అంతర్జాతీయ టెక్ దిగ్గజ సంస్థ అమెజాన్‌లో అద్భుతమైన అవకాశాన్ని దక్కించుకుంది. వీవీఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) చదువుతున్న వరలక్ష్మి ఏకంగా రూ.46 లక్షల వార్షిక ప్యాకేజీతో అమెజాన్ సంస్థలో ఉద్యోగం సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది.

వరలక్ష్మి కుటుంబ నేపథ్యం అత్యంత సామాన్యమైనది. ఆమె తండ్రి రాంబాబు దినసరి కూలీగా పనిచేస్తుండగా, తల్లి లక్ష్మీ సుజాత టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా ఆ తల్లిదండ్రులు తమ పిల్లల చదువు విషయంలో ఎక్కడా రాజీపడలేదు. తల్లిదండ్రుల శ్రమను గుర్తించిన వరలక్ష్మి చదువుపైనే పూర్తి దృష్టి పెట్టింది. మొదటి నుంచీ అకడమిక్స్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ వచ్చిన ఆమె, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను ఎంతో సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే అమెజాన్ నిర్వహించిన నియామక ప్రక్రియలో ప్రతిభ చూపి ‘డేటా ఇంజినీర్ ఇంటర్న్’గా ఎంపికైంది.

కార్తీక దీపోత్సవానికి ఇంద్రకీలాద్రి ముస్తాబు!

24న అంగరంగ వైభవంగా దీపాల పండుగ

ఎనిమిది సెక్టార్లుగా విభజించి ప్రత్యేక అలంకరణలు

700 మందికి పైగా సేవాదారులతో దీపాలంకరణ

ఓం, స్వస్తిక్, శివలింగం, శ్రీచక్రం ఆకృతుల్లో రంగవల్లులు

మల్లేశ్వరాలయంలో జ్వాలాతోరణం కార్యక్రమం

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 24న ఇంద్రకీలాద్రిపై కార్తీక దీపోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న ఈ వేడుకను కనులపండువగా తీర్చిదిద్దేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ ఆదేశించారు.

ఎనిమిది సెక్టార్లలో ప్రత్యేక అలంకరణలు.. దీపోత్సవం సందర్భంగా ఇంద్రకీలాద్రి పరిసరాలను ఎనిమిది ప్రధాన సెక్టార్లుగా విభజించి ప్రత్యేక అలంకరణలు చేపడుతున్నారు. ప్రధాన ఆలయం, అష్టలక్ష్మి మండపం, ఉపాలయాలు, ఆర్జిత సేవా ప్రాంగణాలు, చిన్న రాజగోపురం, ఓం టర్నింగ్, శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయ మార్గం, మహామండపం నుంచి దిగువన కనకదుర్గ నగర్ ప్రారంభం వరకు దీపాలంకరణలు చేయనున్నారు.

700 మందికి పైగా సేవాదారులతో.. వివిధ సెక్టార్లలో ఓం, స్వస్తిక్, శివలింగం, శ్రీచక్రం వంటి ఆధ్యాత్మిక ఆకృతుల్లో రంగవల్లులు తీర్చిదిద్దనున్నారు. పూల అలంకరణలు, దీపాల ఏర్పాట్ల కోసం 700 మందికి పైగా సేవాదారులను వినియోగించనున్నారు. మామిడి తోరణాలు, అరటి చెట్లతో ఆలయ పరిసరాలను సంప్రదాయబద్ధంగా అలంకరిస్తున్నారు.

మల్లేశ్వరాలయంలో జ్వాలాతోరణం.. కార్తీక పౌర్ణమి వేడుకల్లో భాగంగా అదే రోజు రాత్రి శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో జ్వాలాతోరణం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈవో వెల్లడించారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ఈ ఆపరేషన్‌లో పులికి, ప్రజలకు హాని జరగకూడదు

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, పులి జాడను గుర్తించేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. థర్మల్ డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కెమెరా ట్రాప్‌లను విస్తృతంగా ఏర్పాటు చేసి, పులి సంచార మార్గాలను ఎప్పటికప్పుడు గుర్తించాలని నిర్దేశించారు. స్థానిక అటవీ బృందాలతో సమన్వయం చేసుకుంటూ, ప్రత్యేక ‘హనుమాన్’ (ఎ.ూా.వీ.ఖ.వీ.ూా.చీ) బృందాలతో అటవీ ప్రాంతంలో విస్తృత గస్తీ చేపట్టాలని ఆదేశించారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను పీసీసీఎఫ్, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ (సీడబ్ల్యూఎల్) స్వయంగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.క్షేత్రస్థాయిలో పరిస్థితిని బట్టి అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి అనుభవజ్ఞులైన ప్రత్యేక పులి ట్రాకింగ్, రెస్క్యూ నిపుణులను రప్పించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. వన్యప్రాణి సంరక్షణ చట్టాలు, నిర్దేశిత ప్రోటోకాల్స్‌ను పక్కాగా పాటిస్తూ ఆపరేషన్ నిర్వహించాలన్నారు. ఈ క్రమంలో అటు ప్రజలకు గానీ, ఇటు పులికి గానీ ఎలాంటి హాని జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ప్రజల ప్రాణరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూనే, వన్యప్రాణికి ఎటువంటి గాయం కాకుండా సురక్షితంగా పట్టుకోవాలని తేల్చిచెప్పారు. పులి సంచరిస్తున్న పరిసర గ్రామాల ప్రజలు, రైతులు, పశువుల కాపరులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లకుండా అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, పశు సంవర్ధక శాఖల అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని, తీసుకుంటున్న చర్యలపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని స్పష్టం చేశారు. పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చి, పులిని సురక్షితంగా బంధించే వరకు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

అనిరుధ్-కావ్య వెడ్డింగ్ రిసెప్షన్.. కుటుంబ సమేతంగా హాజరైన నారా లోకేశ్..

చెన్నై నగరంతో కుటుంబ అనుబంధాన్ని గుర్తు చేసుకున్న లోకేశ్

సూపర్ స్టార్ రజనీకాంత్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్న వైనం

మాజీ సీఎం స్టాలిన్ ప్రతిపక్ష నేత ఉదయనిధితో భేటీ

నూతన దంపతులకు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు



ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, కావ్య మారన్ ల వివాహ రిసెప్షన్ వేడుకకు ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. చెన్నైలో ఘనంగా జరిగిన ఈ వేడుకలో ఆయన పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తమిళనాడుకు చెందిన పలువురు ప్రముఖులతో ఆయన సమావేశమయ్యారు.చెన్నై నగరంతో తమ కుటుంబానికి ఉన్న ప్రత్యేక బంధాన్ని ఈ సందర్భంగా నారా లోకేశ్ గుర్తుచేసుకున్నారు. “మా కుటుంబానికి చెన్నై ఎల్లప్పుడూ ఒక ప్రత్యేకమైన నగరం. మా తాత ఎన్టీఆర్ గారు తన సినీ ప్రస్థానాన్ని ఇక్కడే నిర్మించుకున్నారు. నా తల్లిదండ్రుల వివాహం కూడా ఇక్కడే జరిగింది“ అని ఆయన పేర్కొన్నారు. అనిరుధ్, కావ్య మారన్ దంపతుల జీవితం ఎల్లప్పుడూ ప్రేమ, సంగీతం, ఆనందాలతో వర్ధిల్లాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.ఈ వేడుక సందర్భంగా భారతీయ చిత్ర పరిశ్రమ దిగ్గజం, సూపర్ స్టార్ రజనీకాంత్‌ను కలవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, ఆయన ఆశీస్సులు తీసుకున్నానని లోకేశ్ తెలిపారు. అలాగే తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌లను కూడా కలుసుకోవడం సంతోషాన్నిచ్చిందని చెప్పారు. రిసెప్షన్ వేడుకలో రజనీకాంత్, స్టాలిన్, ఉదయనిధి తదితరులతో కలిసి దిగిన ఫొటోలను నారా లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి.



విలువైన ఓటును అమ్ముకోవద్దు

ఏకంగా బ్యాలెట్ బాక్సులోనే వేసి తిరస్కరించడం ప్రజల చైతన్యానికి నిదర్శనమని చంద్రబాబు కొనియాడారు. ఇదే సమయంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల పనితీరుపై సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. కొందరు ఎమ్మెల్యేల పనితీరు పట్ల ప్రజల్లో అసంతృప్తి ఉందని, అలాంటి వారు వెంటనే తమ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. టికెట్ల సర్దుబాటు సమయంలో టీడీపీలోని ముగ్గురు నేతలు అలిగారని, ఇంత శ్రమించి పనిచేస్తుంటే అలా అలగడం తనకు ఏమాత్రం నచ్చలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా లాంటి ప్రాంతాల్లో ఆశించిన ఫలితాలు రాలేదని, అక్కడ జరుగుతున్న బలవంతపు మతమార్పిడులు, ఇతర అంశాలపై క్షేత్రస్థాయి సమీక్ష జరుపుతామన్నారు. వచ్చే పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా ఎదుగుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టం చేశారని సీఎం గుర్తుచేశారు. ప్రజలు ఇచ్చిన ఈ ఘనమైన తీర్పు తమపై మరింత బాధ్యతను పెంచిందని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా మరింత అంకితభావంతో ముందుకు సాగుతామని చంద్రబాబు స్పష్టం చేశారు.

కూటమికి తిరుగులేని ప్రజాదరణ – ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ ఈవీఎం అయినా, బ్యాలెట్ పేపర్ అయినా, పోస్టల్ బ్యాలెట్ అయినా ప్రజల తీర్పు కూటమికే అనుకూలంగా ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక పోరులో కూటమి అపూర్వ విజయం సాధించిందని గణాంకాలతో వివరించారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో 96.42 శాతం స్ట్రయిక్ రేట్, మండల పరిషత్‌లలో 93.15 శాతం, మున్సిపల్ ఎన్నికల్లో 94 శాతం స్ట్రయిక్ రేట్‌ను కూటమి దక్కించుకుందని వెల్లడించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 39.81 శాతంగా ఉన్న వైసీపీ ఓటు బ్యాంకు, ప్రస్తుత స్థానిక ఎన్నికల్లో 33.56 శాతానికి పడిపోయిందని, ఏకంగా 6.25 శాతం ఓట్లు ఆ పార్టీకి తగ్గాయని తెలిపారు. కూటమికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదరణ మరింత పెరిగిందని, ఈ ఘనవిజయంతో రాష్ట్రంలో ‘ట్రిపుల్ ఇంజిన్ సర్కార్’ ఏర్పాటైందని సీఎం పేర్కొన్నారు.

సామాన్య కార్యకర్తలు, విద్యావంతులకే జెడ్పీ పీఠాలు రాజకీయాల్లో కుటుంబ పాలన, ధన ప్రభావానికి తావులేకుండా పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడిన సామాన్య కార్యకర్తలను, విద్యావంతులను ఉన్నత పదవుల్లో కూర్చోబెట్టామని సీఎం వివరించారు. జనాభా దామాషా పద్ధతిన అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో సమన్యాయం కల్పించామన్నారు. కర్నూలు జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్‌గా 25 ఏళ్లకే ఎంబీబీఎస్ పూర్తి చేసిన షేక్ షాదికను, గంపలగూడెం జెడ్పీటీసీగా ఎంటెక్ చదివిన ఎస్సీ యువతి కోట పుల్లమ్మను గెలిపించుకున్నామని చెప్పారు. మొత్తం 22 జెడ్పీ ఛైర్‌పర్సన్ స్థానాల్లో 12 మహిళలకే ఇచ్చామని, వీరిలో 14 మంది ఉన్నత విద్యావంతులు ఉన్నారని తెలిపారు. అలాగే 20 జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ స్థానాల్లో 11 మహిళలకు కేటాయించగా అందులో 17 మంది గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లేనని వివరించారు. పల్నాడు జెడ్పీ ఛైర్‌పర్సన్‌గా యాదవ వర్గానికి చెందిన సామాన్య కార్యకర్త పుచ్చకాయల రమాదేవి, తూర్పుగోదావరిలో శెట్టిబలిజ వర్గానికి చెందిన కాడ పద్మ, కడప జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్‌గా ముస్లిం మహిళ హబీబున్నీసా, ప్రకాశం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పార్టీ యూనిట్ ఇన్‌ఛార్జి కొక్కిలిగడ్డ ప్రభాకర్ రావు, నంద్యాల జెడ్పీ ఛైర్మన్‌గా క్లస్టర్ ఇన్‌ఛార్జి షేక్ బురహానుద్దీన్, పశ్చిమ గోదావరి వైస్ ఛైర్మన్‌గా బూత్ కన్వీనర్ నాగేశ్వరరావు, అన్నమయ్య జిల్లాలో బోయ సామాజిక వర్గానికి చెందిన తలారి శరణ్యలకు అవకాశం ఇచ్చి ‘కార్యకర్తే అధినేత’ అనే సిద్ధాంతాన్ని ఆచరణలో చూపించామని చంద్రబాబు పేర్కొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రజల ఆమోదం గత ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేసి, రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామని సీఎం తెలిపారు. తీవ్ర ఎల్‌నినో ప్రభావం, వరుసగా రెండు తుఫాన్లు రాష్ట్రాన్ని తాకిన సమయంలో తమ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్పందించి ఆదుకుందన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ సంస్థలను రూ.1.30 లక్షల కోట్ల అప్పుల్లో ముంచి, ప్రజలపై రూ.32 వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారం మోపిందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్ల కాలంలో కరెంటు ఛార్జీలు పైసా కూడా పెంచలేదని స్పష్టం చేశారు. పోలవరం ద్వారా గోదావరి జలాలను విశాఖపట్నం, కృష్ణా డెల్టాకు తరలించే దిశగా పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు.

హే రామ్.. ఆంధ్రప్రదేశ్ ను కాపాడు

ప్రస్తుతం రాష్ట్రంలో ‘ఫ్రీ అండ్ ఫెయిర్‘ ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితులు పూర్తిగా కనుమరుగయ్యాయని జగన్ ఆరోపించారు. విపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడమే కాకుండా, దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను అధికారులే నేరుగా చించివేశారని ఆయన ఆరోపించారు. పోలింగ్ కేంద్రాలను ఆక్రమించి ఓట్లను అపహరిస్తున్నారని, చివరకు ఎన్నికల్లో గెలిచిన వారిని కూడా ఓడినట్లుగా ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు. రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), పోలీసులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై ఫలితాలను ప్రభావితం చేస్తున్నారని, ఎన్నికల సంఘం కూడా అధికార పార్టీ చర్యలను అడ్డుకోవడంలో విఫలమైందని జగన్ విమర్శించారు. గత ఐదేళ్ల తమ పాలనలో రాష్ట్రం ఎంతో సుస్థిరంగా, ప్రశాంతంగా సాగిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటూ వ్యవస్థలు పూర్తిగా భ్రష్టుపట్టాయని జగన్ పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిలపై జరిగిన హత్యాయత్నాల ఘటనలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపై స్థానిక టీడీపీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు పెద్ద సంఖ్యలో దాడికి దిగారని, పోలీసుల ముందే వాహనాలకు నిప్పంటించి చంపే ప్రయత్నం చేశారని జగన్ ఆరోపించారు. ఇలాంటి దారుణాలకు పాల్పడిన వారికి ప్రభుత్వం కొమ్ముకాస్తూ, బాధితులపైనే అక్రమ కేసులు నమోదు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల్లో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన పలు వీడియోలను వైఎస్ జగన్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. రాష్ట్రంలో పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొంటూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ జగన్ తన పోస్ట్‌లో పిలుపునిచ్చారు.

కొత్త ఎయిర్‌లైన్స్‌కు భోగాపురం కేంద్రస్థానం కావాలి:

కొత్తగా వచ్చే విమానయాన సంస్థలకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధాన స్థావరంగా (బేస్) మారాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. దేశవ్యాప్తంగా విమానయాన రంగాన్ని విస్తరించే క్రమంలో మరిన్ని కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్రం వద్ద పరిశీలనలో ఉన్నాయని ఆయన వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్‌లో ఎయిర్‌పోర్టుల నెట్‌వర్క్ విస్తరణపై మాట్లాడిన కేంద్రమంత్రి... కుప్పం, పలాస ప్రాంతాల్లో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ఆయా ప్రాంతాల ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో జరిగిన పెట్టుబడుల సదస్సుల గురించి ప్రస్తావిస్తూ... వైజాగ్‌కు సీఐఐ సమ్మిట్‌లు కొత్తేమీ కాదని రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఇప్పుడే కాకుండా, గతంలోనూ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీఐఐ సమ్మిట్‌తో పాటు అనేక అంతర్జాతీయ సదస్సులను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారని గుర్తుచేశారు. ఆ సదస్సుల ద్వారానే ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించగలిగామని ఆయన పేర్కొన్నారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన సీఐఐ సదస్సు దేశంలోనే ఇంతకుముందెన్నడూ జరగని రీతిలో అత్యంత ఘనంగా జరిగిందని, ఇది రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ఎంతగానో దోహదపడుతుందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

యలహంక ప్యాలెస్ భూవివాదంలో బిగ్

బుచ్చంపల్లిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి మద్దతుగా పోతిరెడ్డి నాగార్జున రెడ్డి ఇంటింటి ప్రచారం

సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం.. 2029లో జగనన్న అధికారంలోకి రావడం ఖాయం: నాగార్జున రెడ్డి

పోరుమామిళ్ల, నవంబర్ 21(నంది పత్రిక):బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల మండలం కవలకుంట్ల గ్రామపంచాయతీ పరిధిలోని బుచ్చంపల్లి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపిన అభ్యర్థికి మద్దతుగా మాజీ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి, మాజీ సర్పంచ్, సీనియర్ అడ్వకేట్ కె. ప్రభాకర్ రావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఓటు వేసి మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచారంలో పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోతిరెడ్డి నాగార్జున రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు ముఖ్యమంత్రి కాకముందు సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించి, జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాల కంటే ఎక్కువ ప్రయోజనాలు ప్రజలకు అందిస్తామని హామీ ఇచ్చి ఓట్లు పొందారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫల మయ్యారని ఆరోపించారు. సంపద సృష్టిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో అగ్రస్థానానికి చేర్చిందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని పక్కనపెట్టి అధికారులను, పోలీసులను అడ్డుపెట్టుకుని మున్సి పాలిటీలు, కార్పొరేషన్లు, ఎంపీ టీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ఏకగ్రీవం చేసుకున్నారని ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల ప్రక్రియలో ఇలాంటి పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రజల్లో ఇప్పటికే తెలుగుదేశం పార్టీపై వ్యతిరేకత పెరుగుతోందని, 2029లో వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా



వ్యక్తం చేశారు. జిల్లా ఎస్సీ సైతం గ్రామపంచాయతీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని ప్రకటించారని గుర్తుచేస్తూ, ఓటర్లు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. బుచ్చంపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపిన అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నాగార్జున రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

వైఎస్ఆర్సిపి నాయకుడిపై హత్యాయత్నం.. తీవ్రంగా ఖండిస్తున్నాం.. మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి



నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 21 (నంది పత్రిక) శ్రీశైలం నియోజకవర్గ పరిధిలోని శ్రీశైలంలో వైఎస్ఆర్సిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు పుల్లయ్యపై శుక్రవారం రాత్రి జరిగిన దాడి ఘటనను మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ దాడికి టీడీపీ వర్గీయులే కారణమని ఆయన ఆరోపించారు. దాడిలో తీవ్రంగా గాయపడి నంద్యాల జిల్లా సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పుల్లయ్యను శనివారం శిల్పా చక్రపాణి రెడ్డి మరియు వైఎస్ఆర్సిపి ముఖ్య నేతలు పరామర్శించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న ఆయన, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ.. పలు అంశాలను ప్రస్తావించారు..దాడిపై ఆరోపణలు: శ్రీశైలం దేవస్థానం పరిధిలో పుల్లయ్యపై టీడీపీకి చెందిన మణికంఠ, కాశయ్య, భూపాల్‌తో పాటు మరో పదిమంది కర్రలు, రాడ్లతో హత్యాయత్నానికి పాల్పడ్డారని శిల్పా ఆయన ఆరోపించారు. పవిత్ర పుణ్యక్షేత్ర ప్రాంతంలో ఇలాంటి ఘటనలు జరగడం విచారకరమని అన్నారు. ప్రభుత్వ పనితీరుపై విమర్శలు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 'రెడ్ బుక్ రాజ్యాంగం' అమలు చేస్తోందని ఆయన విమర్శించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు మరియు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలలో వైఎస్ఆర్సిపి బలపరిచిన అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా టీడీపీ నాయకులు పోలీసుల సహకారంతో అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. హెచ్చరిక మరియు డిమాండ్లు: ప్రస్తుతం జరుగుతున్న దాడులు, ఘటనలన్నింటినీ తాము 'డిజిటల్ బుక్'లో నమోదు చేస్తున్నామని, భవిష్యత్తులో వైఎస్ఆర్సిపి అధికారంలోకి వచ్చిన తర్వాత చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, శ్రీశైలం ప్రాంతంలో ప్రశాంతతను కాపాడుతూ వైఎస్ఆర్సిపి నాయకులకు తగిన రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం బిఓ ఎస్ డి ప్రియదర్శిని



నంద్యాల ప్రతినిధి. నవంబర్ 21 . (నంది పత్రిక):నంద్యాల జిల్లా కేంద్రంలో ఎన్నికల కవరేజీలో భాగంగా డిపిఆర్ఓ శాఖ కొన్ని పత్రికలకు ఎలక్షన్ పాసులు మంజూరు చేయలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పాత్రికేయుల సమస్యను పరిష్కరిస్తామని ఓఎస్డి ప్రియదర్శిని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పవన్ ,అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ ఎన్నికల కవరేజీలో డిపిఆర్ఓ శాఖ సిబ్బంది కొన్ని పత్రికలకు ఎలక్షన్ పాసులు ఇవ్వనందున పోలింగ్ బూతులలో పోలీసుల నుండి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు చాలా జిల్లాలలో అన్ని పత్రికలకు ఎలక్షన్ పాసులు మంజూరు చేశారు.కావున జిల్లా కలెక్టర్ డిపిఆర్ఓ శాఖకు ఆదేశాలు ఇచ్చి మాకు ఎలక్షన్ పాసులు మంజూరు చేస్తారని మా సమస్యను పరిష్కరిస్తారని ఆశిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో బొజ్జ నాగేంద్ర, మస్తాన్, మహేష్ యాదవ్, ఎస్ఎండి రఫీ ,నాగేంద్ర ఇక్బాల్ , శీను, జై భరత్ రెడ్డి ,నాగరాజు, పవన్,ఎలిజబెత్ రాణి , దాస్, మజీద్,తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ

100 మంది చిన్నారులకు పలకలు, బలపాలు, రంగు పెన్సిళ్ల అందజేత



ఖాజీపేట,(నంది పత్రిక) నవంబర్ 21 ఖాజీపేట ఫ్రెండ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం ఖాజీపేట పట్టణంలోని ముస్లిం మైనారిటీ షాదీఖానాలో అంగన్‌వాడీ చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 100 మంది చిన్నారులకు ఒక్కొక్కరికి ఒక పలక, ఒక బలపాల కట్ట, ఒక రంగు పెన్సిళ్ల ప్యాకెట్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖాజీపేట మండల తహసీల్దార్ క్రాంతి కుమార్, ఖాజీపేట ఫ్రెండ్స్ సేవా సంఘం అధ్యక్షుడు షేక్ హాజీ గౌస్‌తో కలిసి చిన్నారులకు విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరి విద్యాభ్యాసం పలక, బలపంతోనే ప్రారంభమవుతుందని, విద్య ద్వారానే ఉన్నత స్థాయికి ఎదగడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. చిన్నారుల విద్యాభివృద్ధికి ఉపయోగపడే విధంగా విద్యా సామగ్రిని పంపిణీ చేసిన ఖాజీపేట ఫ్రెండ్స్ సేవా సంఘం సేవలను అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు సైతం చిన్నారులకు విద్యా సామగ్రి అందించినందుకు సంఘం సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ సయ్యద్ ఇమామ్ బాషా, ట్రెజరర్ షేక్ సగిర్ అహమ్మద్, అడ్వైజర్ షేక్ అల్లా బకష్, ఈసీ సభ్యులు షేక్ మొహమ్మద్ హుస్సేన్ (సోనీ ట్రైలర్), షేక్ గౌస్ లాజం, షేక్ ఇంతియాజుద్దీన్, సంఘం సభ్యులు షేక్ మొహమ్మద్ అలీ, షేక్ చాంద్ బాషా, షేక్ కరీం సార్, బి. ప్రకాష్, చౌడయ్య, నజీర్, మౌలానా జవిద్, ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ముఖ్య అతిథి తహసీల్దార్ క్రాంతి కుమార్, అంగన్‌వాడీ టీచర్లు, సంఘం సభ్యులు, ఇతర సహకారులందరికీ సంఘం అధ్యక్షుడు షేక్ హాజీ గౌస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అడవిలో తప్పిపోయిన 69 ఏళ్ల యజమానిని కాపాడిన పెంపుడు కుక్క!

కుక్కను అత్యంత విశ్వాసంగల జంతువుగా ఎందుకు అంటారో మరోసారి నిరూపితమైంది. అమెరికాలోని న్యూయార్క్‌లో గడ్డకట్టే చలిలో, దట్టమైన అడవిలో చిక్కుకుపోయిన 69 ఏళ్ల వృద్ధుడి ప్రాణాలను ఆయన పెంపుడు కుక్క కాపాడింది. డిమెన్షియా (మతిమరుపు)తో బాధపడుతున్న ఆ వృద్ధుడు రాత్రంతా అడవిలోనే ఉండిపోగా, ఆయన వెంట ఉన్న 'బెక్కీ' అనే బాసెట్ హౌండ్ జాతి పెంపుడు కుక్క సమయస్ఫూర్తితో వ్యవహరించి యజమాని ప్రాణాలను నిలబెట్టింది.నవంబర్ 12, గురువారం రాత్రి 9 గంటల సమయంలో న్యూయార్క్‌లోని అడిరోండాక్స్ ప్రాంతంలో ఉన్న వైట్‌ఫేస్ మౌంటెన్ లాడ్జిలోకి 'బెక్కీ' ఒంటరిగా నడుచుకుంటూ వచ్చింది. అక్కడి సిబ్బంది ఆ కుక్కను వెంటనే గుర్తుపట్టారు. దాని యజమానికి మతిమరుపు ఉందని, గతంలో కూడా ఆయన తప్పిపోయిన సందర్భాలు ఉన్నాయని వారికి తెలుసు. దీంతో యజమాని లేకుండా కుక్క ఒక్కటే రావడంతో అనుమానం వచ్చిన సిబ్బంది, వెంటనే న్యూయార్క్ స్టేట్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అప్రమత్తమై రంగంలోకి దిగారు. బాధితుడిని రక్షించేందుకు 14 మంది ఫారెస్ట్ రేంజర్లు, స్టేట్ పోలీసులు, ఏవియేషన్ సిబ్బందితో కూడిన భారీ రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభమైంది.

ప్రశాంతంగా కొనసాగుతున్న సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు

ఖాజీపేట (నంది పత్రిక)నవంబర్ 21 వైఎస్సార్ కడప జిల్లా ఖాజీపేట మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా కొనసాగుతోంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఖాజీపేట పోలీసులు అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు పోలీసులు అవసరమైన సహకారం అందిస్తూ, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నారు. అభ్యర్థులు నామినేషన్ కేంద్రాలకు చేరుకున్నప్పటి నుంచి నామినేషన్ దాఖలు చేసే వరకు పోలీసు సిబ్బంది దగ్గరుండి తగిన సూచనలు, సహకారం అందిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వద్ద ఎన్నికల నిబంధనలు పాటించేలా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఖాజీపేట మండలంలో ఇప్పటివరకు నామినేషన్ల ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా కొనసాగుతోంది.

సింగవరంలో ఇండ్ గ్యాప్ పొలంబడి క్షేత్ర పరిశీలన



బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 21: బండి ఆత్మకూరు మండల పరిధిలోని సింగవరం గ్రామంలో ఏఓ పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండి గ్యాప్ పొలంబడి వరి పంటను సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ మొహమ్మద్ సుహెల్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు 30 మంది రైతులను మహానంది అరటి ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్ పి ఓ)తో అనుసంధానం చేసి 10 హెక్టార్లలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఏఓ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ ప్రోడక్ట్ సర్టిఫికేషన్ (ఏపీఎస్ ఓ బి సి) సీట్ సర్టిఫికేషన్ అధికారి మొహమ్మద్ సుహెల్ మాట్లాడుతూ తక్కువ సాగు ఖర్చుతో మిత్ర పురుగులను సంరక్షిస్తూ, రసాయనిక పురుగు మందులు, ఎరువులను తగ్గించి, సేంద్రియ పదార్థాల వాడకంతో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి పొలంబడి ఉపయోగపడుతుందని అన్నారు. నాణ్యమైన ఉత్పత్తులను సాధిస్తూ ఇండ్ గ్యాప్ సర్టిఫికెట్ పొందడం వల్ల రైతులు ఎగుమతి ప్రణాళిక అనుగుణంగా పంట నికర ఆదాయం పెంచుకోవచ్చని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు వ్యవసాయ విస్తరణ అధికారి అప్రఫ్, లక్ష్మయ్య ఆర్ఎస్కే సిబ్బంది ప్రియాంక పలువురు రైతులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో నాలుగు హోటళ్ల లైసెన్సులు రద్దు..

హైదరాబాద్ నగరంలోని ప్రముఖ రెస్టారెంట్లలో ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారులు (+ ూూఖీఱు) కఠిన చర్యలు తీసుకున్నారు. వినియోగదారుల ఆరోగ్యానికి ముప్పు కలిగించేలా తీవ్ర లోపాలకు పాల్పడిన నాలుగు హోటళ్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఖీూూ×) లైసెన్సులను తక్షణమే సస్పెండ్ చేశారు. వీటితో పాటు అనుమతులు లేకుండా నడుస్తున్న ఒక హాస్టల్, బేకరీలను మూసివేయించారు.లైసెన్సులు రద్దయిన వాటిలో మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని 'మాదాపూర్ బావర్చి', కూకట్‌పల్లిలోని 'ది స్టైస్ కిచెన్', టోలిచౌకిలోని 'మతామ్ అల్ యమాని అరేబియన్ రెస్టారెంట్', చందానగర్‌లోని 'అన్నపూర్ణ క్యాటరర్స్' ఉన్నాయి. ఈ నాలుగు సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో తీవ్రమైన అపరిశుభ్ర పరిస్థితులు వెలుగుచూశాయి. వంటగదుల్లో బొద్దింకలు, ఎలుకల విసర్జితాలు సంచరిస్తున్నట్లు గుర్తించారు. ఫ్రిడ్జ్‌లలో శాకాహారం, మాంసాహారాన్ని నిబంధనలకు విరుద్ధంగా కలిపి నిల్వ ఉంచడం, నాసిరకం సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగించడం, కిచెన్ నేలలు దెబ్బతినడం, గోడలు పొగతో నిండి ఉండటం వంటి సమస్యలు కనిపించాయి.

చిన్నయరసాల అభివృద్ధే నా లక్ష్యం.. గెలిపిస్తే మాటల్లో కాదు చేతల్లో చూపిస్తా: కల్లూరి దశరథ రామిరెడ్డి

అమ్మడకుంట చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణకు కృషి.. డ్రైనేజీ, విద్యుత్, సీసీ రోడ్ల నిర్మాణానికి హామీ



పోరుమామిళ్ల, నవంబర్ 21 (నంది పత్రిక):వైఎస్ఆర్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం చిన్నయరసాల గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కల్లూరి దశరథ రామిరెడ్డి పోటీ చేస్తున్నారు. గతంలో 200506 సంవత్సరంలో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన ఆయన, మరోసారి గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ప్రజల ముందుకు వచ్చారు. ఈసారి గ్రామ ప్రజలందరూ తనకు సహకరించి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.సర్పంచ్‌గా తనను గెలిపిస్తే మాటల్లో చెప్పడం కంటే చేతల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తన ఆధ్వర్యంలో బలంగా కృషి చేసి, పోరుమామిళ్ల చెరువు నుంచి అమ్మడకుంట చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తీసుకురావడంలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు.ఈ నీటి వసతి ద్వారా తిమ్మారెడ్డిపల్లి నుంచి సిద్ధమూర్తిపల్లె వరకు దాదాపు 11 చెరువులకు నీరు అందించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నిలిచిపోయిన లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థను తిరిగి పునఃప్రారంభించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అదేవిధంగా గ్రామపంచాయతీ పరిధిలో డ్రైనేజీ సమస్యల పరిష్కారం, విద్యుత్ సదుపాయాల మెరుగుదల, సీసీ రోడ్ల నిర్మాణం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానన్నారు.ఎవరి దగ్గరా ఒక్క రూపాయి ఆశించకుండా, తనకు వచ్చే జీతాన్ని సైతం గ్రామాభివృద్ధికి వినియోగిస్తూ, కార్యకర్తలు, గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడతానని కల్లూరి దశరథ రామిరెడ్డి స్పష్టం చేశారు. గ్రామ ప్రజలు తనకు ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు.

ఓంకార క్షేత్రంలో సివిల్ జడ్జి పూజలు



బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 21: కార్తీక మాసం సందర్భంగా నంద్యాల రెండవ అదనపు సివిల్ జడ్జి ఎస్ తంగమణి ఓంకార పుణ్యక్షేత్రంలో పూజలు నిర్వహించారు. సివిల్ జడ్జి తంగమణి ఓంకార దేవస్థానమునకు విచ్చేసిన సందర్భంగా ఆలయ చైర్మన్ అల్లే చెన్నారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగప్రసాద్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిద్దేశ్వర స్వామి వారికి అమ్మవారికి అభిషేకము కుంకుమార్చన పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను సివిల్ జడ్జికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు భాస్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలు పక్కనే నడుస్తూ కుమార్తెకు వీడ్కోలు పలికిన తల్లిదండ్రులు.. ఎమోషనల్ వీడియో వైరల్

పిల్లలు దూర ప్రాంతాలకు వెళుతున్నప్పుడు తల్లిదండ్రులు వీడ్కోలు చెప్పే క్షణాలు ఎంతో భావోద్వేగంతో కూడుకున్నవి. పైకి నవ్వుతూ సాగనంపుతున్నా.. లోపల వారి మనసు పడే వేదన అంతా ఇంతా కాదు. తాజాగా ఓ యువతి తన రైలు ప్రయాణానికి ముందు తల్లిదండ్రులు వీడ్కోలు పలికిన తీరును కెమెరాలో బంధించి సోషల్ మీడియాలో పంచుకోగా, ఆ దృశ్యాలు నెటిజన్ల మనసులను తీవ్రంగా కదిలిస్తున్నాయి.

శ్రీ సర్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయమంతా గంటల మోత కార్తీక మాసం సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు. ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు.



సిరివెళ్ల (నంది పత్రిక) నంద్యాల ఒంగోలు జాతీయ రహదారిలో అభయారణ్యంలో వెలసిన శ్రీ సర్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం శనివారం నాడు భక్తులతో కిటకిటలాడింది. శనివారం సందర్భంగా శ్రీ సర్వ లక్ష్మీనరసింహస్వామిని ఉదయాన్నే శుద్ధి చేసి నూతన వస్త్రాలు ధరించి ఆకు పూజ తీర్థ అభిషేకాలు కుంకుమార్చనతో పాటు ప్రత్యేకముగా అలంకరణతో రంగురంగులతో కూడిన పుష్పాలతో వివిధ రకాల పండ్లతో శ్రీ సర్వ లక్ష్మీ నరసింహ స్వామిని అలంకరించి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్ర మాట్లాడుతూ దాదాపుగా నేను చైర్మన్ అయినప్పటినుండి ఆలయ ఈవో సాయి జయచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో పైపులైను మరియు త్రాగునీటి వసతి మరియు సిసి కెమెరాలు అన్ని ఏర్పాటు చేశానని భక్తుల మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించానని తెలిపారు. కార్తీక మాస సందర్భంగా శనివారం శనివారం నాడు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగంగా స్వామివారి ఆలయంలో భజన కార్యక్రమం ఏర్పాటు చేసి వచ్చినటువంటి భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో దాసధర్మ చారిటబుల్ ట్రస్ట్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వర్ రెడ్డి పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఘనంగా అండర్ 19 యోగ రాష్ట్రస్థాయి పోటీలు



జూపాడుబంగ్లా, నవంబర్: 21 :(నంది పత్రిక) మండల కేంద్రంలోస్థానికజెడ్పీ జూనియర్ కళాశాల నందు అండర్ 19 యోగ రాష్ట్రస్థాయి పోటీలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాశాఖ అధికారి చిన్న మద్దిలేటి కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ మూర్తి విశిష్ట అతిథులుగా ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండే నాగరాజు, అవినాష్ శెట్టి ఆంధ్రప్రదేశ్ యోగ జనరల్ సెక్రటరీ వైస్ ప్రిన్సిపల్ దామోదర్ రెడ్డి పాల్గొని క్రీడలను విజయవంతం నిర్వహించారు. అనంతరం క్రీడాకారులు ప్రదర్శించిన యోగ విన్యాసాలు అందర్నీ అలరించాయి.ఈ కార్యక్రమంలో విజయభాస్కర్ రెడ్డి, నంద్యాల డిస్ట్రిక్ట్ యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ మునిస్వామి, కర్నూల్ డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రెటరీ యోగా అసోసియేషన్ పాల్గొన్నారు. టోర్నమెంట్లో జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు రియాజ్ సుధాకర్, లోకేశ్వరి ,వ్యాయామ ఉపాధ్యాయులు నరేంద్ర శ్రీనివాసులు,ప్రభాకర్ 13 జిల్లాలకు సంబంధించిన 150 మంది క్రీడాకారులు మరియు వివిధ జిల్లాలకు సంబంధించిన టీం మేనేజర్స్ అండ్ కోర్చెస్ పాల్గొన్నారు.



అన్ని దానాలలో కల్ల అన్నదానం మిన్న

పెంచలకోనలో భక్తులకు అన్నప్రసాధం అందివ్వడం అదృష్టంగా భావిస్తున్నాము

శ్రీ కాకతీయ కమ్మ అన్నదాన సేవా సమితి అధ్యక్షులు తరిగోపుల లక్ష్మీనారాయణ

రాజంపేట (నంది పత్రిక ప్రతినిధి)నవంబర్ 21: అన్ని దానాలలో కల అన్నదానం మిన్న అని శ్రీ కాకతీయ కమ్మ అన్నదాన సేవా సమితి అధ్యక్షులు తరిగోపుల లక్ష్మీనారాయణ తెలిపారు. నవనారసింహ క్షేత్రాలలో ప్రసిద్ధి చెంది పెంచలకోనలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రానికి దర్శనానికి వచ్చిన భక్తులకులకు శనివారం శ్రీ కాకతీయ కమ్మ అన్నదాన సేవా సమాజం వారి ఆధ్వర్యంలో వందల మంది భక్తులకు పువ్వాడ రామ సుబ్బయ్య దంపతుల సహకారంతో అన్నప్రసాద వితరణ చేసినట్లు అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ తెలిపారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ చౌదరి మాట్లాడుతూ అన్ని దానముల కన్నా అన్న దానం మిన్న అనే లక్ష్యం తో పెంచలకోనలో తమ సేవా సమితి భక్తులకు అన్న ప్రసాద రూపంలో సేవ చేస్తున్నదని ఇది తమకు కలిగిన అదృష్టంగా తాము భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యక్షులు కొల్లపనేని శివాజీ నాయుడు, కమిటీ సభ్యులు నూతల పాతి సుధాకర్ నాయుడు, సింగన నారాయణ నాయుడు, పెనిగలపాటి చంద్ర నాయుడు, రావూరి శ్రీనివాసులు నాయుడు, పెనిగలపాటి రామకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ప్రపంచ టెలివిజన్ దినోత్సవం.

నిర్వహించిన నంద్యాల టీవీ టెక్నీషియన్స్ సంఘం

విశ్వ నగర్ మోడల్ ప్రైమరీ స్కూల్ బాలలకు పుస్తకాలు,పలకల పంపిణీ

టీవీ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి సహకరిస్తాం: డాక్టర్ రవి కృష్ణ



నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 21 (నంది పత్రిక) శనివారం ప్రపంచ టెలివిజన్ దినోత్సవం సందర్భంగా నంద్యాల టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్వ నగర్ మోడల్ ప్రైమరీ స్కూల్ బాలలకు పుస్తకాలు,పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని టెలివిజన్ రూపకర్త బైర్డ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. డాక్టర్ రవి కృష్ణ, అసోసియేషన్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి సభ్యులకు,బాలలకు పంచిపెట్టారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ టెలివిజన్ సాంకేతికత నిరంతరం మార్పు చెందుతూ ఉంటుందని తదనుగుణంగా తమ పరిజ్ఞానాన్ని టీవీ టెక్నీషియన్స్ మెరుగుపరుచుకోవాలని, వినియోగదారుడికి నాణ్యమైన,నమ్మకమైన సేవలు అందించడం ద్వారా వృత్తిలో మంచి ఫలితాలు అందుతాయన్నారు. ప్రపంచ టెలివిజన్ దినోత్సవం సందర్భంగా ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. నంద్యాల లో టీవీ టెక్నీషియన్స్ కు జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతిక పై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లీలావతి,నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్ సంఘం అధ్యక్షులు కన్నయ్య,నంద్యాల పట్టణ టీవీ టెక్నీషియన్ సంఘం గౌరవ అధ్యక్షులు జైపాల్,అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి,జిల్లా సంఘం ఉపాధ్యక్షులు రహీం,పట్టణ సంఘం ఉపాధ్యక్షులు ఇలియాస్,సెక్రెటరీ వీరారెడ్డి,జాయింట్ సెక్రెటరీ ఎల్లా గౌడ్,ట్రెజరర్ గోకారి,గౌరవ సలహాదారులు రెహమాన్,షేక్ మహబూబ్ బాషా, శివ యాదవ్,నంద్యాల పట్టణ టీవీ టెక్నీషియన్ సంఘం సభ్యులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



నంద్యాల మున్సిపాలిటీ నూతన కూటమి కౌన్సిలర్లతో మంత్రి ఎన్ఎండి ఫరూక్ సమీక్షా సమావేశం



నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 21(నంది పత్రిక) నంద్యాల పట్టణంలోని మంత్రిగారి క్యాంపు కార్యాలయంలో నంద్యాల మున్సిపాలిటీకి నూతనంగా ఎన్నికైన కూటమి కౌన్సిలర్లతో శనివారం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 23వ తేదీన జరగనున్న నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం సందర్భంగా వ్యవహరించవలసిన పద్ధతులు, అనుసరించాల్సిన నియమావళి మరియు తీసుకోవాల్సిన చర్యలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ , నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , మరియు నంద్యాల మున్సిపల్ నూతన చైర్మన్ డాక్టర్ బాబన్ కౌన్సిలర్లకు దిశానిర్దేశం చేశారు. ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని క్రమశిక్షణతో, విజయవంతంగా నిర్వహించాలని వారు సూచించారు. ఈ సమావేశంలో మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఏ.వి. సుబ్బారెడ్డి , నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు , నూతన కౌన్సిలర్లు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



సాగునీరు విడుదలపై మంత్రి ఎన్ఎండి ఫరూక్ కి ఐదు గ్రామాల రైతుల కృతజ్ఞతలు

నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 21 (నంది పత్రిక) నంద్యాల నియోజకవర్గ పరిధిలోని పాండురంగాపురం, చాపిరేవుల, కానాల, పుసలూరు, మిట్నాల గ్రామాలకు చెందిన రైతులు తమ పంటలకు సాగునీరు అందించాలని కోరుతూ గత మూడు రోజుల క్రితం రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని వారి నంద్యాల కార్యాలయం నందు కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. రైతుల విజ్ఞప్తిపై తక్షణమే సానుకూలంగా స్పందించిన మంత్రి ఫరూక్ సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా గ్రామాల పంట పొలాలకు సాగునీటిని విడుదల చేయించారు. సకాలంలో సాగునీరు అందడంతో పంటలకు ప్రాణం పోసినట్లయిందని పేర్కొంటూ, ఐదు గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను తక్షణమే పరిష్కరించిన మంత్రి ఫరూక్ కు రైతులందరూ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.



మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ... కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలి.



కర్నూల్ సిటీ నంది పత్రిక గ్రామ పంచాయతీ ఎన్నికల మూడో దశ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా శనివారం జి. సింగవరం, సుంకేసుల, ఉల్చాల, గార్గేయపురం, నందనపల్లి గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాలను ఎస్పీ సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో అనవసర వ్యక్తుల సంచారాన్ని నియంత్రించాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీసు అధికారులకు సూచించారు.నామినేషన్ల ప్రక్రియ నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు.పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. ఎస్పీ వెంట సీఐలు తేజమూర్తి, శేషయ్య, మారుతి శంకర్, పార్థసారథి, ఎస్ఐలు ఉన్నారు.

నటువ వివాహానికి హాజరైన వైసిపి నాయకులు.



బేతంచెర్ల నవంబర్ 21 (నందిపత్రిక) బేతంచెర్ల పట్టణానికి చెందిన నటువ సుధాకర్ & ధర్మావతమ్మ దంపతుల కుమారుడు మహేంద్ర & భావన వివాహం బేతంచెర్ల పట్టణంలోని శ్రీ షిరిడి సాయి బాబా ఫంక్షన్ హాల్లో శనివారం నాడు జరిగింది.ఈ వివాహానికి హాజరైన మాజీ ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ మాజీ చైర్మన్ సిహెచ్. చలం రెడ్డి, మండల సీనియర్ వైసీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్, మాజీ కౌన్సిలర్ ఇబ్రహీం, వైసిపి నాయకులు పిక్కిలి మనోహర్ నాయుడు తదితరులు హాజరై నూతన దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

మూడు గ్రామాల అభివృద్ధే నా లక్ష్యం

పసుపల గ్రామ సర్పంచ్ అభ్యర్థి బి వి సుబ్బారెడ్డి



కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూలు జిల్లా కోడుమూరు అసెంబ్లీ కర్నూలు రూరల్ మండలం పసుపుల గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా బిజెపి రాష్ట్ర నాయకులు బి వి సుబ్బారెడ్డి గ్రామ సర్పంచ్ గా మరియు వార్డు సభ్యులు చెన్నయ్య గౌరీ నామినేషన్ లను ఎన్నికల అధికారికి దాఖలు చేశారు పసుపుల నూతనపల్లె సూదిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ మూడు గ్రామాల అభివృద్ధే లక్ష్యం గెలిపిస్తే చేసి చూపిస్తానని ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు తనను సర్పంచ్ అభ్యర్థిగా గెలిపిస్తే మూడు గ్రామాలను అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు ముఖ్యంగా హిందూ శ్మశానవాటిక అభివృద్ధి ముస్లింలకు సంబంధించిన స్థలానికి కాంపౌండ్ వాల్ నిర్మాణం వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు అంతేకాకుండా తన సొంత నిధులతో మూడు గ్రామాలలో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తానని ప్రకటించారు గ్రామాల అభివృద్ధి కోసం వ్యక్తిగతంగా నా సొంత నిధులు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రజలు తనకు అవకాశం కల్పించాలని అన్నారు ఈకార్యక్రమంలో వేల్పులగోపాల్,ప్రకాష్ రెడ్డి బెస్తఈరన్న కరీంముల్లా సద్దాలకిషోర్ ప్రసాద్ వార్డు సభ్యులు చెన్నయ్య గౌరీ నామినేషన్ దాఖలు చేశారు.

విద్యార్థులు చదువుతో పాటు పరిశోధనా పద్ధతులను నేర్చుకోవాలి ఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూల్ సిటీ నంది పత్రికవిద్యార్థులు చదువుతో పాటు పరిశోధనా పద్ధతులను నేర్చుకోవాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు సూచించారు.నగరంలోని మాంటెస్సోరి ఇండస్ పాఠశాలలో 32 వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి ప్రాజెక్ట్ పోటీలను ఆయన ప్రారంభించారు... ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పలు సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించి వాటి వివరాలు తెలుసుకున్నారు.. అనంతరం ఎంపీ నాగరాజు మాట్లాడుతూ సైన్స్ మరియు టెక్నాలజీని ఉపయోగించి సమాజంలోని సమస్యలను చిన్న వయసులోనే పరిష్కరించే ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలన్నారు.. సైన్స్ కాంగ్రెస్ వంటి కార్యక్రమాలు విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, వారిని భవిష్యత్ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు.

కొత్తూరు సుబ్బరాయునిలో అన్నదానమునకు 50 వేలు విరాళం..!

పాణ్యం ప్రతినిధి. నవంబర్ 21. నంది పత్రిక:ప్రముఖ శైవక్షేత్రం, పాణ్యం మండలం, ఎస్.కొత్తూరు గ్రామంలో వెలసియున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానము నందు భక్తుల సౌకర్యార్థం నిర్వహించబడుతున్న అన్నదానమునకు శనివారం బండి నాగిరెడ్డి రూ. 50,116/-లు విరాళంగా సమర్పించారని ఆలయ ఈవో యం.రామకృష్ణ తెలిపారు. ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామానికి చెందిన కీ॥ శే॥ బండి గోపాల వెంకటస్వామి, సతీమణి కీ॥ శే॥ నారాయణమ్మ కుమారుడు కీ॥ శే॥ బండి వెంకటరమణ ల జ్ఞాపకార్థం ఆగస్టు 7వ తేదీన అన్నదానం నిర్వహించుట నిమిత్తం ఈ విరాళం సమర్పించబడినట్లు దాత బండి నాగిరెడ్డి తెలిపారు. వారిని ఆలయ మర్యాదలతో స్వామి వారి అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించి శేష వస్త్రములతో సత్కరించి ప్రసాదములు వితరణ చేశారు.



Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #D.NO.: 1-639-1-7-11, NEAR NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPARI, ANANTHAPURAMU, ANDHRA PRADESH-515411, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:-APTEL/26/A6831. Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

నంద్యాల పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రుల అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలి

నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలి

ప్రతి ఆసుపత్రిలో తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ధరల పట్టిక బోర్డులు ఏర్పాటు చేయించాలి...



నంద్యాల ప్రతినిధి. నవంబర్ 21 . (నంది పత్రిక): నంద్యాల పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు మరియు డయాగ్నస్టిక్ సెంటర్లలో ప్రభుత్వ నిబంధనలు సక్రమంగా అమలు కాకపోవడం వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక దోపిడీకి గురవుతున్నారని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య నంద్యాల పట్టణ కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం నంద్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో అధికారిని శారద భాయ్ కి వినతిపత్రాన్ని అందజేశారు.లి ఈ సందర్భంగా నంద్యాల పట్టణ కార్యదర్శి శివ మాట్లాడుతూ, నంద్యాల పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా విస్మరిస్తున్నాయని విమర్శించారు. ఒకే వైద్యుని కన్సల్టేషన్ కోసం ఉదయం వేళల్లో ఒక రకమైన ఓపి ఫీజు వసూలు చేస్తూ, సాయంత్రం మరియు రాత్రి సమయాల్లో ఎటువంటి అనుమతి లేకుండా రెట్టింపు స్థాయిలో అధిక రుసుములు వసూలు చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా, రిసెప్షన్ వద్ద వైద్యుల కన్సల్టేషన్ ఫీజులు, ల్యాబ్ పరీక్షలు, స్కానింగ్ మరియు బెడ్ ఛార్జీల వివరాలను రోగులకు ముందుగానే తెలియజేసే విధంగా ధరల పట్టిక బోర్డులను ప్రదర్శించడం లేదని, చెల్లించిన ఫీజులకు కనీసం అధికారిక రసీదు కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు.జిల్లా రిజిస్టరింగ్ అథారిటీ అయిన డిఎమ్హెచ్ఓ తక్షణమే ప్రత్యేక తనిఖీ బృందాలను నియమించి నంద్యాల పట్టణంలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లు, వైద్యుల అర్హతలు మరియు ఫీజుల వసూళ్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆసుపత్రిలో ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా తెలుగు మరియు ఆంగ్ల భాషల్లో ధరల పట్టిక బోర్డులను ఏర్పాటు చేయించాలని, రాత్రి వేళల్లో అదనపు ఫీజుల వసూళ్లను తక్షణమే నిషేధించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన ఆసుపత్రులపై ఏపీపీఎంస్ చట్టం సెక్షన్ 10, 11 ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని, లేనిపక్షంలో డీ వై ఎఫ్ ఐ ఆధ్వర్యంలో ఆసుపత్రుల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు అరదేసి నిరంజన్, శాంతి వర్ధన్,శ్రీరామ్, ఫయాజ్ మరియు పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారు? బాధిత కుటుంబాలకు న్యాయం ఎప్పుడు?

సీపీఎం ఏరియా కార్యదర్శి చిట్వేల్ రవికుమార్, సీపీఐ రాజంపేట పట్టణ కార్యదర్శి సికిందర్



రాజంపేట (నంది పత్రిక ప్రతినిధి) నవంబర్ 21: రాజంపేట ప్రాంత ప్రజల జీవితాల్లో 2021 నవంబర్ 19వ తేదీ ఒక విషాదకరమైన రోజని అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి ఈ నవంబర్ 19పకి ఐదేళ్లు పూర్తయ్యాయని అయినప్పటికీ ప్రాజెక్టు పునర్నిర్మాణం విషయంలో ఆశించిన స్థాయిలో పనులు ముందుకు సాగలేదని సీపీఎం ఏరియా కార్యదర్శి చిట్వేల్ రవికుమార్, సీపీఐ రాజంపేట పట్టణ కార్యదర్శి సికిందర్ **ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చే హామీలపై చూపిస్తున్న శ్రద్ధ, అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణంపై ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు. ఇతర ప్రాంతాల్లో ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నామని ప్రకటిస్తున్న పాలకులు, అన్నమయ్య ప్రాజెక్టు విషయంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని నిలదీశారు. గత ఐదేళ్లుగా ఈ ప్రాంత రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని తాగునీరు, సాగునీటి సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయన్నారు.రైతులు వందల అడుగుల లోతు, చివరకు సుమారు వెయ్యి అడుగుల వరకు బోర్లు తవ్వించినా నీటి జాడ కనిపించని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం పూర్తికాకపోవడం వల్ల రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ప్రాజెక్టు నిర్మాణ పనులకు నిధులు కేటాయించి, నిర్దిష్ట గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలన్నారు . వరద బాధిత కుటుంబాలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని ఈ ప్రాంతానికి తాగునీరు, సాగునీరు అందించే శాశ్వత చర్యలు చేపట్టాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని లేనిపక్షంలో రాబోయే రోజుల్లో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో రైతాంగాన్ని, ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

శ్రీశాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా 'యువ తరంగ్ 2026' సాంస్కృతిక వేడుకలు





నంద్యాల ప్రతినిధి. నవంబర్ 21 . (నంది పత్రిక): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, వివిధ రంగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించేందుకు చక్కని వేదిక కల్పించడం లక్ష్యంగా శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్),లి నంద్యాలలోని బేసిక్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో, స్టూడెంట్ చాప్టర్ సహకారంతో 'యువ తరంగ్ 2026' పేరుతో ఒకరోజు విద్యార్థుల సాంస్కృతిక మరియు సృజనాత్మక ప్రతిభా పోటీల కార్యక్రమాన్ని శనివారం, నవంబర్ 21న అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమం ప్రత్యేకంగా మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థుల కోసం నిర్వహించబడింది. విద్యార్థుల్లో విద్యాపరమైన నైపుణ్యాలతో పాటు సాంస్కృతిక, కళాత్మక, భాషా, సృజనాత్మక మరియు వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన ప్రతిభను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కళాశాల యాజమాన్యం తెలిపింది. 'క్రియేటివిటీ కాన్ఫిడెన్స్ టాలెంట్' అనే ప్రధాన ఇతివృత్తంతో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమలోని విభిన్న ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు సాంస్కృతిక, సృజనాత్మక మరియు సహపాఠ్య కార్యక్రమాలు కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వేదికపై మాట్లాడే సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తి, సమయపాలన మరియు పరస్పర సహకార భావనలను అభివృద్ధి చేస్తాయని వివరించారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి సరైన అవకాశాలు కల్పించినప్పుడే విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించగలరని అన్నారు. మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.బేసిక్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ బి. శేషయ్య మాట్లాడుతూ, విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు, వారిలో నూతన ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు 'యువ తరంగ్ 2026' కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. ఇంజినీరింగ్ విద్య కేవలం సాంకేతిక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, కమ్యూనికేషన్ స్కిల్స్, కళాత్మక అభిరుచి, ఆత్మవిశ్వాసం, వ్యక్తీకరణ సామర్థ్యం వంటి లక్షణాలను కూడా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు తమలోని భయాన్ని అధిగమించి వేదికపై తమ ప్రతిభను నిర్భయంగా ప్రదర్శించాలని ఆయన ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పది రకాల పోటీలు నిర్వహించారు. అప్పటికప్పుడు ఇచ్చిన అంశంపై మాట్లాడటం, కథా రచన, వంటకాల ద్వారా ఆంగ్ల భాషా నైపుణ్యాల ప్రదర్శన, చిత్రలేఖనం, గానం, అలంకరణ, జ్ఞాపకశక్తి పరీక్ష, నృత్యం, లఘు చిత్రాల పోటీ, వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమలోని సృజనాత్మకతను, కళాత్మక నైపుణ్యాలను, ఆత్మవిశ్వాసాన్ని అద్భుతంగా ప్రదర్శించారు.ఈ పది పోటీల ద్వారా విద్యార్థులకు తమలోని విభిన్న ప్రతిభను గుర్తించుకునే అవకాశం లభించింది. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా తమ ప్రదర్శనలు ఇవ్వగా, తోటి విద్యార్థులు చప్పట్లతో వారిని ప్రోత్సహించారు. ప్రతి పోటీలోనూ విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం నెలకొంది. విజయం సాధించడం మాత్రమే కాకుండా, పాల్గొనడం, నేర్చుకోవడం, ఇతరుల ప్రతిభను గౌరవించడం కూడా ముఖ్యమనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో బేసిక్ సైన్సెస్ విభాగానికి చెందిన ఈవెంట్ కోఆర్డినేటర్లు, వివిధ పోటీలకు బాధ్యత వహించిన అధ్యాపకులు, జడ్జిలు, వాలంటీర్లు మరియు సహాయక సిబ్బంది కీలక పాత్ర పోషించారు. ప్రతి పోటీకి సంబంధించిన ప్రణాళిక, విద్యార్థుల నమోదు, పోటీల నిర్వహణ, మూల్యాంకనం మరియు ఇతర ఏర్పాట్లలో అధ్యాపకులు సమన్వయంతో పనిచేశారు. కార్యక్రమం నిర్వహణలో పాల్గొన్న కోఆర్డినేటర్లు మరియు అధ్యాపకుల కృషిని కళాశాల ప్రిన్సిపాల్ మరియు విభాగాధిపతి ప్రత్యేకంగా అభినందించారు. మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు మాత్రమే నిర్వహించిన ఈ కార్యక్రమం వారి కళాశాల జీవితంలో ఒక మరపురాని అనుభూతిగా నిలిచింది. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు మరియు వృత్తిపరమైన జీవితంలో రాణించేందుకు అవసరమైన ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు మరియు కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందిస్తాయని అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. సుబ్రహ్మణ్యం, బేసిక్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ బి. శేషయ్య, వివిధ ఈవెంట్ల కోఆర్డినేటర్లు, బేసిక్ సైన్సెస్ విభాగ అధ్యాపకులు, ఇతర అధ్యాపక బృందం, నిర్వాహక సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థుల సృజనాత్మకతకు, ఆత్మవిశ్వాసానికి, ప్రతిభకు అద్దం పట్టిన 'యువ తరంగ్ 2026' కార్యక్రమం కళాశాలలో ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించబడింది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



రుద్రవరం ప్రతినిధి నవంబర్ 21 (నంది పత్రిక): రుద్రవరం సబ్-స్టేషన్ పరిధిలో నేడు అనగా 22వ తేదీ, నాలుగో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, సబ్-స్టేషన్ మరమ్మతు పనుల కారణంగా ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే, త్రీ-ఫేస్ విద్యుత్ సరఫరా సమయాన్ని కూడా మార్చినట్లు వెల్లడిస్తూ, అర్ధరాత్రి 12:00 గంటల నుండి ఉదయం 9:00 గంటల వరకు (మొత్తం 9 గంటలు) సరఫరా ఉంటుందని చెప్పారు. కావున ఈ విషయాన్ని గమనించి రైతులు, గ్రామ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి వారి దేవస్థానంలో 30 మంది బాలలకు విముక్తి.



బేతంచెర్ల నవంబర్ 21 (నందిపత్రిక). బాలల భిక్షాటన మరియు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా,నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ పొలిమేరలో వెలసిన ప్రముఖ వైష్ణవ క్షేత్రం లక్షలాది మంది భక్తుల ఆరాధ్య దైవం శ్రీ మద్దులేటి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ప్రాంగణంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక రక్షణ డ్రైవ్ నిర్వహించారు.ముఖ్యవివరాలు. రక్షణచర్యలు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ,వివిధ ఇబ్బందుల్లో ఉన్న 30 మంది చిన్నారులను అధికారులు గుర్తించి రక్షించారు. అధికారుల విచారణ: బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ దండే వెంకట నరేష్,సభ్యులు అమర్నాథ్ బాబు మరియు విజయ క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, చిన్నారుల రక్షణకు అవసరమైన ఉత్తర్వులను జారీ చేశారు.

రాష్ట్రస్థాయి నమూనా శాసనసభకు ఎంపికైన రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థి శేషిధర్



రుద్రవరం ప్రతినిధి నవంబర్ 21 (నంది పత్రిక): జిల్లా స్థాయిలో ఎన్నికల అక్షరాస్యతా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల అవగాహన కార్యక్రమంలో రుద్రవరం ఆదర్శ పాఠశాల పదవ తరగతి విద్యార్థి శేషిధర్ విశేష ప్రతిభ కనబరిచి, త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి నమూనా శాసనసభకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా పాలనాధికారి రాజకుమారి గనియా చేతుల మీదుగా శేషిధర్ ప్రశంసాపత్రాన్ని అందుకుని పాఠశాలకు గర్వకారణంగా నిలిచాడు. విద్యార్థికి మార్గదర్శనం చేసి ప్రోత్సహించిన ఉపాధ్యాయులు పాపయ్య, లక్ష్మీ వెంకటరమణ, తాత్కాలిక ప్రధానోపాధ్యాయులు ఈరన్న బషీర్‌ల ప్రత్యేక కృషిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంగెపు నాగేశ్వరరావు అభినందించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, శేషిధర్ విజయం మరెంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

కరువు మండలాల్లో 100 శాతం ఉపాధి కల్పించాలి....

పీడీ సూర్యనారాయణ.

రుద్రవరం ప్రతినిధి నవంబర్ 21 (నంది పత్రిక): రుద్రవరం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోని 6 మండలాల (ఆళ్లగడ్డ, దొర్నిపాడు, చాగలమర్రి, ఉయ్యాలవాడ, రుద్రవరం తదితర) వి.బి.జి. రామ్ జీ సిబ్బందితో పీడీ సూర్యనారాయణ మండలాల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నంద్యాల జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా గుర్తించినందున ప్రతి గ్రామంలోనూ 100 శాతం ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు. గ్రామాలలో యాక్టివ్ జాబ్ కార్డులు ఉన్న శ్రామికులలో కనీసం 70 నుండి 75 శాతం మందికి తప్పనిసరిగా పని కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏల వారీగా లక్ష్యాలను సమీక్షించిన ఆయన, పని కల్పించడంలో నిర్లక్ష్యం వహించే ఫీల్డ్ అసిస్టెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నంద్యాల ఏపీడీ సాంబశివరావుతో పాటు ఆరు మండలాల ఏపీఓలు, డీఆర్‌పీ, ఈసీలు, టీఏలు, సీఓలు మరియు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యం.. సర్పంచ్ గంగుల సరళమ్మ.



రుద్రవరం ప్రతినిధి నవంబర్ 21 (నంది పత్రిక):ఎర్రగుడి దీన్నే గ్రామపంచాయతీ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమ్ సర్పంచ్ గా ఎన్నికైన గంగుల సరళమ్మ తెలిపారు. రుద్రవరం మండలంలోని యర్రగుడిదిన్నె గ్రామ పంచాయతీ ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. యర్రగుడిదిన్నె గ్రామపంచాయతీ సర్పంచ్ గా ముచ్చటగా మూడవసారి గంగుల సరళమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఆర్వో చేతుల మీదుగా ఎన్నిక ధ్రువపత్రాన్ని అందుకున్నారు. గ్రామ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన సరళమ్మను వార్డు సభ్యులు కుటుంబ సభ్యులు గ్రామస్తులు పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీ ఉప సర్పంచ్ గా గంగుల సుదర్శన్ రెడ్డిని వార్డు సభ్యులు ప్రతిపాదించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన కుటుంబ సభ్యులతో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సహకారంతో గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తామని సర్పంచ్ గంగుల సరళమ్మ తెలిపారు.ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, పుటాలమ్మ క్షేత్రం మాజీ చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. గంగుల సరళమ్మ మూడోసారి సర్పంచ్‌గా ఎన్నిక కావడం జరిగిందన్నారు. మొదటి నుంచి తమ కుటుంబం గ్రామం కోసం ఎంతో కష్టపడుతోందని, తమకు తోడుగా ఆమె కూడా ఇప్పటివరకు తన సహాయ సహకారాలు అందిస్తూ వచ్చారని పేర్కొన్నారు. ఇకముందు కూడా యర్రగుడిదిన్నె గ్రామంతో పాటు మజరా గ్రామమైన మాచినేనిపల్లె, ఈ రెండు గ్రామాలను అభివృద్ధిలో సమానంగా చూసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా పాటుపడతామని పత్రికాముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులుగంగుల విజయసింహారెడ్డి, గంగుల పుల్లారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రవికుమార్, మాజీ సర్పంచ్ సీలయ్య తోపాటు వార్డు సభ్యులు పలువురు వైసీపీ నాయకులు గ్రామస్తులు ఉన్నారు.



గుర్తులు రాకముందే గుప్పిట్లోకి





బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 21: బండి ఆత్మకూరు మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో పోటీ చేస్తున్న వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులకు గుర్తులు రాకముందే, ఓటర్ మహాశయులను తమ గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ కి సంబంధించి ఒకవైపు పరిశీలనా కార్యక్రమాలు జరుగుతూ ఉంటే, మరోవైపు గ్రామాలలో నాయకులు ప్రచారం చేసుకుంటున్నారు. అభ్యర్థులకు గుర్తులను కేటాయించేందుకు మరో మూడు రోజులు సమయం ఉంది కాబట్టి, ఆలోపుగా ప్రజలతో పరిచయాలు పెంచుకునేందుకుగాను, తెలుగుదేశం వైఎస్ఆర్ పార్టీలకు చెందిన నాయకులు గ్రామాలలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సర్పంచి పదవులకు పోటీచేసే అభ్యర్థులతో పాటు, వార్డు సభ్యులను కూడా వెంటబెట్టుకొని ప్రచారం చేసుకుంటున్నారు. గ్రామాలలో ఈ ఎన్నికలకు వార్డు సభ్యులే కీలకం కావడంతో, ఎలాంటి రాజకీయ అనుభవం లేని వ్యక్తులను ఎన్నికల రంగంలోకి దించారు. ముందు నువ్వు నామినేషన్ వేసేయ్! తర్వాత మేము చూసుకుంటాం!

అంటూ వార్డు సభ్యులను బుజ్జగించి మరి నామినేషన్లను వేయించారు. ఏదో నాయకులు చెప్పారు కదా! అని మొదట్లో సంబర పడిన వార్డు సభ్యులకు, ప్రచారం మొదట్లోనే ఖర్చుల భయంతో బేజారెత్తిపోతున్నారు. ఇప్పటికే మండలంలోని బండి ఆత్మకూరు పార్నపల్లె కాకునూరు ఎర్రగుంట్ల ఏ కోడూరు, సంత జూటూరు భోజనం పెద్దదేవలాపురం నారాయణపురం చిన్నదేవలాపురం, లింగాపురం గాలి చెన్నయ్యపాలెం, రామాపురం సోమయాజుల పల్లె, ఈర్నపాడు ,కడమల కాల్వ, వెంగళరెడ్డిపేట గ్రామపంచాయతీ పరిధిలో ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు ప్రచారంలో పడి మునిగి తేలుతున్నారు. ఓటర్ మహాశయులను ప్రసన్నం చేసుకునేందుకు కుస్తీ పడుతున్నారు. గ్రామాలలో సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థుల కంటే, వార్డుల నుండి పోటీ చేస్తున్న అభ్యర్థులే ప్రధానంగా ప్రచారం చేసుకుంటున్నారు. వార్డుకు నేనే నిలబడ్డాను! మీరు నాకు కచ్చితంగా ఓటు వేసి గెలిపించాలి! అమ్మా ! అక్కా! అంటూ ఇప్పటినుండే ప్రాధేయపడుతున్నారు.

ప్రజా సేవే లక్ష్యం.. మీ ఆశీర్వాదమే మా బలం





వెలుగోడు అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వండి డా. జాకీర్ హుస్సేన్

వెలుగోడు, నవంబర్ 21, నంది పత్రిక: వెలుగోడు పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజల మధ్యకు వస్తున్నామని, ప్రజల ఆశీర్వాదం, ఆదరణే తమ బలమని డా. జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. వెలుగోడు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేస్తున్న శ్రీమతి బన్నూరు మున్వార్‌కు మద్దతుగా పట్టణంలోని జమ్మి నగర్‌లో గడపగడప ప్రచారం నిర్వహించి, ఇందిరా నగర్‌లో జోరుగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుస్తూ, తమ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. పట్టణంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ, ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.డా. జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ, గతంలో ఒకసారి సర్పంచ్ పదవికి పోటీ చేసి ప్రజల తీర్పును గౌరవిస్తూ ఓటమిని స్వీకరించానని, అయినప్పటికీ ప్రజాసేవ పట్ల తన సంకల్పం ఏమాత్రం తగ్గలేదన్నారు. పదవులు ఉన్నా లేకున్నా ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండాలనే ఆశయంతో ముందుకు సాగుతున్నానని తెలిపారు.మరోసారి ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడంతో పట్టణ అభివృద్ధి కోసం కృషి చేయాలని సంకల్పించామని, త్రాగునీటి సమస్య పరిష్కారం, పారిశుధ్య నిర్వహణ, రహదారుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని వివరించారు.

ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి, అందరికీ అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా సేవ చేయడమే తమ లక్ష్యమన్నారు. డా.జాకీర్ హుస్సేన్ సతీమణి బన్నూరు మున్వార్‌కు ఒక్క అవకాశం కల్పించి గెలిపించాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా అభివృద్ధి, ప్రజాసేవకు కట్టుబడి ఉంటామని కోరారు. ప్రజల ఆశీర్వాదం, సహకారం తమకు కొండంత బలమని పేర్కొన్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బనగానపల్లె లో హజ్రత్ సయ్యద్ మీర్ హాషం అలీ ఉర్సు

ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



బనగానపల్లె నవంబర్ 21నందిపత్రిక బనగానపల్లె పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో కొలువైన హజ్రత్ సయ్యద్ మీర్ హాషం అలీ ఉర్సు దెహలివాలే సాహెబ్ రహ్మతుల్లా అలైహి వారి గంధం, ఉర్సు మహోత్సవాలకు సంబంధించిన గోడపత్రికను రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి బనగానపల్లెలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఉర్సు మహోత్సవాల నిర్వాహకులు కార్యక్రమ వివరాలను మంత్రికి వివరించారు. నవంబర్ 30న రాత్రి 10 గంటలకు గంధం కార్యక్రమం, డిసెంబర్ 1న ఉర్సు మహోత్సవం, డిసెంబర్ 2న జియారత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.గంధం కార్యక్రమంలో చాందిని డెకరేషన్, ప్రత్యేక లైటింగ్, డ్రమ్స్ ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకునేలా ఏర్పాటు చేస్తున్నారు.డిసెంబర్ 1న రాత్రి 9 గంటలకు ఉత్తరప్రదేశ్ (లక్నో)కు చెందిన కళాకారులతో ముఖాముఖి పోటీల రూపంలో ప్రత్యేక ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించనున్నారు.హజ్రత్ సయ్యద్ అహ్మద్ బాషా ఖాద్రి రహ్మతుల్లా అలైహి వారి కుమారులు డాక్టర్ హుసేనిబాషా సాహెబ్ ఆధ్వర్యంలో గంధం, ఉర్సు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఖవ్వాలి కార్యక్రమానికి సహకారంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి రూ.లక్ష విరాళంగా ఇవ్వగా . కార్యక్రమ నిర్వహణకు పలువురు దాతలు, ఆహ్వాన కమిటీ సభ్యులు, దర్గా కమిటీ సభ్యులు సహకారం అందిస్తున్నారు.ఈ ఉత్సవాల్లో మతసామరస్యం, సోదరభావం వెల్లివిరిసేలా భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

స్పీడ్ బ్రేకర్లు వేశారు గుర్తులు మరిచారు



రాజంపేట (నంది పత్రిక ప్రతినిధి)నవంబర్ 21: రాజంపేట మండలం తాళ్లపాక క్రాస్ రోడ్డు వద్ద, బోయినపల్లిలో నేషనల్ హైవే అథారిటీ వారు నందలూరు – రాజంపేట మార్గం హైవే రోడ్డులో ప్రమాదాలు నివారించడానికి స్పీడ్ బ్రేకర్లు అయితే వేశారు కానీ అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయన్న విషయం వాహనదారులు తెలుసుకునేందుకు హెచ్చరిక గుర్తులు మాత్రం వేయలేదు. దీంతో ప్రమాదాలు నివారించబోయి ఆ స్పీడ్ బ్రేకర్లు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు గుర్తించి స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయన్న సూచిక గుర్తులు వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

భక్త జన సందోహంతో కిక్కిరిసిన శ్రీ మద్దులేటీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం.

గోవింద నామ స్మరణతో మార్మోగిన శ్రీ మద్దులేటి స్వామి పరిసర ప్రాంతాలు.



బేతంచెర్ల నవంబర్ 21 (నంది పత్రిక). కార్తీక మాసం రెండో శనివారం సందర్భంగా శ్రీ మద్దులేటి లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం భక్తులతో కిక్కిరిసిపోయింది, ముఖ్యంగా నిత్యాన్నదాన సత్రం వద్ద భక్తుల రద్దీ తో కిటకిట లాడింది.కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైన రెండో శనివారం కావడంతో, తెలుగు రాష్ట్రాల నలు మూలల నుండి భక్తులు భారీ సంఖ్యలో దేవస్థానంలో వెలసిన శ్రీ స్వామి శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మ వారి దర్శనానికితరలి వచ్చారు. తెల్లవారుజాము నుండే భక్తులు స్వామివారిని దర్శించుకొని దర్శనం అనంతరం భక్తులందరికీ ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం.రామాంజనేయులు ,శ్రీ మద్దులేటీ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ నాగయ్య పర్యవేక్షణలో నిత్యాన్నదాన సత్రంలో ప్రసాద వితరణ (భోజన వసతి) ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో అన్నదాన సత్రం కిక్కిరిసి పోయింది.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు మరియు నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. తాగునీరు, క్యూలైన్ల పర్యవేక్షణ మరియు అన్నదాన వితరణ సజావుగా సాగేలా తగు చర్యలు ఏర్పాటు చేశారు.



నూతన ఎంపీపీకి బుడ్డారెడ్డి శ్రీనివాస్ రెడ్డికి ఘన సత్కారం



మహానంది నవంబర్ 21 (నంది పత్రిక):- మహానంది మండల పరిషత్ అధ్యక్షుడిగా (ఎంపీపీ) నూతనంగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసిన బుడ్డారెడ్డి శ్రీనివాస రెడ్డికి గాజులపల్లె గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.గాజులపల్లి-1 టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా ఘనవిజయం సాధించి, ఎంపీపీ పీఠాన్ని అధిరోహించిన సందర్భంగా స్థానిక టీడీపీ నాయకురాలు గంగవరపు శశికళ కొండారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నూతన ఎంపీపీ శ్రీనివాస రెడ్డికి పూలమాల వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొని ఎంపీపీకి శుభాకాంక్షలు తెలిపారు.

గోస్పాడు మండలంలో రెండు ఏకగ్రీవాలతో బోణీ కొట్టిన వైసిపి.

గోస్పాడు మండలంలో వైసీపీ జోరు.. రెండు పంచాయతీలు ఏకగ్రీవం!

నెహ్రూ నగర్, ఒంటివెలగల సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకున్న వైసీపీ మద్దతుదారులు

అధికారికంగా ప్రకటించిన ఎన్నికల అధికారులు

గ్రామాల్లో మిన్నంటిన వైసీపీ శ్రేణుల సంబరాలు



నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 21 (నంది పత్రిక) గోస్పాడు మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సమరంలో రెండు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కావడంతో వైసిపి బోణీ కొట్టింది.నెహ్రూనగర్ నుంచి శివరామి రెడ్డి,ఒంటెలగల నుంచి ఎద్దుల లక్ష్మీ దేవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధికారులు ధృవీకరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సమరంలో నంద్యాల నియోజకవర్గం, గోస్పాడు మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) తన సత్తా చాటింది. మండల పరిధిలోని నెహ్రూ నగర్ మరియు ఒంటివెలగల గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలను వైసీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో, ఈ రెండు గ్రామాల్లో పోటీలో మరెవరూ లేకపోవడంతో సర్పంచ్ ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ అధికారులు శనివారం అధికారికంగా ప్రకటించారు. శ్రేణుల హర్షాతిరేకాలు: ఎన్నికల సమరం ప్రారంభంలోనే రెండు కీలక పంచాయతీలు ఏకగ్రీవంగా వైసీపీ ఖాతాలో చేరడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. నెహ్రూ నగర్, ఒంటివెలగల గ్రామాల్లో వైసీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. గ్రామాల అభివృద్ధి కోసమే ప్రజలు, పెద్దలు ఏకతాటిపైకి వచ్చి ఏకగ్రీవానికి సహకరించారని స్థానిక నేతలు పేర్కొన్నారు.

గోపవరం పీహెచ్సీలో ల్యాబ్ పరిశీలన



గోపవరం నవంబర్ 21 (నంది పత్రిక): గోపవరం పీహెచ్సీలో అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకట్ రెడ్డి ల్యాబ్ ను పరిశీలించారు .ల్యాబ్ టెక్నీషియన్ గణేష్ ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. వర్షాకాలంలో ఫీవర్స్ వచ్చే అవకాశం ఉందని ఎప్పటికప్పుడు రక్త నమూనాలను పరీక్షించాలన్నారు. ప్రజలకు మెరుగైన పరీక్షలను అందించాలని సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శివరామరెడ్డి ,పి హెచ్ ఎన్ విజయ్ కుమారి, హెల్త్ అసిస్టెంట్లు గంగిరెడ్డి, మహమ్మద్ ఖాసిం, జనార్దన్ రావులు పాల్గొన్నారు.

హత్యరాలలో 24న కామాక్షి త్రితేశ్వర స్వామి వార్ల కళ్యాణం



రాజంపేట (నందిపత్రిక ప్రతినిధి) నవంబర్ 21: రాజంపేట మండలం హత్యరాలలో ఈ నెల 24వ తేదీన శ్రీ శ్రీ కామాక్షి సమేత త్రితేశ్వరు స్వామి వార్ల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జ్వాలా తోరణం, శిఖర దీపం, గంగా హారతి, గిరి ప్రదక్షిణ కార్యక్రమాలతో మధ్యాహ్నం కళ్యాణ విందు, సాయంత్రం అన్నప్రసాద వితరణ అలయ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం గిరి ప్రదక్షిణ ఆధ్వర్యంలో గంగా హారతి మరియు గిరి ప్రదక్షిణ ఉంటుందని వివరించారు. కార్యక్రమ వివరాలు కింది విధంగా ఉన్నాయి. ఉదయం 10:35 గంటల నుండి స్వామి వారి కళ్యాణం , మధ్యాహ్నం 12:00 నుండి కళ్యాణ విందు, సాయంత్రం 5 గంటలకు జ్వాలా తోరణం, సాయంత్రం 5:30 కి శిఖర దీపం , 6:30 గంటలకు గంగా హారతి , 7:00 గంటలకు గిరి ప్రదక్షిణ మొదలు, 8:00 గంటల నుండి అన్నప్రసాద వితరణ ఇచ్చిన సమయాల్లో పరిస్థితి బట్టి కొంచెం అటుఇటుగా మారవచ్చునని వివరించారు.

సిరివెళ్ల కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి అత్తరు రఫీ. ప్రచారం జోరు

ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థిస్తున్న అత్తరు రఫీ మరియు కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ మందుల రామకృష్ణ..



సిరివెళ్ల, నవంబర్ 21:(నంది పత్రిక)సిరివెళ్ల గ్రామ పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా అత్తరు రఫీ బరిలో నిలిచారు. ఆయన ప్రచారం రోజురోజుకు జోరు అందుకుంటోంది. ఈరోజు గ్రామంలోని పలు వార్డుల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలిసి అత్తరు రఫీ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మందుల రామకృష్ణ కలిసి ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి పెద్దలను, మహిళలను కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. సిరివెళ్లనే అభివృద్ధే నా లక్ష్యం. గ్రామంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు, పారిశుధ్యం వంటి సమస్యలను పరిష్కరిస్తా. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి సేవ చేస్తా“ అని అత్తరురఫీ గారు హామీ ఇచ్చారు.ప్రచారంలో పురుషులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలిపారు. గ్రామంలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ జెండాలు, అత్తరు రఫీ గారికి మద్దతుగా నినాదాలు మారుమోగాయి. గ్రామ అభివృద్ధికి, తమ ఓటు వేసి గెలిపించాలని ప్రచారంలో కోరారు.

ప్రజా సేవే లక్ష్యం.. మీ ఆశీర్వాదమే మా బలం

ఎర్రగుంట్ల అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వండి కట్టమీద రిహానా బేగం ముజాహిద్ దంపతులు



సిరివెళ్ల, నవంబర్ 21, నంది పత్రిక: ఎర్రగుంట్ల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజల మధ్యకు వస్తున్నామని, ప్రజల ఆశీర్వాదం, ఆదరణే తమ బలమని కట్టమీద రిహానా బేగం ముజాహిద్ దంపతులు పేర్కొన్నారు. ఎర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న కట్టమీద రిహానా బేగం ముజాహిద్ దంపతులు మద్దతుగా పట్టణంలోని ఎర్రగుంటలో గడపగడప ప్రచారం నిర్వహించి, జోరుగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుస్తూ ఓటు వేసి గెలిపించాలని కోరారు. గ్రామంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ, ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజాసేవ పట్ల తన సంకల్పం ఏమాత్రం తగ్గలేదన్నారు. పదవులు ఉన్నా లేకున్నా ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండాలనే ఆశయంతో ముందుకు సాగుతున్నానని తెలిపారు. ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడంతో ఎర్రగుంట్ల అభివృద్ధి కోసం కృషి చేయాలని సంకల్పించామని, త్రాగునీటి సమస్య పరిష్కారం, పారిశుధ్య నిర్వహణ, రహదారుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి, అందరికీ అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా సేవ చేయడమే తమ లక్ష్యమన్నారు. కట్టమీద రిహానా బేగం ముజాహిద్ దంపతులకు ఒక్క అవకాశం కల్పించి గెలిపించాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా అభివృద్ధి, ప్రజాసేవకు కట్టుబడి ఉంటామని కోరారు. ప్రజల ఆశీర్వాదం, సహకారం తమకు కొండంత బలమని పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మొబైల్ యాప్ ద్వారానే ఎరువులు... ఏవో బి. కృష్ణారెడ్డి

ఎక్కడ నుంచి అయినా ఎరువులు కొనుకోవచ్చు ఆన్లైన్ విధానంలో ఎరువులు బుకింగ్



జూపాడుబంగ్లా ,నవంబర్: 21: (నంది పత్రిక) రైతుల సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం ఎఫ్ ఎఫ్ ఎస్ నూతన మొబైల్ యాప్ ను అందుబాటులోకి తెచ్చిందని మండల వ్యవసాయ అధికారి బి. కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. నవంబర్ 16 నుంచి అమలులోకి వచ్చిన ఈ విధానం ద్వారా రైతులు ఎరువుల దుకాణాల వద్ద క్యూ లైన్ లో వేచి ఉండే అవసరం లేకుండా నేరుగా తమ ఫోన్ నుంచే ఎరువులను బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు తమ స్మార్ట్ ఫోన్ లోనే గూగుల్ ప్లే స్టోర్ ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఆధార్ నెంబర్ లేదా ఏపీఎస్ఆర్ ఫార్మర్ ఐడి ద్వారా, ఆధార్ కార్డుకు లింక్ అయినా మొబైల్ నెంబర్ కు వచ్చే ఓటీపీ సాయంతో లాగిన్ అవ్వాలని తెలిపారు. యాప్ లో రైతు భూమి సర్వే నెంబరు, విస్తీర్ణ వివరాలను సరి చేసుకుని, సాగు చేస్తున్న పంటలను ఎంచుకోవాలని, వ్యవసాయ విశ్వవిద్యాలయం సిఫారసుల మేరకు ఆ పంటకు అవసరమైన ఎరువుల మోతాదును యాప్ స్వయంగా ఎక్కించి చూపిస్తుందిన్నారు. అవసరమైతే రైతులు అందులో మార్పులు చేసుకోవచ్చని సూచించారు. దగ్గర్లో ఎరువులు అందుబాటులో ఉన్న రిటైల్ కేంద్రాన్ని ఎంచుకొని బుకింగ్ పూర్తి చేయగానే స్క్రీన్ పై బుకింగ్ ఐడి క్యూఆర్ కోడ్ జనరేటర్ అవుతాయని రైతు స్వయంగా గాని లేదా తాను సూచించిన ప్రతినిధి గాని సంబంధిత ఎరువుల దుకాణానికి వెళ్లి ఆ క్యూఆర్ కోడ్ చూపిస్తే డీలర్ ఈ పాస్ యంత్రంతో కోడ్ ను స్కాన్ చేసి నగదు చెల్లించిన వెంటనే ఎరువులను అందజేస్తారన్నారు. ఫార్మే ఐడి లేని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. ధాన్యము కొనుగోలు పంట బీమా పంట నష్టపరిహారం ఒంటి ప్రభుత్వ పథకాలకు ఇది తప్పనిసరి అని స్పష్టం చేశారు. అలాగే మ్యుటేషన్ కానీ వారసత్వ భూములు, కౌలు రైతులు, పంట వాటాదారులు, ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాదారులు, దేవాదాయ, సాగు దారులు కూడా రైతు సేవా కేంద్రం, వ్యవసాయ అధికారుల ఆమోదంతో తమ సాగు భూమిని యాప్ లో మ్యాపింగ్ చేసుకొని ఎరువులు పొందవచ్చు అని తెలిపారు. ఈనూతన విధానం వల్ల రైతులకు సకాలంలో పారదర్శకముగా ఎరువులు అందుతాయని, రైతులందరూ ఈ అవకాశాన్ని స్వదివినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ పథకం ప్రధాన లక్ష్యం... నిజమైన రైతులకు వారి భూమి విస్తీర్ణం సాగు చేసే పంటలను లబ్ధి ఎరువులు అందించేందుకు అవకాశం ఉంటుంది. గ్యాస్ సిలిండర్ బుకింగ్ తరహాలో ముందుగానే బుక్ చేసుకుని వెలుసుబాటు ఉన్నందున దుకాణాల వద్ద గంటలు తరబడి వేసి ఉండవలసిన అవసరం ఉండదు. ఇంటిగ్రేటెడ్ ఫర్టిలైజర్ మేనేజ్మెంట్ సిస్టంతోఅనుసంధానించడం వల్ల ఎరువుల నిలువ వివరాలు ఎప్పటికప్పుడు రైతులు సులభంగా తెలుసుకోవచ్చు.

ఫేజ్3 నామినేషన్ల నేపథ్యంలో గ్రామ పంచాయతీలలో ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన.

బేతంచెర్లనవంబర్21(నందిపత్రిక). బేతంచెర్ల మండలంలోని పలు గ్రామ పంచాయతీలను పరిశీలించిన బేతంచెర్ల ఎంపీడీవో ఎం.ఫజుల్ రహిమాన్, డిప్యూటీ ఎంపీడీవో బి.మల్లి ఖార్జున ఫేజ్3 ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా, మొదటి రోజైన శనివారం బేతంచెర్ల మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో ఎన్నికల విధులు,నామినేషన్ల స్వీకరణకు చేపట్టిన ఏర్పాట్లను, ఎంపీడీవో ఎం. ఫజుల్ రహిమాన్, డిప్యూటీ ఎంపీడీవో బి.మల్లిఖార్జున పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్.ఎస్. రంగాపురం,గూటుపల్లె , హెచ్. కొట్టాల, కొలుములపల్లె మరియు సిమెంట్ నగర్ గ్రామ పంచాయతీలను సందర్శించి నామినేషన్ కేంద్రాలలో జరుగుతున్న ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బంది విధుల నిర్వహణ, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సమీక్షించారు.నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని,అభ్యర్థులకు అవసరమైన సహకారం అందిస్తూ, ప్రక్రియను పార దర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలాగ అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు ఆదేశించారు.ఫేజ్3 ఎన్నికల నామినేషన్ల మొదటి రోజు మండలంలోని గ్రామ పంచాయతీలలో ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టారు.



జోరందుకున్న ఎన్నికల ప్రచారం

సర్పంచ్ అభ్యర్థి రెహానా పర్వీన్‌కు ప్రజల ఆత్మీయ స్వాగతం





వెలుగోడు, నవంబర్ 21 (నంది పత్రిక):వెలుగోడు మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికల వేడి మొదలైంది. శ్రీశైలం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి ఆశీస్సులతో, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి రెహానా పర్వీన్. ప్రచారంలో భాగంగా పట్టణంలోని జండా పేట (ఓల్డ్ వీధి) ఐటిఐ కాలేజ్ పరిసరాలు మరియు మండ్ల వీధి జమ్మి నగర్ లో ఆమె విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి అక్కడి మహిళలు, పెద్దలు మరియు యువతను ఆప్యాయంగా పలకరించారు. గ్రామ అభివృద్ధి కోసం తనను గెలిపించి ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా ప్రజల నుండి ఆమెకు మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో వెలుగోడు పట్టణ వైయస్సార్సీపీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా కార్యకర్తలు మరియు పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని రెహానా పర్వీన్‌కు మద్దతుగా నినాదాలు చేస్తూ ప్రచారాన్ని విజయవంతం చేశారు.

తంబా వీధిలో షేక్ సునీహకు మద్దతుగా నల్లేరు విశ్వనాథ రెడ్డి విస్తృత ప్రచారం

ఇంటింటి ప్రచారంలో ప్రజలను కలుసుకుని అభివృద్ధి, సంక్షేమ అంశాలపై చర్చ



పోరుమామిళ్ల, నవంబర్ 21(నంది పత్రిక): బద్వేల్ నియోజకవర్గంలోని పోరుమామిళ్ల మేజర్ గ్రామ పంచాయతీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి షేక్ సునీహకు మద్దతుగా బద్వేల్ నియోజకవర్గ వైఎస్సార్సీపీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి తంబా వీధిలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పోరుమామిళ్ల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సునీహకు మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రజలను కలుస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

మొదటి రోజు జోరుగా నామినేషన్లలు



కొత్తపల్లి – నంది పత్రిక : మండలంలోని పలు గ్రామాల్లో మొదటిరోజు జోరుగా నామినేషన్ల ప్రక్రియ జరిగిందని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి దాసరి మేరి తెలిపారు. శుక్రవారం మొదటి రోజు మండల వ్యాప్తంగా మొత్తం 12 గ్రామ పంచాయతీల నుంచి సర్పంచ్ పదవికి 26, వార్డు సభ్యుల పదవికి 62 నామినేషన్లు వేయడం జరిగింది. దుద్యాల: సర్పంచ్ – 0, వార్డు – 2, నందికుంట: సర్పంచ్ 1, వార్డు 10, కొక్కిరంచ సర్పంచ్ 3, కొత్తపల్లి సర్పంచ్ 6, వార్డు 11,వీరాపురం సర్పంచ్ 2, వార్డు 3,గువ్వలకుంట్ల సర్పంచ్ 5, వార్డు 8,ఎదురుపాడు సర్పంచ్ 2, వార్డు 10, గోకవరం క్లస్టర్ శివపురం సర్పంచ్ 1, వార్డు 9,గోకవరం సర్పంచ్ 1, ముసలిమడుగు క్లస్టర్ –ఎర్రమఠం సర్పంచ్ 3, గుమ్మడాపురం: సర్పంచ్ 2, వార్డు 9 మంది నామినేషన్లు వేయడం జరిగింది. నాలుగు క్లస్టర్లలో అధికారుల ఆధ్వర్యంలో ప్రశాంతంగా నామినేషన్ల ప్రక్రియ మొదటిరోజు ముగిసింది.



కెనడాలో వాల్‌మార్ట్ వద్ద కాల్పులు: భారత సంతతి ప్రేమజంట మృతి

కెనడాలోని బ్రిటిష్ కొలంబియా పరిధిలోని సర్రే నగరంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ వాల్‌మార్ట్ స్టోర్ పార్కింగ్ లాట్‌లో జరిగిన కాల్పుల్లో భారత సంతతికి చెందిన ప్రేమ జంట ప్రాణాలు కోల్పోయింది. ఈ కాల్పులు పక్కా ప్రణాళిక ప్రకారం వ్యవస్థీకృత నేర ముఠాలు (ఆర్గనైజ్డ్ క్రైమ్) జరిపిన దాడిగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇప్పటివరకు ఈ కేసుకు సంబంధించి ఎవరినీ అరెస్టు చేయలేదు. ఈ జంట హత్యల కేసును దర్యాప్తు చేస్తున్న 'ఇంటిగ్రేటెడ్ హోమిసైడ్ ఇన్వెస్టిగేషన్ టీమ్' (ఐహెచ్ఐటీ) మృతుల వివరాలను వెల్లడించింది. మరణించిన వారిని దెల్టా ప్రాంతానికి చెందిన గగన్‌ప్రీత్ రెహల్ (23), సుఖ్‌జీత్ కౌర్ (24)గా గుర్తించారు. గగన్‌ప్రీత్‌పై గతంలో తుపాకులు, ఇతర ఆయుధాల సంబంధిత నేరాల రికార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సుఖ్‌జీత్ కౌర్‌కు కెనడాలో పరిచయాలు చాలా పరిమితంగా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

బ్రహ్మంగారి మఠానికి మహానంది దేవస్థానం పట్టువస్త్రాల సమర్పణ



మహానంది నవంబర్ 21 (నంది పత్రిక):– శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 418వ జయంతి మహోత్సవాల్లో భాగంగా నిర్వహించే శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాముల వారి శాంతి కళ్యాణ మహోత్సవానికి మహానంది దేవస్థానం నుంచి ఆనవాయితీ ప్రకారం పట్టువస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.ఆలయానికి చేరుకున్న మహానంది దేవస్థానం బృందానికి బ్రహ్మంగారి మఠం మేనేజర్ పి.పి.ఎన్. ప్రసాద్, మఠాధిపతుల సోదరులు శ్రీ దత్తాత్రేయ స్వామి మరియు మఠం అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం శాంతి కళ్యాణ మహోత్సవం కోసం పట్టువస్త్రాలు, ప్రసాదాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు.ఈ కార్యక్రమంలో మహానంది దేవస్థానం ధర్మకర్తలు, ఏఈఓ మధు, సూపరింటెండెంట్, ఆలయ సిబ్బంది, వేదపండితులు మరియు అర్చకులు పాల్గొన్నారు.

డి పాల్ హైస్కూల్‌లో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు



నంది పత్రిక ఆత్మకూరుఆత్మకూరు: విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, రక్షణ చర్యలపై అవగాహన పెంపొందించేందుకు ఆత్మకూరులోని డి పాల్ హైస్కూల్‌లో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి పి. రాహుల్ అంబేద్కర్, న్యాయవాదులు జి. మాణిక్యరావు, పి.వి.ఎస్. రామ్‌ప్రసాద్, పల్లంపర్తి భవిత, పాఠశాల ప్రిన్సిపాల్ రెవ. ఫాదర్ సింజే జాకబ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి, న్యాయవాదులు విద్యార్థులకు పోక్సో (పి ఓ సి ఎస్ ఓ) చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాలల హక్కులు, బాలల రక్షణ వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని, అపరిచితులు లేదా ఇతరుల నుంచి ఎదురయ్యే అసురక్షిత పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థుల్లో చట్టాల పట్ల అవగాహన పెంపొందించి, బాలల భద్రతకు సంబంధించిన విషయాలపై చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

బేతంచెర్ల మండలంలో తొలి రోజు నామినేషన్లకు విశేష స్పందన.

-19 గ్రామపంచాయతీలకు 59 సర్పంచ్ నామినేషన్లు.

-149 వార్డు సభ్యుల నామినేషన్లు దాఖలు.



బేతంచెర్ల నవంబర్ 21 (నందిపత్రిక). బేతంచెర్ల మండల పరిధిలోని 19 గ్రామపంచాయతీలకు సంబంధించి ఏర్పాటు చేసిన 6 నామినేషన్ కేంద్రాలలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదటి రోజు శనివారం నాడు ప్రశాంతంగా నిర్వహించ బడింది. మండలంలోని మొత్తం 19 గ్రామపంచాయతీలకు 19 మంది సర్పంచులు, 194 వార్డు సభ్యుల స్థానాలు ఉండగా, నామినేషన్ల మొదటి రోజు సర్పంచ్ అభ్యర్థుల నుంచి 59 నామినేషన్లు, వార్డు సభ్యుల అభ్యర్థుల నుంచి 149 నామినేషన్లు స్వీకరించినట్లు రిటర్నింగ్ అధికారులు (ఆర్ ఓ), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఎఆర్ఓ)వెల్లడించారు.మొదటి రోజే అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయడంతో, గ్రామాలలో ఎన్నికల సందడి మొదలైంది. మండలంలోని అన్ని నామినేషన్ కేంద్రాలలో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.ఈ సమాచారాన్ని బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ అధికారి (ఎంపీడీఓ ఎం. ఫజుల్ రహిమాన్ తెలిపారు.



కొత్తూరు సుబ్బరాయుని సన్నిధిలో టిడిపి ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల నాని పూజలు..!



పాణ్యం ప్రతినిధి. నవంబర్ 21 నంది పత్రిక. ప్రముఖ శైవ క్షేత్రం, పాణ్యం మండలం, క. కొత్తూరు గ్రామంలో వెలసియున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి సన్నిధిలో టీడీపీ నాయకుడు, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, ఆళ్లగడ్డ నియోజకవర్గం వైసీపీ నాయకుడు గంగుల బిజేంద్రనాథ్ రెడ్డి శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భముగా ఆలయ అధికారులు, అర్చక సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి వారికి అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచన మంటపము నందు పూలమాలలతో, శేష వస్త్రములతో ఘనంగా సత్కరించి ప్రసాదము అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మిలటరీ సుబ్బారెడ్డి, అమరసింహారెడ్డి, ప్రధాన అర్చకులు సురేష్ శర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌డీ జాబితాలోని ఓటర్ల వివరాలపై క్షేత్రస్థాయిలో పునఃపరిశీలన చేపట్టాలి

కడప ఈఆర్ఓ మురళి

అర్హులైన ఓటర్లకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలి

కడప బ్యూరో చీఫ్, నవంబర్ 21 నంది పత్రిక ఏఎస్‌డీ (గైర్హాజరు, ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన, మరణించిన, రెండుసార్లు నమోదైన) జాబితాలో ఉన్న ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కడప అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి మురళి తెలిపారు. శనివారం సాయంత్రం కడప ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా.. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఏఎస్‌డీ జాబితా పునఃపరిశీలనను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని ఆయన సూచించారు.కడప నియోజకవర్గంలో ఏఎస్‌డీ జాబితాకు సంబంధించి మొత్తం 66,558 ఎన్యుమరేషన్ ఫారాలు ఉన్నాయని, వీటన్నింటినీ నవంబర్ 20న సంబంధిత బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓలకు) అందజేసినట్లు తెలిపారు. ఈ ఫారాలకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించి, నవంబర్ 30వ తేదీలోగా విచారణ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అనంతరం సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారికి అందజేస్తామని వివరించారు. నవంబర్ 20న అనుబంధం–బి, అనుబంధం–సి ఫారాలను ముద్రించి, ఎన్యుమరేషన్ ఫారాలతో కలిపి సంబంధిత బీఎల్ఓలకు అందజేసినట్లు తెలిపారు. నవంబర్ 21 నుంచి 23వ తేదీ వరకు ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, నవంబర్ 24 నుంచి 30వ తేదీ వరకు పూర్తిచేసిన ఫారాల సేకరణ చేపడతామని పేర్కొన్నారు.ఏఎస్‌డీ జాబితాలో పొరపాటున పేరు చేరిన అర్హులైన ఓటర్లు అనుబంధం–బి ద్వారా తిరిగి ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి మారిన ఓటర్లు అనుబంధం–సి ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.క్షేత్రస్థాయిలో బీఎల్ఓలు చేపట్టే పునఃపరిశీలన సమయంలో రాజకీయ పార్టీల అధీకృత బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) కూడా తప్పనిసరిగా పాల్గొని సహకరించాలని మురళి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు బీఎల్ఓలు, పర్యవేక్షకులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్ఓలు) ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు, కడప తహశీల్దార్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్, ఎన్నికల సీనియర్ సహాయకుడు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాసేవే లక్ష్యం గ్రామ అభివృద్ధే ధ్యేయం!

కోటపాడు టిడిపి సర్పంచ్ అభ్యర్థి బరిలో శేష ఓబుల్ రెడ్డి



సిరివెళ్ల. నవంబర్ 21 (నంది పత్రిక) సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో టిడిపి సర్పంచ్ ఎన్నికల్లో శేష ఓబుల్ రెడ్డి బరిలో నిలిచారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనే ప్రధాన లక్ష్యాలుగా ఎన్నికల బరిలోకి దిగినట్లు ఆయన తెలిపారు.అధికారం కోసం కాకుండా ఆత్మగౌరవం కోసం, పదవుల కోసం కాకుండా ప్రజాసేవ కోసం ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్య పరిష్కారం, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడం, యువతను ప్రోత్సహించడం, మహిళలకు సముచిత గౌరవం కల్పించడం, వృద్ధులు, పేదల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపడం తన ప్రధాన లక్ష్యాలని వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మగౌరవం కోసం, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగాను“ అని తెలిపారు.ప్రజల ఆశీర్వాదం, సహకారంతో కోటపాడు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తన ఆకాంక్ష అని శేష ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు.


అహోబిలం క్షేత్రానికి విచ్చేసే భక్తులకు తీపి కబురు..

నవ నరసింహ క్షేత్రాలలో మెడికల్ కిట్లు ఏర్పాటు..



ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 21 నంది పత్రిక ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం శ్రీ స్వాతి హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం నవ నరసింహ క్షేత్రాలలో ఫస్ట్ ఎయిడ్ మెడికల్ కిట్లను, మందులను అందుబాటులోనికి తీసుకొని వచ్చారు. ఆళ్లగడ్డకు చెందిన ప్రముఖ వైద్యులు అహోబిలం శ్రీ స్వాతి హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సారెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. అహోబిలం మఠం 46వ పీఠాధిపతి శ్రీవన్శగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి వారి ఆదేశాల మేరకు టీవీఎస్ కంపెనీవారు నవ నరసింహ క్షేత్రాల సందర్శనార్థం వచ్చే భక్తులకు ప్రత్యేక మందులతో కూడిన ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందజేయడం జరిగింది. అహోబిల నవ నరసింహ క్షేత్రాలను సందర్శించేందుకు వచ్చిన భక్తులు అస్వస్థతకు గురైనా, చిన్న ప్రమాదాలలో గాయపడినా ఈ ఫస్ట్ ఎయిడ్ కిట్ల ద్వారా ప్రాథమిక వైద్యాన్ని అందించి అనంతరం స్వాతి హాస్పిటల్ లో చికిత్స అందించడం జరుగుతుందని డైరెక్టర్ డాక్టర్ నరసింహారెడ్డి తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రంగరాజు ఆధ్వర్యంలో శనివారం స్వాతి హాస్పిటల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో డాక్టర్ నరసింహారెడ్డి చేతులమీదుగా ఈ ప్రత్యేక మందుల కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్టు మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి రోజే ఊపందుకున్న నామినేషన్ల ప్రక్రియ



జూపాడుబంగ్లా, నవంబర్ :21 :(నంది పత్రిక) మూడో విడత గ్రామ సర్పంచులు, వార్డు సభ్యుల ఎన్నికల కొరకు ఎన్నికల కమిషనర్ ఎన్నికల నిర్వహణ నోటిఫికేషన్ దాఖలు చేసింది. ఆ క్రమంలో శనివారం జూపాడుబంగ్లా మండలంలో మొదటి రోజు నామినేషన్ దాఖలు చేసే ప్రక్రియ ఊపందుకుంది. మూడో విడత గ్రామపంచాయతీలో ఎన్నికల నేపథ్యంలో జూపాడు బంగ్లా మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు గాను మొదటి రోజైన శనివారం సర్పంచ్ స్థానాలకు 20 మంది, వార్డు స్థానాలకు 103 మంది అభ్యర్థులు నామినేషన్ వేసినట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. పారుమంచాల క్లస్టర్లో తుడిచెర్ల గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా టిడిపి బలపరిచిన దొడ్డ నాగమణి ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలు అందజేశారు. మండ్లేము క్లస్టర్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన డి. హాజిరాంబి శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలు అందజేశారు. మండ్లేము క్లస్టర్లో తర్తూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి గా టిడిపి బలపరిచిన సుభద్రమ్మ నామినేషన్ దాఖలు చేశారు. 80 బన్నూరు గ్రామంలో గ్రామ సర్పంచిగా బి. మద్దిలేటి రెడ్డి టిడిపి అభ్యర్థిగా నామినేషన్ వేశారు. పి. లింగాపురం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పి. శేషమ్మ నామినేషన్ వేశారు. టిడిపి బలపరిచిన అభ్యర్థిగా ఏ. సాంబశివుడు నామినేషన్ దాఖలు చేశారు. జూపాడుబంగ్లా క్లస్టర్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సర్పంచ్ గా షాజహాన్ బేగం నామినేషన్ దాఖలు చేశారు. భాస్కరాపురం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా రమేష్ బాబు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలు అందజేశారు. తాటిపాడు గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి బోయ వెంకటరమణ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలు అందజేశారు.



పత్తికొండ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా టీచర్ భ్రమరాంబ నామినేషన్ దాఖలు

మార్పు కోసం ముందడుగు.. అభివృద్ధి కోసం సంకల్పం!



కర్నూలు సిటీ నందిపత్రిక పత్తికొండ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ, ప్రజా సంఘాల మద్దతుతో పోటీ చేస్తున్న టీచర్ భ్రమరాంబ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ మరియు కాంగ్రెస్ జిల్లా నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువకులు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆమెకు మద్దతు తెలిపారు. పత్తికొండ గ్రామ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన పాలన, పారదర్శకత, మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికల బరిలో నిలుస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలు ఒక్క అవకాశం ఇచ్చి అభివృద్ధికి, మార్పుకు మద్దతుగా నిలవాలని అభివృద్ధి మరియు సాధికారతను గెలిపించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న స్వామి, కార్యదర్శి ముహమ్మద్, షబ్బీర్, లక్ష్మణ్, అంజి, ప్రజా సంఘాల నాయకులు అంజి, రామకృష్ణ, వీరశేఖర్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు



ఖాజీపేట (నంది పత్రిక) నవంబర్ 21 వైఎస్సార్ కడప జిల్లా ఖాజీపేట మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా కొనసాగుతోంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఖాజీపేట పోలీసులు అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు పోలీసులు అవసరమైన సహకారం అందిస్తూ, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నారు. అభ్యర్థులు నామినేషన్ కేంద్రాలకు చేరుకున్నప్పటి నుంచి నామినేషన్ దాఖలు చేసే వరకు పోలీసు సిబ్బంది దగ్గరుండి తగిన సూచనలు, సహకారం అందిస్తున్నారు.మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వద్ద ఎన్నికల నిబంధనలు పాటించేలా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఖాజీపేట మండలంలో ఇప్పటివరకు నామినేషన్ల ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా కొనసాగుతోంది.



పత్తూరు సర్పంచ్ అభ్యర్థిగా ముత్తూరు.అమరావతి నామినేషన్ దాఖలు

గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా..

ప్రజల ఆశీస్సులు కోరిన అమరావతి



ఖాజీపేట, నవంబర్ 21 (నంది పత్రిక) ఖాజీపేట మండలంలోని పత్తూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ మద్దతుదారు ముత్తూరు అమరావతి శనివారం నామినేషన్ దాఖలు చేశారు. మాజీ ఉపసర్పంచ్ ముత్తూరు. రమణ భార్య అయిన ఆమె కుటుంబ సభ్యులతో కలిసి ఎన్నికల అధికారి కి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ముత్తూరు అమరావతి మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారం, ఆశీస్సులతో సర్పంచ్‌గా ఎన్నికైతే పత్తూరు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పుట్టా.సుధాకర్ యాదవ్ సహకారంతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో నిలిచినట్లు వెల్లడించారు. గ్రామ ప్రజలందరూ తనకు మద్దతు తెలిపి ఆశీర్వదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

వీరారెడ్డి పల్లె సర్పంచ్ బరిలో మందాల శివారెడ్డి

భారీ మెజారిటీ దిశగా ప్రచారం

శిరివెళ్ల (నంది పత్రిక) :–సిరివెళ్ల మండల పరిధిలోని వీరారెడ్డి పల్లె గ్రామపంచాయతీ సర్పంచ్ బరిలో మందాల శివారెడ్డి గారు నిలిచారు. ఎన్నికల అధికారులు ఆయనకు కత్తెర గుర్తు కేటాయించడంతో ప్రజల్లోకి ప్రచార నిమిత్తం దూసుకు వెళుతున్నారు. వీరారెడ్డిపల్లి గ్రామంలోని పలు వాడలలో చేసిన సర్పంచ్ ఎన్నికల ప్రచారానికి గ్రామపంచాయతీ ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తోంది. గ్రామ ప్రజలలో మంచి పేరు ప్రఖ్యాతలు గల నాయకుడిగా మందాలకు గుర్తింపు ఉన్నదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతు దారునిగా సర్పంచ్ బరిలో నిలవడం వల్ల ఆయన విజయం పై వైసిపి వర్గాలు ధీమా వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంలో ముందు ఉంటూ ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండడం వల్ల మందాల శివారెడ్డి గారి గెలుపు ఖాయమని మెజార్టీ పైనే దృష్టి అంతా అని వీరారెడ్డి పల్లె గ్రామపంచాయతీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కత్తెర గుర్తు గడపగడపకు తీసుకువెళ్లి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు..

దోమలను నివారిస్తే సంపూర్ణ ఆరోగ్యం.

అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకట్ రెడ్డి



గోపవరం, నవంబర్ 21 (నంది పత్రిక): దోమలను నివారిస్తే సంపూర్ణ ఆరోగ్యమని, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకట్ రెడ్డి అన్నారు. గోపవరం మండలం, చిన్న గోపవరం లో శనివారం ఫీవర్ ,లార్వా, ఇంటింటి సర్వే వైద్య సిబ్బంది చేపట్టారు. ఇండ్లలో వాడుకొన్న నీటిని రోడ్లపై పోయవద్దని సూచించడం జరిగింది. వారంలో రెండు రోజులు తొట్లను, డ్రమ్ములను శుభ్రం చేసుకోవాలని వారికి చెప్పడం జరిగింది. పెద్దగోపవరంలో బోదకాలు వ్యాధిగ్రస్తులను వెంకటరెడ్డి మరియు సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ, గోపవరం వైద్య అధికారి, మురళీకృష్ణ, వారికి కిట్లను పంపిణీ చేయడం జరిగింది. ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో ఫీవర్, మలేరియా పై వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడైనా జ్వరాలు వస్తే అక్కడ వెంటనే మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. 104 ద్వారా పల్లెల్లోనూ ప్రజలకు వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. అత్యవసర చికిత్సకు 108 ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. బోధకాలు వ్యాధి ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ఈ వ్యాధి నయమవుతుందన్నారు. ప్రతి జబ్బుకు ప్రభుత్వ ఆసుపత్రులలో మందులు సమృద్ధిగా ఉన్నాయని, ప్రైవేట్ ఆస్పత్రిలో పోయి వేల రూపాయలు ఖర్చు చేసుకోవద్దన్నారు.ఈ కార్యక్రమం లో సూపర్ వైజర్ శివ రామిరెడ్డి, పి. హెచ్. ఎన్ విజయకుమారి హెల్త్ అసిస్టెంట్లు గంగి రెడ్డి, మహమ్మద్ ఖాసీం, జనర్దన్ రావు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #2-189, journalist colony, lakshmi narasimha swamy temple back side, Pulivendula Town, Y.S.R Kadapa District, Andhra Pradesh -PinCode:-516390, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:-APTEL/26/A6827 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

జనసేన పార్టీ బలపరిచిన అభ్యర్థిగా కోటపాడు సర్పంచ్ బరిలో రామిరెడ్డి గారి నవీన్ కుమార్ రెడ్డి

ఇరిగెల బ్రదర్స్ నాయకత్వంలో ఎన్నికల రణరంగంలో భారీ మెజారిటీ దిశగా ప్రచారం

శిరివెళ్ల: (నంది పత్రిక) శిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ బరిలో జనసేన పార్టీ బలపరిచిన అభ్యర్థిగా రామిరెడ్డి గారి నవీన్ కుమార్ రెడ్డి గారు బరిలో నిలిచారు. ఎన్నికల అధికారులు ఆయనకు ఉంగరం గుర్తు కేటాయించడంతో ప్రజల్లోకి ప్రచార నిమిత్తం దూసుకు వెళుతున్నారు. కోటపాడు గ్రామంలో వీరి తండ్రి గారు రామిరెడ్డి గారి ఓబుల కొండారెడ్డి సర్పంచ్ గా వీరి తల్లిగారు కూడా సర్పంచ్ గా గ్రామానికి విశేష సేవలు అందించి గతంలో ఎంతో అభివృద్ధి చేసిన ఘన చరిత్ర గల కుటుంబానికి చెందిన రామిరెడ్డి గారి నవీన్ కుమార్ రెడ్డిప్రచారంలో దూసుకుపోతున్నారు.గ్రామంలో పలు వాడలలో చేపట్టిన సర్పంచ్ ఎన్నికల ప్రచారానికి గ్రామ పంచాయతీ ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తోంది. గ్రామ ప్రజలలో మంచి పేరు ప్రఖ్యాతలు గల యువ నాయకుడిగా గుర్తింపు ఉన్నదని జనసేన పార్టీ బలపరచడం ద్వారా ఆళ్లగడ్డ జనసేన పార్టీ నాయకులు ఇరిగెల రాంపుల్లా రెడ్డి, ఇరిగెల సూర్య నారాయణ రెడ్డి గారి మద్దతుదారునిగా సర్పంచ్ బరిలో నిలవడం వల్ల ఆయన విజయంపై గ్రామ ప్రజలు ధీమా వ్యక్తం చేశారు.అలాగే మన జనసేనాని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ గారికి చెందిన పంచాయతీ రాజ్ శాఖకు చెందిన పంచాయతీ సర్పంచ్ గా గెలిస్తే మరింత అభివృద్ధి చేస్తానని గ్రామానికి అందంగా ముస్తాబుగా చేసి ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతానని హామీ ఇచ్చారు.గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంలో ముందు ఉంటూ ప్రజలతో సస్తంబంధాలు కలిగి ఉండడం వల్ల రామిరెడ్డి గారి నవీన్ కుమార్ రెడ్డి గారి గెలుపు ఖాయమని మెజార్టీ పైనే దృష్టి అంతా అని కోటపాడు గ్రామ పంచాయతీ పెద్దలు ,పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఉంగరం గుర్తు ప్రతి గడపగడపకు తీసుకువెళ్లి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు.

ఐదుగ్రామపంచాయతీలు ఏకగ్రీవం

ఆరు గ్రామపంచాయ తీలలో పోటీ

దొర్నిపాడు నవంబర్ 21 నంది పత్రికదొర్నిపాడు మండలంలోని 11 గ్రామ పంచాయతీలకు గాను 5 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం కాగ,6 గ్రామపంచాయతీలో గట్టిపోటీనెలకొంది మండలంలోని దొర్నిపాడు, కొత్తపల్లి,చాకరాజు వేముల,అమ్మిరెడ్డి నగర్ రామచంద్రాపురం,గ్రామపంచాయతీలు ఏకీకృతమయ్యాయి, కిష్టిపాడు,గుండుపాపల ,బురారెడ్డిపల్లె,కొండాపురం,గోవిందన్నేఅర్జునాపురం, గ్రామాలలో పోటీలో అభ్యర్థులుఉన్నారు ఏకగ్రీవమైన అభ్యర్థులు అమ్మిరెడ్డి నగర్, చక్రవర్తి నాయుడు, కొత్తపల్లి పెద్ద ఓబులేసు ,రామచంద్రాపురం బబ్బూరిలక్ష్మీశిరీష ,దొర్నిపాడు పగడాలబాలనరసమ్మ, చాకరాజువేముల మహబూబ్ బి ఏకగ్రీవమయ్యారు, దొర్నిపాడు వైస్ చైర్మన్ గబత్తుల సుశీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

సిరివెళ్ల రాజకీయ రణరంగంలో హోరాహోరీ పోరు!

మేము వైయస్సార్సీపి పార్టీ సర్పంచ్ ఎన్నికల పోటీలో తగ్గేదేలే అంటున్న నాయక్ ముజఫర్ హుస్సేన్

వైఎస్సార్‌సీపీ సర్పంచ్ అభ్యర్థిగా నాయక్ ముజఫర్ హుస్సేన్ బరిలోకి.. గెలుపే లక్ష్యంగా ప్రచార హోరు!

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బిజయేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు బసాపురం అబ్దుల్ సలాం పిలుపుమేరకు సిరివెళ్లలో సర్పంచ్ ఎన్నికల సమరం.. తగ్గేదేలే అంటున్న నాయక్ ముజఫర్ హుస్సేన్!



సిరివెళ్ల(నంది పత్రిక) గ్రామపంచాయతీ ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నాయక్ ముజఫర్ హుస్సేన్. 18 వార్డుల్లోనూ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచినా గ్రామంలో ఆశించిన అభివృద్ధి జరగలేదంటూ విమర్శలు. ప్రజలే నిర్ణేతలు.. అభివృద్ధి చేసిన వారికే ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి.వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఎన్నికల పోరులో రాజీ లేదంటున్న పార్టీ శ్రేణులు.ఓటర్లను చైతన్యపరుస్తూ ప్రచారంలో దూసుకుపోతున్న నాయకులు, కార్యకర్తలు.మీడియాతో మాట్లాడుతూఆళ్లగడ్డ నియోజకవర్గం సిరివెళ్ల మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఎన్నికల రాజకీయం రసవత్తరంగా మారుతోంది.సర్పంచ్ ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నాయక్ ముజఫర్ హుస్సేన్ నిలవడంతో రాజకీయ వేడి మరింత పెరిగింది.గ్రామంలోని 18 వార్డుల్లోనూ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచినా సిరివెళ్ల గ్రామంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని నాయక్ ముజఫర్ హుస్సేన్ విమర్శిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, ఎవరు మంచి చేస్తారో వారికే ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిస్తున్నారు. ఎలాంటి అపోహలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఎన్నికల బరిలో రాజీ పడే ప్రసక్తే లేదని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి సిరివెళ్ల గ్రామపంచాయతీ ఎన్నికల పోరు రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతుండగా.. ఓటర్లు ఎవరికి పట్టం కడతారన్నది వేచి చూడాలి!

హెచ్ఐవి, ఎయిడ్స్ పై జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

కడప నవంబర్ 21 (నంది పత్రిక రిపోర్టర్) హెచ్ఐవి / ఎయిడ్స్ పై యువతకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఈ నెల 29న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టి బి అధికారి డాక్టర్ ఎన్. రవి బాబు, డివిడిఓ డాక్టర్ సి. సురేష్ బాబు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.ఏపీ శాక్స్ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఇంటర్, విద్యాశాఖ సంయుక్తంగా హెచ్ఐవి / ఎయిడ్స్ పై క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న 8, 9, ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు.పోటీలకు హాజరయ్యే విద్యార్థులు ఆయా పాఠశాలలో చదువుతున్నట్లు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని పేర్కొన్నారు.

ఉదయం 10.00 నుంచి 3.00 వరకు పోటీలు ఉంటాయని తెలిపారు.

జిల్లాస్థాయి విజేతలకు మొదటి బహుమతి రూ. 5 వేలు, ద్వితీయ బహుమతి రూ. 4 వేలు, మూడవ బహుమతి రూ. 3 వేలు, కన్సోలేషన్ బహుమతి రూ. 2 వేలు నగదు బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు.ప్రతి టీమ్ కు ఇద్దరు మాత్రమే పాల్గొ నాల్సి ఉంటుందని తెలిపారు.

మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తొలి రోజు 465 సర్పంచ్, 1,120 వార్డు సభ్యుల నామినేషన్లు

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

22, 23 తేదీల్లోనూ నామినేషన్ల స్వీకరణ.. అన్ని కేంద్రాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు



కడప, బ్యూరో చీఫ్ నవంబర్ 21: నంది పత్రిక వైఎస్ఆర్ కడప జిల్లాలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ తొలి రోజైన నవంబర్ 21న మొత్తం 465 సర్పంచ్ అభ్యర్థులు, 1,120 వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.మండలాల వారీగా పరిశీలిస్తే జమ్మలమడుగులో 2 సర్పంచ్, 10 వార్డు సభ్యుల నామినేషన్లు, మైలవరంలో 59 సర్పంచ్, 104 వార్డు సభ్యుల నామినేషన్లు, చాపాడులో 34 సర్పంచ్, 108 వార్డు సభ్యుల నామినేషన్లు, దువ్వూరులో 34 సర్పంచ్, 83 వార్డు సభ్యుల నామినేషన్లు దాఖలయ్యాయి. ముద్దనూరులో 42 సర్పంచ్, 80 వార్డు సభ్యుల నామినేషన్లు, రాజుపాలెంలో 42 సర్పంచ్, 131 వార్డు సభ్యుల నామినేషన్లు, ప్రొద్దుటూరులో 32 సర్పంచ్, 165 వార్డు సభ్యుల నామినేషన్లు, పెద్దముడియంలో 46 సర్పంచ్, 146 వార్డు సభ్యుల నామినేషన్లు నమోదయ్యాయి.అదేవిధంగా కొండాపురంలో 27 సర్పంచ్, 91 వార్డు సభ్యుల నామినేషన్లు, ఎర్రగుంట్లలో 17 సర్పంచ్, 34 వార్డు సభ్యుల నామినేషన్లు, మైదుకూరులో 46 సర్పంచ్, 46 వార్డు సభ్యుల నామినేషన్లు, ఖాజీపేటలో 55 సర్పంచ్, 102 వార్డు సభ్యుల నామినేషన్లు, బి.మఠంలో 29 సర్పంచ్, 20 వార్డు సభ్యుల నామినేషన్లు దాఖలైనట్లు కలెక్టర్ వెల్లడించారు.జిల్లాలో మూడో విడత ఎన్నికలు నిర్వహించనున్న 13 మండలాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైందని, నవంబర్ 22, 23 తేదీల్లో కూడా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అభ్యర్థులు నిర్దిష్ట గడువులోగా నామినేషన్లు దాఖలు చేయాలని, ఎన్నికల నిబంధనలను పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేందుకు అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ సూచించినట్లు తెలిపారు.

చింతలపల్లె పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తా.. ఏకగ్రీవ ఎన్నికపై గంధం భాస్కర్ హర్షం

సాధనకారి రంతు ఆశీస్సులు, ప్రోత్సాహంతోనే విజయం సాధించా..

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా



కలసపాడు, నవంబర్ 21(నంది పత్రిక):కడప జిల్లా కలసపాడు మండలంలోని చింతలపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎస్సీ అభ్యర్థి గంధం భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన తన ఎన్నికకు సహకరించిన నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ డైరెక్టర్ సాధనకారి రంతు ఆశీస్సులు, ప్రోత్సాహం, సహకారంతోనే తాను ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని గంధం భాస్కర్ పేర్కొన్నారు. తనకు నిరంతరం అండగా నిలిచి ప్రోత్సహించిన సాధనకారి రంతుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి తన వెంట నడిచిన నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులకు శిరసు వంచి పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. చింతలపల్లె గ్రామ పంచాయతీ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, గ్రామంలోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన పంచాయతీగా చింతలపల్లెను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి అవసరాలు, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని గంధం భాస్కర్ వెల్లడించారు.

అర్చకులు నైషధం ప్రసాద్ శర్మను పరామర్శించిన టీడీపీ బ్రాహ్మణ నాయకులు

మాజీ కార్పొరేటర్ సురేష్ బాబు, కడప జిల్లా అర్చక పురోహిత సంఘం అధ్యక్షులు గోపి స్వామి



కడప నవంబర్ 21 (నంది పత్రిక రిపోర్టర్)ఇటీవల దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అర్చకుడు నైషధం ప్రసాద్ శర్మను పరామర్శించి, అవసర మైన సహాయం కోసం మేమున్నామని ధైర్యం చెప్పిన సురేష్ బాబు, గోపి స్వామి.దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసు కోవాలనికోరారు.బ్రాహ్మణునిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించిన టీడీపీ బ్రాహ్మణ నాయకులు సురేష్ బాబు, అర్చక పురోహిత సంఘం అధ్యక్షులు గోపి స్వామి

సిరివెళ్ల పట్టణంలో వైసిపికి భారీ షాక్ టీడీపీ లోకి సునామీగా తరలివచ్చిన ముస్లిం మైనార్టీ సోదరులు..

సిరివెళ్ల (నంది పత్రిక)సిరివెళ్ల పట్టణంలో ఈరోజు నాసిర్ ఖాన్, మాలి ఖాన్, రైస్ మిల్ కాజా, డి హమీద్, ఫైజల్ ఖాన్, కలాం ఖాన్, అజ్మత్ ఖాన్, ఇజాజ్ ఖాన్, ఆసిఫ్ ఖాన్, మహమ్మద్ ఇలియాస్ ఖాన్, ఈరోజు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారి సమక్షంలో పార్టీలకి రావడం జరిగిందని తెలియజేశారు...పది రోజులుగా సిరివెళ్ల మండలంలో ఎన్నోసార్లు ఇక్కడికి రావడం జరిగిందని ఎందుకంటే ప్రతిరోజు ఎవరో ఒకరు వైసీపీని వీడి టిడిపిలోకి రావడం జరుగుతుందని, ప్రజలందరూ మార్పు కోరుకుంటున్నారని అందుకోసమే సునామీ లాగా తరలి వస్తున్నారని తెలిపారు, ఇప్పటికే సిరివెళ్ల పట్టణానికి కోటి 50 లక్షల రూపాయలు నిధులు ఇవ్వడం జరిగిందని రాబోయే రోజుల్లో,జడ్పీటీసీ నిధులు ఎంపీపీ నిధులు, సర్పంచ్ నిధులు అన్ని ఊరి డెవలప్మెంట్ కోసమే వాడుతాము అని తెలియజేసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు... సిరివెళ్ల లొ భూమా సొంత గూటికి వస్తున్న ప్రతి ఒక్క కార్యకర్తకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్న, ఈ మార్పుకు కారణమైన మహమ్మద్ హుస్సేన్, ఫిదా కి ధన్యవాదాలు తెలియజేసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు... మీరు ఏ నమ్మకంతో అయితే పార్టీలోకి వచ్చారో కచ్చితంగా ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి ఒక్క పనిని చేసి చూపిస్తానని ప్రజలందరికీ హామీ ఇచ్చిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు.



పుల్లూరు సర్పంచ్ అభ్యర్థిగా నంద్యాల రవి యాదవ్

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సార్ ఆశీస్సులతో మా కుటుంబ సభ్యులు మా పెద్దనాన్న నంద్యాల పెద్ద సుబ్బయ్య యాదవ్ మా యాదవ్ మా నాన్న బాలరాజు యాదవ్ మా అన్నల ఆశీస్సులతో



ఖాజీపేట, (నంది పత్రిక) నవంబర్ 21: ఖాజీపేట మండలంలోని పుల్లూరు పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నంద్యాల రవి యాదవ్‌ను ప్రకటించారు. మైదుకూరు నియోజకవర్గ శాసనసభ సభ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్ సార్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు.ఈ ప్రకటనతో పుల్లూరు పంచాయతీ పరిధిలోని రహమత్ ఖాన్ పల్లెతో పాటు అన్ని గ్రామాల్లో తెలుగుదేశం శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసింది. నాయకులు, అభిమానులు రవి యాదవ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.



రవి యాదవ్ ఏమన్నారంటే... అనంతరం రవి యాదవ్ మాట్లాడుతూ, శాసనసభ సభ్యుడు సుధాకర్ యాదవ్ సార్ ఆశీస్సులతో, తన కుటుంబ సభ్యుల ఆశీస్సులతో తనకు ఈ బాధ్యత అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.పుల్లూరు పంచాయతీ ప్రజలందరికీ కట్టుబడి ఉంటానని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు.

అభివృద్ధే తన లక్ష్యమని...సర్పంచ్‌గా గెలిస్తే పంచాయతీలోని ప్రతి గ్రామానికి తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక సౌకర్యాలు కల్పిస్తానని, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తానని రవి యాదవ్ చెప్పారు.పేదలు, మహిళలు, రైతులు, యువత సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని, పంచాయతీని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. ప్రజలందరూ తనకు అండగా నిలిచి ఆశీర్వదించాలని రవి యాదవ్ కోరారు.

అప్పనపల్లి సర్పంచ్ అభ్యర్థిగా కాలా.సుబ్బలక్ష్మి నామినేషన్

ఎనిమిది గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యం.. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామాలకు చేరుస్తాం



ఖాజీపేట, నవంబర్ 21 (నంది పత్రిక) ఖాజీపేట మండలంలోని అప్పనపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మద్దతుతో కాలా సుబ్బలక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఎనిమిది గ్రామాల సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు.కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను గ్రామాలకు చేరవేయడంతో పాటు, అందుబాటులో ఉన్న ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుని పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామ ప్రజల ప్రాథమిక అవసరాలైన తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు.ఎనిమిది గ్రామాల్లోని ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తూ, ప్రభుత్వ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రయత్నిస్తానన్నారు. ఈ సందర్భంగా అప్పనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఎనిమిది గ్రామాల ప్రజలు తనకు సహకరించి, ఆదరించి ఆశీర్వదించాలని కాలా సుబ్బలక్ష్మి విజ్ఞప్తి చేశారు.

ఖాజీపేట మండలంలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ఖాజీపేట, (నంది పత్రిక) నవంబర్ 21: ఈరోజు ఖాజీపేట మండలంలో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఏటూరు పంచాయతీకి సంబంధించి అభ్యర్థులు త్రిపురవరంగ్రామ సచివాలయంలో తమ నామినేషన్లను దాఖలు చేశారు.ఈ సందర్భంగా నామినేషన్లు వేసిన అభ్యర్థులకు మద్దతుగా ఖాజీపేట మండల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుగ్గి రెడ్డి మురళి మోహన్ రెడ్డి, ఆధ్వర్యంలో మిగతా నాయకులతో పాటు ఏటూరు గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి





ఇంచార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ

భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 21 నంది పత్రిక

జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జెసి ఛాంబర్ లో డీఎస్ఓ, డీఎం, ఏడీ మార్కెటింగ్, కో-ఆపరేటివ్ సొసైటీ, రైతు సేవా కేంద్రాల అధికారులతో ధాన్యం సేకరణ, ధరణి రైస్, గోనె సంచుల లభ్యత తదితర అంశాలపై ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు సుమారు 5,300 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని, ఇంకా 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అవకాశం ఉన్నందున ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. ధాన్యం రవాణాకు సరిపడా వాహనాలను అందుబాటులో ఉంచడంతో పాటు హమాలీల కొరత లేకుండా చూడాలని, రైతులకు ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారం అందించాలని ఆదేశించారు.

అర్నబ్, మురాస్ తుపాన్ల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో ధాన్యం సేకరణ విధానం, కొనుగోలు ధరలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, రైతుల అభిప్రాయాల మేరకు తగిన ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

గోనె సంచులను రైతులకు అందజేసే ముందు వాటి నాణ్యతను పరిశీలించాలని, వినియోగం అనంతరం మిగిలిన సంచులను రైతు సేవా కేంద్రాలకు తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గోనె సంచుల వివరాలను సంబంధిత యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి యాప్ వినియోగంపై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

ధరణి రైస్‌కు సంబంధించి ప్రతి మండలంలో ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సన్నబియ్యం విక్రయాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ విక్రయాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో డిఎం ఇబ్రహీం, డీఎస్ఓ సరోజ, డిసిఓ మురళీకృష్ణ, ఏడీ మార్కెటింగ్ సునీల్ కుమార్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రామరాజు, సెక్రటరీ కె శ్రీనివాస్, వ్యవసాయ శాఖ ఏడీలు, తదితర సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

ఉపాధ్యాయ ఓటర్ల నమోదు ప్రక్రియ నూరు శాతం పూర్తి చేయాలి.





ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఓటర్ల నమోదుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.
ఇప్పటివరకు 3475 దరఖాస్తులు స్వీకరణ 1,118 దరఖాస్తులు పరిశీలన దశలో పెండింగ్.
సర్ ప్రక్రియ లో అబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ కేటగిరీల్లో తొలగించిన 85,444 మంది ఓటర్లపై పునఃపరిశీలన చేపట్టాలి.
ఓటరుగా నమోదు చేసుకునేందుకు నవంబర్ 30 వరకు అవకాశం.
ఇంచార్జి జిల్లా కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ.

భీమవరం, బ్యూరో చీఫ్ నవంబర్,21 నంది పత్రిక

ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యాయ ఓటర్ల నమోదు ప్రక్రియ నూరు శాతం నమోదు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ కె ఆర్ కల్ప శ్రీ అన్నారు.శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యాయ ఓటర్ల నమోదు ప్రక్రియ, ఇప్పటివరకు అందిన దరఖాస్తులు, వాటి పరిశీలన, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, సర్ ప్రక్రియ తదితర అంశాలపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ కె ఆర్ కల్ప శ్రీ మాట్లాడుతూ పశ్చిమగోదావరి నియోజకవర్గం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 20 మండలాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వివరాలను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించటం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఉపాధ్యాయ ఓటర్లు నమోదు ప్రక్రియ నూరు శాతం నమోదు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు ఫారం- 19 లో దరఖాస్తుతో పాటు 1-11-2026 తేదీ నాటికి గడిచిన ఆరు సంవత్సరాల కాలంలో 3 సంవత్సరాల పాటు ఉన్నత పాఠశాల, కళాశాలల్లో టీచర్, లెక్చరర్ గా పనిచేస్తున్నట్లు ధ్రువీకరిస్తూ సంబంధిత విద్యా సంస్థ అధిపతి నుండి ధ్రువీకరణ పత్రాన్ని కలిగి ఉండాలని తెలిపారు. నమోదు ప్రక్రియకు సంబంధించి ఫామ్ -19తో పాటు పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ప్రభుత్వ పాఠశాల కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ, లెక్చరర్లు అనుబంధం -xx పై సంబంధిత ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి, ప్రిన్సిపాల్ తో ధ్రువీకరించాలని తెలిపారు.ప్రైవేటు పాఠశాల, కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు అనుబంధం -xx పై ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్ ధ్రువీకరణతోపాటు డిఇఓ, ఆర్ ఐ ఓ, ఆర్ జె డి లతో కూడా తప్పనిసరిగా కౌంటర్ సంతకం చేయించాలని తెలిపారు. వీటితోపాటు అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు వివరాలను జత చేయాలని తెలిపారు ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాల, కళాశాల, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో, కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారి, ఆర్ ఐ ఓ, ఆర్ జె డీలచే అనుబంధం-xx నందు తప్పనిసరిగా కౌంటర్ సంతకం చేయించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు.

సర్ ప్రక్రియ ఓటరు జాబితా ప్రక్షాళనలో భాగంగా అబ్సెంట్ (గైర్హాజరు), షిఫ్టెడ్ (వలస వెళ్లినవారు), డెత్ (మరణించినవారు), డూప్లికేట్ (నకిలీ/పునరావృత నమోదులు) కేటగిరీలకు సంబంధించి జిల్లాలో 85,444 మంది ఓటర్ల పేర్లను తొలగించడం జరిగిందని, అయితే ఈ జాబితాలను మరోసారి సమగ్రంగా పునఃపరిశీలించి, అర్హత కలిగిన ఓటర్లు ఎవరూ ఓటు హక్కును కోల్పోకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ సంబంధిత అధికారులకు సూచించారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు నవంబర్ 30వ తేదీ వరకు అవకాశం కల్పించబడిందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.ఓటరు జాబితా పునఃపరిశీలన ప్రక్రియను బాధ్యతాయుతంగా, పారదర్శకంగా నిర్వహించి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఇంచార్జ్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఒ పి. గ్లోరీ, కలెక్టరేట్ ఎలక్షన్ విభాగం సూపరింటెండెంట్ శేఖర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థికి ఇంటింటా నీరాజనాలు!









45వ వార్డులో దార్ల దివ్యజ్యోతికి ప్రజల ఆత్మీయ స్వాగతం

శ్రీకాకుళం బ్యూరో చీఫ్ నవంబర్ 21 నంది పత్రిక

శ్రీకాకుళం నగరంలోని 45వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న దార్ల దివ్యజ్యోతికి ఇంటింటా అపూర్వమైన ఆత్మీయ స్వాగతం లభిస్తోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్తున్న ఆమెకు స్థానిక మహిళలు హారతులు పట్టి స్వాగతం పలుకుతుండగా, కుటుంబ సభ్యులు, పెద్దలు ఆప్యాయంగా ఆహ్వానించి తమ మద్దతును తెలియజేస్తున్నారు.వారి కుటుంబం గత 50 సంవత్సరాలుగా ఇదే వార్డులో నివసిస్తుండటంతో స్థానిక ప్రజలతో వారికి సుదీర్ఘమైన అనుబంధం ఉంది. ఈ పరిచయం ప్రచారంలో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతి ఇంటికీ వెళ్లినప్పుడు కేవలం ఓటు అభ్యర్థించడమే కాకుండా, ఇంట్లో కూర్చొని కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకునే అవకాశం కలుగుతోంది. ముఖ్యంగా కత్తెర వీధి నుంచి పోటీ చేస్తున్న దార్ల దివ్యజ్యోతికి ఎన్నికల గుర్తుగా కత్తెర లభించడం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వీధి పేరు, ఎన్నికల గుర్తు ఒకే విధంగా ఉండటం ఓటర్లకు గుర్తుంచుకోవడానికి సులభంగా ఉంటుందని స్థానికంగా చర్చ జరుగుతోంది. ప్రచారంలో లభిస్తున్న ఆత్మీయ స్వాగతాలు, ప్రజలతో ఉన్న పాత పరిచయాలు, ఇంటింటా సాగుతున్న మమేకం ప్రస్తుతం 45వ వార్డులో ఎన్నికల ప్రచారానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తున్నాయి.

గుజరాత్‌లో దుర్ఘటన.. స్నేహితుడిని కాపాడబోయి ఏపీ విద్యార్థి మృతి

గుజరాత్‌లో దుర్ఘటన చోటుచేసుకుంది. నీటి ప్రవాహంలో మునిగిపోతున్న తన స్నేహితుడిని కాపాడే క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన లక్ష్మీరెడ్డి (22)గా గుర్తించారు.

కడప జిల్లా బి.కోడూరు మండలం మరాటిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి, గుజరాత్‌లోని వడోదరలో ఉన్న పారుల్ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాడు. శనివారం సమీపంలోని నది వద్దకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. లక్ష్మీరెడ్డితో పాటు ఉన్న స్నేహితుడు నదిలో ఈతకు దిగి ప్రమాదవశాత్తు మునిగిపోతుండటాన్ని గమనించాడు.

దోపిడీ రూపం మారింది.. సారంలో కాదు!



డిజిటల్ భూస్వాములు.. క్లౌడ్ పాలేర్లు!' శీర్షికతో నవంబర్ 10న ఎం.కె.కుమార్ రాసిన వ్యాసంలో ఆయన చెప్పిన విషయాలు భూస్వాములకూ, పాలేర్లకూ సంబంధించినవి కావు. ఆన్లైన్‌లో వర్తకం చేసే పెట్టుబడిదారులను 'డిజిటల్ భూస్వాములు' అనీ, వినియోగదారులను 'క్లౌడ్ పాలేర్లు' అనీ ఒక సంస్కరణవాద ఆర్థికవేత్త ప్రతిపాదించిన పదాలను పొరపాటుగా ఉపయోగించారు. అందువల్లనే, ఇప్పుడున్నది 'కొత్త దోపిడీ వ్యవస్థ' అని, 'అస్థిరమైన కొత్త కార్మికవర్గం ఆవిర్భవించింది' అనీ కొన్ని పొరపాటు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.ఏ వస్తువు కొనాలి? అన్న స్వేచ్ఛ కొనుగోలుదారులకు గతంలో ఉండేదనీ, ఆన్లైన్ వ్యాపారం వచ్చాక ఆ స్వేచ్ఛపోయిందన్నారు వ్యాసకర్త. అది కరెక్టు కాదు. అప్పుడైనా ఇప్పుడైనా ఏ వస్తువు కొనాలనే స్వేచ్ఛ కొనుగోలుదారులకు లేదు. పెట్టుబడిదారులు ఏ సరుకులు తయారు చేయిస్తారో, ఏ సరుకుల గురించి ప్రకటనలు విరివిగా ఇస్తారో, దానికి లోబడే కొనుగోళ్లు జరుగుతాయి. కాకపోతే, అప్పుడు షాపులకు వెళ్లి కొనుక్కోవడం ఉండేది, ఇప్పుడు ఆన్లైన్‌లో కొనుక్కునే పద్ధతి కూడా వచ్చింది. 'ఇప్పుడున్నది సంప్రదాయ పెట్టుబడి కాదు, అది క్లౌడ్ క్యాపిటల్' అన్నారు వ్యాసకర్త. ఈ 'క్లౌడ్ క్యాపిటల్' అనేది, సరుకుల్ని తయారు చేయించడానికి పెట్టే 'పారిశ్రామిక' పెట్టుబడి కాదు. 'పెట్టుబడి' గ్రంథంలో మార్క్సు ప్రస్తావించిన 'వర్తక పెట్టుబడి' తప్ప, వేరుకాదు. వర్తక లావాదేవీలు షాపుల్లో జరుగుతున్నాయా, ఆన్లైన్‌లో జరుగుతున్నాయా అన్నదే తేడా. కుమార్ ప్రస్తావించిన కంపెనీలన్నీ వర్తక పెట్టుబడిదారీ కంపెనీలే. ఆన్లైన్‌లో వర్తకం చేసే కంపెనీల యజమానుల్ని 'డిజిటల్ భూస్వాములు' అనకూడదు. 'డిజిటల్ వర్తక పెట్టుబడిదారులు' అనాలి. ఆ కంపెనీలు 3040శాతం కమీషన్ లాక్కుంటాయన్నారు. అవును మరి, పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలో అది సహజం. సరుకులు తయారు చేయించిన పారిశ్రామిక పెట్టుబడిదారులు, తమ సరుకుల్ని తామే అమ్ముకునే ఏర్పాటు లేనప్పుడు, ఆ సరుకుల్ని అమ్మిపెట్టమని వర్తక పెట్టుబడిదారులకు ఇస్తారు. ఆ వర్తక పెట్టుబడిదారీ కంపెనీలు ఆ సరుకుల్ని వాటి పూర్తి విలువలకే అమ్మి, అలా అమ్మినందుకు కమీషన్ మినహాయించుకుని, మిగతాది సరుకు యజమానులకు ఇస్తాయి. ఇది పెట్టుబడిదారీ విధానం పుట్టినప్పటినించీ ఉన్నదే. తేడా ఏమంటే ఆన్లైన్ అనే కొత్త రూపమే. ఇంకా, వర్తక కమీషన్ అనేది 'మధ్యయుగాల నాటి భూస్వామి రైతుల నుంచి వసూలు చేసే శిస్తు లాంటిదే' అని కుమార్ పొరపాటుపడ్డారు. ఏ శ్రమా చేయకుండా కౌలురైతుల నుంచి భూస్వామి లాగేది 'శిస్తు' కాదు. భూమి కౌలు. భూమి యజమాని ప్రభుత్వానికి చెల్లించే దానిని 'శిస్తు' అంటారు. అమెజాన్ వంటి ఆన్లైన్ వర్తక కంపెనీలకు చిన్న స్థాయి సరుకు పెట్టుబడిదారులు చెల్లించేది సామంతులు చెల్లించే కప్పం లాంటిది అని కుమార్ చాలా పొరపాటుగా పోల్చారు. అది 'వర్తక కమీషన్'. కుమార్ తెచ్చిన ఇంకో పెద్ద తప్పు పోలిక ఏమిటంటే, కోట్లాదిమంది వినియోగదారులను 'క్లౌడ్ పాలేర్లు' అనడం. ఇంటర్నెట్ ముందు ఎన్ని వేల గంటలు గడిపినా, ఎన్ని వేల వీడియోలు చూసినా, ఏ సరుకూ తయారుకాదు. సరుకు తయారీకి కొన్ని ఉత్పత్తి సాధనాలూ, కొంత శ్రమా కావాలి. వినియోగదారులు ఏ సాధనాలతో, ఏ శ్రమ చేసి, ఏ సరుకును తయారుచేస్తున్నట్టు? ఇలా భావించడం అంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి సంబంధించి, మార్క్సు చెప్పినదానిని సరిగా గ్రహించలేదని అర్థం. పెట్టుబడిదారుల రాబడి రేటు పెరగడాన్ని అర్థం చేసుకోవడానికి, కుమార్ ఇచ్చిన ఉదాహరణ పూర్తిగా తప్పు. ఒక కంపెనీ యజమానికి, స్టాక్ మార్కెట్లో తన కంపెనీ షేర్ల విలువ పెరగడం వల్ల వచ్చిన డబ్బు తన దగ్గర పనిచేసే కార్మికుల నుంచి సంపాదించిన అదనపు విలువ కాదు. అది షేర్లు కొన్నవారి డబ్బు. దానిని మార్క్సు 'కల్పిత పెట్టుబడి' అన్నాడు. ఆ కంపెనీ యజమాని, ఆ కల్పిత పెట్టుబడిని, కొత్త ఉత్పత్తి కార్యంలో పెడితే, దాని ద్వారా కొత్త అదనపు విలువను సంపాదించవచ్చును. అది వేరే సంగతి. "ఇంతటి బహిరంగ దోపిడీ జరుగుతున్నప్పుడు ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి?" అని ఒక అమాయకపు ప్రశ్న వేశారు కుమార్. జవాబు చాలా సింపుల్. ఇవి పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలను రక్షించే ప్రభుత్వాలు గనక! ఒక ఆర్థికవేత్త చేసిన విశ్లేషణను ప్రస్తావించి, 'నేటి సమాజంలో కొత్త వర్గం పుట్టుకొచ్చిందని' కుమార్ అమాయకంగా చెపుతున్నారు. ఉద్యోగ భద్రత లేని స్థితి వల్ల నిరంతరం ఏర్పడుతున్న నిరుద్యోగుల్నీ, పార్ట టైం ఉద్యోగుల్నీ, ఇంకా అలాంటివారిని ఉదాహరణలుగా చూపారు. ఇది 'కొత్త వర్గం' కానేకాదు. పెట్టుబడిదారీ విధానం ఎప్పటికప్పుడు, కార్మికులలో ఒక భాగాన్ని నిరుద్యోగంలోనో, చిరుద్యోగంలోనో ఉంచుతుందనీ, వారిని 'అదనపు జనాభా'గా పెట్టుబడిదారులు భావిస్తారనీ మార్క్సు ఏనాడో చెప్పాడు. వాళ్లకే, ఈనాటి కొత్త ఆర్థికవేత్తలు కొత్త పేర్లు పెడతారు. వ్యాసకర్త భావిస్తున్నట్టు, ఇప్పుడున్నది 'కొత్త దోపిడీ వ్యవస్థ' కాదు. దాని రూపమే మారింది తప్ప, సారం ఏమీ మారలేదు. దాన్ని సమూలంగా మార్చడానికి, మార్క్సు చూపిన మార్గాన్ని మించి, "కొత్త తరహా పోరాటమార్గం" ఏదీ లేదు.

కిసాన్ వికాస్ పత్ర ముందస్తు ఉపసంహరణపై ఇండియా పోస్ట్ క్లారిటీ

కేవీపీలో 30 నెలల తర్వాత ముందస్తు ఉపసంహరణకు అనుమతి
30 నెలల లోపు ప్రత్యేక పరిస్థితుల్లోనే డబ్బులు తీసుకునే అవకాశం
అర్హత కలిగిన విత్‌డ్రాయల్స్‌పై ప్రత్యేక పెనాల్టీ ఉండదు
కేవీపీ పెట్టుబడులకు సెక్షన్ 80సీ పన్ను మినహాయింపు వర్తించదు
నిబంధనల ప్రకారం రూ.1000 పెట్టుబడికి 30 నెలల తర్వాత రూ.1173 చెల్లింపు



తపాలా శాఖ (పోస్టల్ డిపార్ట్‌మెంట్) ఆధ్వర్యంలో అమలవుతున్న చిన్న పొదుపు పథకాల్లో ఒకటైన కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ)లో పెట్టుబడి పెట్టే వారికి ముందస్తు నగదు ఉపసంహరణపై స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. మెచ్యూరిటీ కంటే ముందే డబ్బులు వెనక్కి తీసుకోవాలనుకుంటే ఖాతా తెరిచిన నాటి నుంచి కనీసం 30 నెలలు (రెండున్నరేళ్లు) పూర్తి కావాల్సి ఉంటుంది. ఇండియా పోస్ట్ కేవీపీ పథకం నిబంధనల ప్రకారం.. ఖాతా ప్రారంభించిన 30 నెలల లోపు సాధారణ పరిస్థితుల్లో నగదును వెనక్కి తీసుకునేందుకు అనుమతి ఉండదు. అయితే, ఖాతాదారుడు మరణించినప్పుడు లేదా న్యాయస్థానం ఆదేశాలు ఉన్నటువంటి ప్రత్యేక, అత్యవసర సందర్భాలలో మాత్రమే 30 నెలల కంటే ముందే ఖాతాను క్లోజ్ చేసే వెసులుబాటు ఉంటుంది.లాకిన్ పీరియడ్ అయిన 30 నెలల గడువు దాటిన తర్వాత నిబంధనల ప్రకారం ఖాతాను ముందే రద్దు చేసుకుంటే ఎలాంటి ప్రత్యేక పెనాల్టీ వర్తించదు. కాకపోతే పూర్తి మెచ్యూరిటీ వరకు ఉంచినప్పుడు వచ్చే రాబడి కంటే ముందుగా తీసుకున్నప్పుడు లభించే వడ్డీ మొత్తం తక్కువగా ఉంటుంది. ఉదాహరణకు, అధికారిక నిబంధనల ప్రకారం రూ.1,000 పెట్టుబడి పెట్టిన సర్టిఫికెట్‌పై 30 నెలల తర్వాత ఉపసంహరించుకుంటే రూ.1,173 మాత్రమే లభిస్తుంది. అదే పూర్తి మెచ్యూరిటీ కాలం వరకు ఉంచితే మొత్తం సొమ్ము రెట్టింపు అవుతుంది. చాలామంది కేవీపీ పథకానికి పన్ను మినహాయింపులు లభిస్తాయని భావిస్తుంటారు. అయితే ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఈ పథకంలో పెట్టే పెట్టుబడులకు ఎలాంటి పన్ను మినహాయింపు ఉండదు. పెట్టుబడిదారులు ఈ ముఖ్యమైన నిబంధనలు, రాబడి లెక్కలను ముందుగానే పరిశీలించి నిర్ణయం తీసుకోవడం మంచిది.

బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు.





నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు

నమోదు చేసి స్టాక్ సీజ్ చేస్తాం.

ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట ధరలకే బియ్యం

విక్రయించాలి. నిల్వల పరిమితులు

తప్పనిసరిగా పాటించాలి.

సోమవారం నుంచి జిల్లాలోని ప్రతి

మండలంలో ధరణి బియ్యం విక్రయ కేంద్రాలు

కిలో రూ.49కే నాణ్యమైన బియ్యం పంపిణీ

ఇంచార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ

భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 21 నంది పత్రిక

బహిరంగ మార్కెట్లో బియ్యం ధరల పెరుగుదలను అరికట్టి, సామాన్య ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ఇంచార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ తెలిపారు.శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు. బియ్యం ధరల నియంత్రణ, నిల్వల పరిమితులు, ధరణి బియ్యం విక్రయ కేంద్రాల నిర్వహణపై ఇంచార్జి జిల్లా కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు ఇష్టానుసారంగా పెంచి విక్రయించకుండా ప్రభుత్వం నిర్దిష్ట గరిష్ట చిల్లర ధరలను నిర్ణయించిందన్నారు. డి-మార్ట్, రిలయన్స్, విజేత వంటి పెద్ద రిటైల్ సంస్థలతో పాటు జిల్లాలోని అన్ని హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని స్పష్టం చేశారు. వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేయడం, కృత్రిమ కొరత సృష్టించడం, అక్రమంగా బియ్యం నిల్వ చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట బియ్యం ధరలు బియ్యం రకాలను బట్టి ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరల వివరాలు కిలోకు ఈ విధంగా ఉన్నాయి.

1. బిపిటి 3291 (సోనా), బిపిటి 5204 (సాంబ) రకం రూ.66/- లు 2. హెచ్.యంటి, ఆర్. ఎన్. ఆర్ రకం రూ.76/-లు,

3. జై శ్రీరామ్ రకం రూ.82/-లు

4. యం.టి.యు కామన్ రకం రూ.47/-లు

ఈ ధరల వివరాలను అన్ని వ్యాపార సంస్థల్లో ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని పేర్కొన్నారు. నిర్ణీత ధరలకు మించి విక్రయాలు జరగకుండా విజిలెన్స్, యం ఆర్ ఓ లు, సంబంధిత అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.బియ్యం నిల్వలపై ప్రత్యేక నిఘా, స్టాక్ పరిమితులు తప్పనిసరి.అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతను అరికట్టేందుకు ప్రభుత్వం వ్యాపార కేంద్రాల వారీగా స్టాక్ పరిమితులను నిర్దేశించిందని తెలిపారు.ట్రేడింగ్ రైస్ మిల్లులు: సి యం ఆర్, ప్రభుత్వ నిల్వలకు మినహాయింపునిస్తూ అన్ని ప్రాంతాల్లో 4,000 క్వింటాళ్లు లేదా ఏడు రోజుల మిల్లింగ్ సామర్థ్యం, ఈ రెండింటిలో ఏది ఎక్కువైతే ఆ పరిమితి మేరకు నిల్వలు ఉంచుకోవచ్చు అని తెలిపారు.

హోల్‌సేలర్లు:

కార్పొరేషన్ పరిధిలో 1,000 క్వింటాళ్లు.

ఇతర జిల్లా కేంద్రాల్లో 500 క్వింటాళ్లు.

మిగిలిన ప్రాంతాల్లో 250 క్వింటాళ్లు.

లిలిరిటైలెర్లు:

పట్టణ ప్రాంతాల్లో 100 క్వింటాళ్లు.

గ్రామీణ ప్రాంతాల్లో 50 క్వింటాళ్లు.

నిర్దేశించిన స్టాక్ పరిమితులకు మించి బియ్యం నిల్వలు ఉంచకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యాపారులు తమ వద్ద ఉన్న బియ్యం నిల్వల వివరాలను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు, సరుకు సీజ్

బియ్యం ధరలు, నిల్వల విషయంలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను ప్రతి వ్యాపారి తప్పనిసరిగా పాటించాలన్నారు. నిర్ణీత ధరల కంటే అధిక ధరలకు విక్రయించినా, అనుమతించిన పరిమితులకు మించి అక్రమ నిల్వలు ఉంచినా, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉల్లంఘనలకు పాల్పడిన వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు అక్రమంగా నిల్వ ఉంచిన సరుకును సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.ఆర్డీవోలు, తహసీల్దార్లు, పౌర సరఫరాల శాఖ అధికారులు సమన్వయంతో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి హోల్‌సేల్, రిటైల్ దుకాణాలు, రైస్ మిల్లులను తనిఖీ చేయాలని సూచించారు. ఎక్కడైనా అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లు లేదా అక్రమ నిల్వలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రతి మండలంలో ధరణి బియ్యం కౌంటర్లు, కిలో రూ.49కే నాణ్యమైన బియ్యం.

సామాన్య ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకే అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ధరణి బియ్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు.

జిల్లాలో గత నెల నుంచి మూడు రైతుబజార్లలో ధరణి బియ్యం కౌంటర్లను నిర్వహిస్తున్నామని, బహిరంగ మార్కెట్లో కిలో రూ.66 ధర పలికే నాణ్యమైన బియ్యాన్ని ఈ కేంద్రాల ద్వారా కేవలం రూ.49కే ప్రజలకు అందిస్తున్నామని వివరించారు. ఈ కేంద్రాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు.ప్రజలకు మరింత చేరువగా ఈ సేవలను విస్తరించేందుకు వచ్చే సోమవారం నుంచి జిల్లాలోని ప్రతి మండలంలో అనువైనచోట ధరణి బియ్యం విక్రయ కౌంటర్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతి మండలంలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి, సరిపడా బియ్యం నిల్వలు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ప్రజలు తమ ఆధార్ నంబర్ ఆధారంగా ఒక్కొక్కరు ఒకేసారి గరిష్టంగా 26 కిలోల నాణ్యమైన బియ్యాన్ని కిలో రూ.49 చొప్పున కొనుగోలు చేయవచ్చని తెలిపారు. అర్హులైన ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలకు సరసమైన ధరలకు బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలను నియంత్రించడంతో పాటు, ప్రభుత్వ ఆధ్వర్యంలో తక్కువ ధరకు నాణ్యమైన బియ్యాన్ని అందించడం ద్వారా సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనలో రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లాలో బియ్యం ధరల నియంత్రణ, నిల్వల పర్యవేక్షణ, ధరణి బియ్యం కౌంటర్ల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వ మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని పేర్కొన్నారు

తోలుత మురుసు తుఫాను ప్రభావానికి గురైన జిల్లాలో ని 21,228 మంది బాధిత కుటుంబాలకు చౌక ధరల దుకాణాల ద్వారా నిత్యవసర సరుకులు అయిన బియ్యం, నూనె, పంచదార, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంప పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు తెలిపారు. జిల్లాలో ని ఆర్డీవోలు, తహసిల్దార్లు సక్రమంగా పంపిణీ అయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు..

ఆత్మకథ కాదు.. ఓ కట్టుకథ

రాజకీయ నాయకుల ఆత్మకథలు కేవలం వారి వ్యక్తిగత జీవిత విశేషాలకు దర్పణం పట్టాలి. కానీ, భారతదేశాన్ని దశాబ్దాల పాటు ఏలిన ఓ కుటుంబం నుంచి, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అత్యున్నత పీఠాన్ని సుదీర్ఘకాలం అధిష్ఠించిన సోనియాగాంధీ తన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'ను ఒక జ్ఞాపకాల పుస్తకంలా కాకుండా, చరిత్రను తమ కుటుంబానికి అనుకూలంగా మలుచుకునే మరో రాజకీయ ప్రచార అస్త్రంగా మార్చుకున్నారు. తామేదో దేశం కోసం సర్వస్వాన్ని త్యాగం చేశామని, దేశం మొత్తం తమ కుటుంబానికి రుణపడి ఉండాలనే ఒక రకమైన ఫ్యూడల్ భావజాలాన్ని మరోసారి సమాజంపై రుద్దే ప్రయత్నం ఈ పుస్తకం ద్వారా జరుగుతోంది.2004లో ప్రధానమంత్రి పదవిని త్యాగం చేశానంటూ సోనియా చెప్పుకునే కథనంలో ఏ మాత్రం వాస్తవం లేదు. సుబ్రహ్మణ్యస్వామి గతంలోనే ఈ విషయంపై బలమైన ఆధారాలను దేశం ముందుంచారు. ఆయన వాదన ప్రకారం, సోనియా స్వచ్ఛందంగా ప్రధాని పదవిని తిరస్కరించలేదు. ఆయన దాఖలు చేసిన పిటిషన్, లేవనెత్తిన అభ్యంతరాలతో అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆమెను ప్రధానమంత్రిగా ప్రమాణం చేసేందుకు ఆహ్వానించడానికి న్యాయపరంగా అడ్డుకున్నారు. భారత పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం సోనియాగాంధీ ప్రధాని పదవిని చేపట్టడానికి అర్హులు కారని 2004 మే 3న స్వామి స్పష్టం చేశారు. అనంతరం 2004 మే 15న రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు లేఖ రాసి ఈ రాజ్యాంగపరమైన అభ్యంతరాలను వివరించారు. అంతేకాకుండా, 2004 మే 17 మధ్యాహ్నం 3:30 గంటలకు సోనియాగాంధీకి కలాం పంపిన లేఖను బయటపెట్టాలని 2012లో స్వామి డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి పదవిని చేపట్టే విషయంలో చట్టపరమైన ఇబ్బందులు ఉండవచ్చని సోనియాకు రాసిన ఆ లేఖలో రాష్ట్రపతి సూచించినందువల్ల ఆమె వెనక్కితగ్గారే తప్ప, అది త్యాగం కాదని స్పష్టమవుతోంది. సోనియాగాంధీ తన పుస్తకంలో ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాస్తవ చరిత్రను ఎలా వక్రీకరించారో చెప్పడానికి మల్లికార్జున్ ఖర్గే కుటుంబ విషాదంపై ఆమె రాసిన రాతలే నిలువెత్తు నిదర్శనం. ఈ పుస్తకంలోని 484వ పేజీలో ఖర్గే కుటుంబం ఎదుర్కొన్న భీకర ఘటనను కుల ఘర్షణలు అనే పదాలతో సోనియా వివరించారు. వాస్తవానికి, 2026 జూన్‌లో రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ నిర్వహించిన దిల్ సే కార్యక్రమంలో మల్లికార్జున్ ఖర్గే స్వయంగా తన బాల్య విషాదాన్ని కన్నీటితో వివరించారు. 1948లో నిజాం పాలనలోని రజాకార్లు గుర్రాలపై వచ్చి తమ గ్రామంపై దాడి చేసి, ఇళ్లకు నిప్పు పెట్టారని, ఆ మారణహోమంలో తన తల్లి, సోదరి ప్రాణాలు కోల్పోయారని ఖర్గే స్పష్టంగా చెప్పారు. స్వయంగా బాధితుడే రజాకార్ల దాడి అని చెప్పినప్పటికీ, మైనారిటీ ఓటు బ్యాంకు దూరమవుతుందనే భయంతో ముస్లిం రజాకార్లు అనే పదాన్ని వాడలేక, సోనియాగాంధీ దాన్ని కుల ఘర్షణలుగా మార్చిరాయడం చరిత్రకు చేసిన తీరని ద్రోహం కాదా? 1975 ఎమర్జెన్సీ, 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు, బాబ్రీ మసీదు, బోఫోర్స్ కుంభకోణం వంటి దేశాన్ని కుదిపేసిన కీలక ఘటనల్లో నెహ్రూగాంధీ కుటుంబం, కాంగ్రెస్ పార్టీ బాధ్యతలను తగ్గించిచూపే ప్రయత్నం ఈ పుస్తకంలో స్పష్టంగా కనిపిస్తోంది. ఎమర్జెన్సీ వల్ల దేశంలో ప్రజాస్వామ్య హక్కులకు, పౌర స్వేచ్ఛకు జరిగిన అపారనష్టం కంటే, అప్పట్లో ఇందిరాగాంధీ ఎదుర్కొన్న రాజకీయ ఒత్తిడికే సోనియా ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే ఇందిరాగాంధీ హత్య అనంతరం జరిగిన 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల తీవ్రతను కూడా తక్కువచేసి చూపారు. అంతేకాకుండా, నేటి కాంగ్రెస్ దుస్థితికి కారణమైన రాహుల్‌గాంధీ రాజకీయ వైఫల్యాల గురించి ఉద్దేశపూర్వకంగానే మౌనం వహించారు. ఇక అప్పటి ప్రధాని పీవీ నరసింహారావుతో గాంధీ కుటుంబం వ్యవహరించిన తీరు భారత రాజకీయ చరిత్రలోనే అత్యంత చీకటి అధ్యాయం. పీవీతో ఎలాంటి విభేదాలూ లేవని సోనియా తన ఆత్మకథలో పేర్కొన్నది పచ్చి అబద్ధం. పీవీ పార్టీ పగ్గాలు చేపట్టిన తర్వాత, పదవి నుంచి దిగిపోయిన తర్వాత ఆ కుటుంబం ఆయనను ఏ విధంగా వేధించిందో దేశం చూసింది. ప్రముఖ రచయిత వినయ్ సీతాపతి రచించిన 'హాఫ్ లయన్' పుస్తకం చదివితే, పీవీ పట్ల కాంగ్రెస్ హైకమాండ్, గాంధీ కుటుంబం ప్రదర్శించిన కక్షపూరిత వైఖరి అర్థమవుతుంది. దేశ ప్రధానిగా ఉండి కూడా పార్టీలో ఎదురైన అంతర్గత కుట్రలను, ప్రతిక్షణం ఎదురైన మానసిక క్షోభను పీవీ ఏ విధంగా మౌనంగా భరించాల్సి వచ్చిందో ఆ పుస్తకం కళ్లకు కట్టింది. పార్టీ ఓటమికి నరసింహారావును బాధ్యుడిని చేస్తూ, ఆయనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిన తీరు ఆ కుటుంబపు అహంకార ధోరణికి నిదర్శనం. పీవీ మరణానంతరం ఆయన మృతదేహాన్ని ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలోకి కూడా రానివ్వకుండా గేట్లు మూయించిన అవమానకర చరిత్ర దేనికి సంకేతం? దేశానికి దశాబ్దాల పాటు సేవ చేసి, ప్రధానమంత్రిగా, పార్టీ అధ్యక్షుడిగా అసాధారణ సేవలందించిన ఒక మహా నాయకుడి భౌతికకాయానికి దక్కాల్సిన కనీస మర్యాదను కూడా రాజకీయ కక్షల కారణంగా నిరాకరించడం ఎంతవరకు సమంజసం? కాంగ్రెస్ పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ఈ కుటుంబం ఏ స్థాయిలో ఖూనీ చేసిందో చెప్పడానికి సీతారాం కేసరి ఉదంతం ఒక నిలువెత్తు సాక్ష్యం. పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించిన ఒక సీనియర్ దళిత నాయకుడిని అకస్మాత్తుగా అర్ధరాత్రి ఎమర్జెన్సీ తరహా వాతావరణంలో ఏఐసీసీ కార్యాలయం నుంచి బయటకు గెంటేయించిన ఘటన భారత రాజకీయ చరిత్రలోనే ఒక చీకటి అధ్యాయం. ఇక డాక్టర్ మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో దేశాన్ని తెరవెనుక నుంచి ఎవరు నడిపించారనేది జగద్విదితం. ప్రముఖ జర్నలిస్ట్ సంజయ్‌బారు రాసిన సంచలన పుస్తకం 'ది యాక్సిడెంటల్ ప్రైమ్‌మిస్టర్' ఈ నిజాన్ని కుండబద్దలు కొట్టింది. మన్మోహన్‌సింగ్‌ను ఒక రిమోట్ ప్రధానిగా మార్చి, అసలు అధికార కేంద్రం అంతా '10 జన్‌పథ్' చేతిలోనే ఉండేలా చక్రం తిప్పిన వైనాన్ని ఆ పుస్తకం ఆధారాలతో సహా వివరించింది. దేశ ప్రధాని కార్యాలయం కంటే నేషనల్ అడ్వైజరీ కౌన్సిలే ఎక్కువ అధికారాలు చలాయించేలా వ్యవస్థలను అడ్డుపెట్టుకుని, రాజ్యాంగేతర శక్తిగా సోనియాగాంధీ వ్యవహరించిన చరిత్ర అందరికీ తెలిసిందే. అంతేకాదు, ఎన్నో చారిత్రక వాస్తవాలకు మసిపూరి మారేడుకాయ చేశారు. తొమ్మిది మంది హిందూ కరసేవకులు సజీవ దహనమైన గోద్రా రైలు దహన ఘటనలో 33 మందిని న్యాయస్థానం దోషులుగా నిర్ధారించింది. అలాంటప్పుడు ఈ ఘటనకు కారణం ఇంకా 'వివాదాస్పదం' అని ఎలా అంటారు?

నేడు కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ఉనికిని పూర్తిగా కోల్పోయింది. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనకు ప్రజలు పట్టం కడుతున్నారు. వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతున్న కాంగ్రెస్ పార్టీకి మళ్లీ కృత్రిమ ప్రాణం పోసేందుకు సోనియా ఈ పుస్తకాన్ని ఒక రాజకీయ అస్త్రంగా తెరపైకి తెచ్చారు. వ్యక్తి పూజలను, వంశపారంపర్య రాజకీయాలను ప్రజలు ఎప్పుడో తిరస్కరించారు కాబట్టి, ఎంతటి ప్రచార ఆర్భాటాలు చేసినా పతనమవుతున్న కాంగ్రెస్ పాతాళంలోకి పడిపోవడాన్ని ఆపడం ఏ శక్తివల్లా సాధ్యం కాదు.

గోదావరి పుష్కరాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి





ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 21 నంది పత్రిక

2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు సుమారు 10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రస్థాయి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో పుష్కరాల ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.పుష్కరాల నిర్వహణ కోసం 22 శాఖల పరిధిలో రూ.3,723.69 కోట్ల అంచనా వ్యయంతో 4,862 పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా, ఇప్పటివరకు రూ.2,051.70 కోట్ల విలువైన 2,260 పనులకు పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలని, స్వచ్ఛంద సంస్థలు, యువత, మహిళా సంఘాల సహకారం తీసుకోవాలని సీఎం సూచించారు. అన్ని శాఖలు జిల్లాల వారీగా పనుల పురోగతి, నిధుల వినియోగ వివరాలను ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేయాలని, పుష్కరాల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఇప్పటి నుంచే శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.గోదావరి పరివాహక ప్రాంతంలోని 440 ఘాట్ల వద్ద భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాగునీరు, పారిశుధ్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, లైటింగ్, వసతి, పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ రహదారులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక బస్సులు, రైల్వే సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.పుష్కరాల నిర్వహణను పర్యవేక్షించేందుకు ఆధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని, దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులకు సమాచారం అందించేందుకు 135 భాషల్లో సేవలందించే కృత్రిమ మేధ ఆధారిత చాట్‌బాట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, వైద్య బృందాలు, అదనపు ఆసుపత్రి పడకల ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పుష్కరాలకు ముందే సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ఆధునికీకరణ పనులు, పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, రాజమహేంద్రవరంపోలవరం మధ్య జలమార్గంలో ఫ్లోటింగ్ పంటూన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, గోదావరి జలాల నాణ్యతను పరిరక్షిస్తూ పర్యావరణహితంగా పుష్కరాలను నిర్వహించాలని, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను కూడా ఘనంగా చేపట్టాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ సంబంధిత శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లు, శాఖల వారీగా చేపట్టాల్సిన పనులపై అధికారులతో కలిసి సమీక్షలో పాల్గొన్నారు.



శాండ్‌పేపర్ వివాదం.. ఆ చీకటి రోజుల్లోకి మళ్లీ వెళ్లలేను: డారెన్ లీమన్


ఆస్ట్రేలియా క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా అప్రతిష్ఠపాలు చేసిన 2018 నాటి శాండ్‌పేపర్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ కుట్ర గురించి తనకు ముందే తెలుసంటూ వస్తున్న ఆరోపణలను ఆస్ట్రేలియా మాజీ కోచ్ డారెన్ లీమన్ మరోసారి తీవ్రంగా ఖండించాడు. ఆ ఘటన తర్వాత తాను మానసికంగా తీవ్రంగా కుంగిపోయానని, మళ్లీ ఆ చీకటి రోజుల్లోకి వెళ్లాలనుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

2018లో దక్షిణాఫ్రికా పర్యటనలో ఆస్ట్రేలియా జట్టు బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడిన సంగతి తెలిసిందే. ఇటీవల ఆటగాళ్లు ఉస్మాన్ ఖవాజా, కామెరాన్ బ్యాన్‌క్రాఫ్ట్ చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం మళ్లీ వార్తల్లోకెక్కింది. బ్యాన్‌క్రాఫ్ట్ తన కథనంలో, బంతిని ఎలా రఫ్ చేయాలనే చర్చ డ్రెస్సింగ్ రూమ్‌లో జరిగిందని, ఆ సమయంలో కోచ్ డారెన్ లీమన్, బౌలింగ్ కోచ్ డేవిడ్ సేకర్ కూడా అక్కడే ఉన్నారని పేర్కొన్నాడు. డేవిడ్ వార్నర్ శాండ్‌పేపర్ వాడాలనే ఆలోచనను ముందుకు తెచ్చాడని కూడా రాశాడు.ఈ ఆరోపణలపై ఏబీసీ రేడియోతో మాట్లాడిన లీమన్ స్పందించాడు. “2018 నాటి ఘటనపై నా అభిప్రాయం ఇప్పటికీ మారలేదు. అది ఒక చీకటి సమయం, మేము చాలా తప్పులు చేశాం. కానీ, నా వాదన మాత్రం అదే. ఆ కుట్ర గురించి నాకు ముందుగా తెలియదు“ అని స్పష్టం చేశాడు.

బ్యాన్‌క్రాఫ్ట్ చెప్పినట్టుగా ఆ చర్చ జరిగినప్పుడు తాను అక్కడ ఉన్నట్లు తనకు గుర్తులేదని లీమన్ తెలిపాడు. “ఆ సంభాషణ జరిగినప్పుడు నేను అక్కడ ఉన్నట్లు నాకు గుర్తులేదు. అయినా అది జరిగి ఎనిమిదిన్నర సంవత్సరాలు అవుతోంది. నా వెర్షన్ ఇదే, దానికే కట్టుబడి ఉంటాను“ అని అన్నాడు. ఆ ఘటన తర్వాత కోచ్ పదవికి రాజీనామా చేసిన లీమన్, ఆ వైఫల్యానికి బాధ్యత వహించాడు. “రివర్స్ స్వింగ్ కోసం బంతిని నేలకేసి కొట్టడం, ఒకవైపు రఫ్ చేయడం వందేళ్లుగా జరుగుతోంది. కానీ 2018లో అది హద్దులు దాటింది. కోచ్‌గా దానికి నేనే బాధ్యుడిని. ఆ ఘటన వల్ల నేను ఏమీ నష్టపోలేదని కొందరు అంటున్నారు. కానీ, నేను క్రికెట్ ప్రపంచంలోనే అత్యుత్తమ ఉద్యోగాన్ని కోల్పోయాను. అందుకు నేను చింతిస్తున్నాను. ప్రజలకు క్షమాపణలు చెబుతున్నాను“ అని లీమన్ ఆవేదనగా మాట్లాడాడు.

బిజినెస్

పాతాళానికి అమెరికా స్టాక్ మార్కెట్లు.. ఏఐ నష్టాల వేళ వెలుగు చూసిన భారత బలం!



కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో భారీ పెట్టుబడులకు తగిన రాబడులు రావట్లేదన్న ఆందోళనలతో అమెరికా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. ప్రధానంగా టెక్ షేర్లలో వెల్లువెత్తిన అమ్మకాలతో నాస్‌డాక్ 100 సూచీ భారీగా పతనమైంది. మార్చి 2020లో కరోనా మహమ్మారి సమయంలో నమోదైన పతనం తర్వాత, మళ్లీ ఆ స్థాయి నష్టాలను ఈ వారంలో చవిచూసింది. దశాబ్దాలుగా వాల్‌స్ట్రీట్‌లో కొనసాగుతున్న పెట్టుబడుల జోరు క్రమంగా తగ్గుతోందన్న భయాలు మదుపర్లను కలవరపె డుతున్నాయి. దీంతో రిస్క్ తీసుకోలేని ఇన్వెస్టర్లు సురక్షితమైన ప్రభుత్వ బాండ్లు, కరెన్సీల వైపు పరుగులు తీస్తున్నారు. శుక్రవారం నాటి ట్రేడింగ్‌లో ఎస్ అండ్ పీ 500 సూచీ 3.7 శాతం పడిపోయి వరుసగా ఏడో రోజు నష్టాలను నమోదు చేసింది. దీంతో ఈ సూచీ కరెక్షన్ పరిధిలోకి ప్రవేశించింది. నాస్‌డాక్ 100 సూచీ ఏకంగా 5.6 శాతం మేర కుదేలైంది. సెమీకం డక్టర్లు, ఏఐ అనుబంధ షేర్లలో తీవ్ర అమ్మకాల ఒత్తిడి కనిపించింది. దిగ్గజ చిప్‌మేకర్ ఎన్విడియా అకౌంటింగ్ వ్యవహారాలపై అమెరికా నియంత్రణ సంస్థలు దర్యాప్తు చేస్తున్నాయన్న వార్తలతో ఆ కంపెనీ షేరు విలువ 14 శాతం పడిపోయింది. కొత్తగా లిస్టయిన ఆంథ్రోపిక్ పీబీసీ షేరు కూడా 8 శాతం క్షీణించి ఆరంభ లాభాలను కోల్పోయింది. ఈ అమ్మకాల తుపాను క్రిప్టోకరెన్సీలు, లోహాలు, వర్ధమాన మార్కెట్లకూ విస్తరించింది. దీంతో మార్కెట్ తీవ్ర అస్థిరతకు లోనైంది. బిట్‌కాయిన్ 5.1 శాతం తగ్గి 58,333 డాలర్లకు పడిపోగా, ఈథర్ 8 శాతం పతనమై 1,601 డాలర్లకు చేరింది.

మార్కెట్ నుంచి టీవీఎస్ స్టార్ సిటీ ప్లస్ ఔట్.. వెబ్‌సైట్ నుంచి తొలగించిన కంపెనీ!



ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ తమ అధికారిక భారత వెబ్‌సైట్ నుంచి ‘స్టార్ సిటీ ప్లస్’ బైక్‌ను తొలగించింది. దీంతో దాదాపు 12 ఏళ్ల పాటు మార్కెట్లో విజయవంతంగా కొనసాగిన ఈ 110సీసీ కమ్యూటర్ బైక్ ఉత్పత్తిని సంస్థ నిలిపివేసి ఉండవచ్చని సంకేతాలు వెలువడు తున్నాయి. దీనిపై కంపెనీ ఇంకా ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయనప్పటికీ, వెబ్‌సైట్ లైనప్ నుంచి తొలగించడంతో ఈ మోడల్ మార్కెట్ నుంచి శాశ్వతంగా నిష్క్రమించినట్లేనని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. 2014లో తొలిసారిగా మార్కెట్లోకి వచ్చిన టీవీఎస్ స్టార్ సిటీ ప్లస్, బడ్జెట్ విభాగంలో సామాన్యులకు బాగా చేరువైంది. అయితే మార్చి 2021లో రోటో పెటల్ ఫ్రంట్ డిస్క్ బ్రేక్ ఫీచర్ జోడించిన తర్వాత ఈ బైక్‌కు పెద్దగా అప్‌డేట్లు రాలేదు. ఉద్గార నిబంధనల మార్పులు మినహా సాంకేతికంగా ఇతర మార్పులు చేయకపోవడం, మార్కెట్లో తీవ్ర పోటీ నెలకొనడంతో అమ్మకాలు భారీగా పడిపోయాయి. 2026 మొదటి నాలుగు నెలల్లో కేవలం 49 యూనిట్లు మాత్రమే అమ్ముడ య్యాయి. ఆ తర్వాత మే నుంచి సెప్టెంబర్ వరకు ఒక్క బైక్ కూడా అమ్ముడవలేదని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ బైక్‌లో 109.7 సీసీ సింగిల్ సిలిండర్ ఎయిర్ కూల్డ్ ఇంజిన్ ఉండేది. ఇది 8.2 హెచ్‌పీ పవర్, 8.7 ఎన్‌ఎమ్ టార్క్‌ను అందించేది. ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, సెమీ డిజిటల్ కన్సోల్, యూఎస్‌బీ ఛార్జింగ్ పోర్ట్, ట్యూబ్‌లెస్ టైర్ల వంటి మెరుగైన ఫీచర్లు ఉన్నప్పటికీ ఆదరణ కరవైంది. స్టార్ సిటీ ప్లస్ నిష్క్రమణతో టీవీఎస్ బడ్జెట్ లైనప్‌లో ఇప్పుడు కేవలం రేడియాన్, స్పోర్ట్ మోడళ్లు మాత్రమే అందుబాటులో మిగిలాయి.

మూడు రోజులు బ్యాంకులు బంద్.. ఖాతాదారులకు అలర్ట్!



బ్యాంకు ఖాతాదారులకు ముఖ్య గమనిక. వచ్చే వారం (నవంబర్ 22 నుంచి 28 వరకు) బ్యాంకులకు పలు సెలవులు ఉన్నాయి. ముఖ్యమైన పనుల కోసం బ్యాంకులకు వెళ్లాలనుకునే వారు ఈ సెలవుల జాబితాను ముందుగా చూసుకోవడం మంచిది. లేదంటే అనవసరంగా ఇబ్బంది పడాల్సి వస్తుంది. గురునానక్ జయంతి, నాలుగో శనివారం వంటి కారణాలతో దేశంలోని అనేక ప్రాంతాల్లో బ్యాంకులు మూతపడనున్నాయి.

సెలవుల వివరాలు:

నవంబర్ 23 (సోమవారం):

సెంగ్ కుట్ స్నెమ్ సందర్భంగా కేవలం షిల్లాంగ్‌లో మాత్రమే బ్యాంకులకు సెలవు ప్రకటించారు.

నవంబర్ 24 (మంగళవారం):

గురునానక్ జయంతి, కార్తీక పౌర్ణమి సందర్భంగా హైదరాబాద్, న్యూఢిల్లీ, ముంబై, కోల్‌కతా, భోపాల్, చండీగఢ్, జైపూర్, కాన్పూర్, లక్నో సహా పలు ప్రధాన నగరాల్లో బ్యాంకులు పనిచేయవు.

నవంబర్ 27 (శుక్రవారం):

కనకదాస జయంతి సందర్భంగా బెంగళూరులో బ్యాంకులకు సెలవు.

ఇక నవంబర్ 28వ తేదీ నెలలో నాలుగో శనివారం కావడంతో దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులకు సెలవు ఉంటుంది.

బ్యాంకు శాఖలు మూసి ఉన్నప్పటికీ, ఖాతాదారులు ఆన్‌లైన్ సేవలను యథావిధిగా వినియోగిం చుకో వచ్చు. యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకిం గ్, ఏటీఎం సేవలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయి. ప్రాంతీయ పండుగలను బట్టి ఆర్‌బీఐ క్యాలెండర్ ప్రకారం రాష్ట్రాలవారీగా సెలవులు మారుతుంటాయి. కాబట్టి, బ్యాంకులకు వెళ్లే ముందు సెలవుల వివరాలు తెలుసుకోవడం ఉత్తమం.

శాండ్‌పేపర్ వివాదం.. ఆ చీకటి రోజుల్లోకి మళ్లీ వెళ్లలేను: డారెన్ లీమన్

ఆస్ట్రేలియా క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా అప్రతిష్ఠపాలు చేసిన 2018 నాటి శాండ్‌పేపర్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ కుట్ర గురించి తనకు ముందే తెలుసంటూ వస్తున్న ఆరోపణలను ఆస్ట్రేలియా మాజీ కోచ్ డారెన్ లీమన్ మరోసారి తీవ్రంగా ఖండించాడు. ఆ ఘటన తర్వాత తాను మానసికంగా తీవ్రంగా కుంగిపోయానని, మళ్లీ ఆ చీకటి రోజుల్లోకి వెళ్లాలనుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. 2018లో దక్షిణాఫ్రికా పర్యటనలో ఆస్ట్రేలియా జట్టు బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడిన సంగతి తెలిసిందే. ఇటీవల ఆటగాళ్లు ఉస్మాన్ ఖవాజా, కామెరాన్ బ్యాన్‌క్రాఫ్ట్ చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం మళ్లీ వార్తల్లోకెక్కింది. బ్యాన్‌క్రాఫ్ట్ తన కథనంలో, బంతిని ఎలా రఫ్ చేయాలనే చర్చ డ్రెస్సింగ్ రూమ్‌లో జరిగిందని, ఆ సమయంలో కోచ్ డారెన్ లీమన్, బౌలింగ్ కోచ్ డేవిడ్ సేకర్ కూడా అక్కడే ఉన్నారని పేర్కొన్నాడు. డేవిడ్ వార్నర్ శాండ్‌పేపర్ వాడాలనే ఆలోచనను ముందుకు తెచ్చాడని కూడా రాశాడు. ఈ ఆరోపణలపై ఏబీసీ రేడియోతో మాట్లాడిన లీమన్ స్పందించాడు. “2018 నాటి ఘటనపై నా అభిప్రాయం ఇప్పటికీ మారలేదు. అది ఒక చీకటి సమయం, మేము చాలా తప్పులు చేశాం. కానీ, నా వాదన మాత్రం అదే. ఆ కుట్ర గురించి నాకు ముందుగా తెలియదు” అని స్పష్టం చేశాడు. బ్యాన్‌క్రాఫ్ట్ చెప్పినట్టుగా ఆ చర్చ జరిగినప్పుడు తాను అక్కడ ఉన్నట్లు తనకు గుర్తులేదని లీమన్ తెలిపాడు. “ఆ సంభాషణ జరిగినప్పుడు నేను అక్కడ ఉన్నట్లు నాకు గుర్తులేదు. అయినా అది జరిగి ఎనిమిదిన్నర సంవత్సరాలు అవుతోంది. నా వెర్షన్ ఇదే, దానికే కట్టుబడి



ఉంటాను” అని అన్నాడు. ఆ ఘటన తర్వాత కోచ్ పదవికి రాజీనామా చేసిన లీమన్, ఆ వైఫల్యానికి బాధ్యత వహించాడు. “రివర్స్ స్వింగ్ కోసం బంతిని నేలకేసి కొట్టడం, ఒకవైపు రఫ్ చేయడం వందేళ్లుగా జరుగుతోంది. కానీ 2018లో అది హద్దులు దాటింది. కోచ్‌గా దానికి నేనే బాధ్యుడిని. ఆ ఘటన వల్ల నేను ఏమీ నష్టపోలేదని కొందరు అంటున్నారు. కానీ, నేను క్రికెట్ ప్రపంచంలోనే అత్యుత్తమ ఉద్యోగాన్ని కోల్పోయాను. అందుకు నేను చింతిస్తున్నాను. ప్రజలకు క్షమాపణలు చెబుతున్నాను” అని లీమన్ ఆవేదనగా మాట్లాడాడు.

ఊహించని నిర్ణయం: ధోనీ రిటైర్మెంట్‌పై జహీర్ ఖాన్ ఆసక్తికర వ్యాఖ్యలు

టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్‌లో ఆటగాడిగా తన ప్రయాణానికి ముగింపు పలికిన సంగతి తెలిసిందే. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుతో సుదీర్ఘ అనుబంధం ఉన్న ధోనీ, ప్లేయర్‌గా రిటైర్మెంట్ తీసుకుని 2027 సీజన్ నుంచి జట్టు మెంటార్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. ఈ అనూహ్య నిర్ణయంపై సీఎస్‌కే హెడ్ కోచ్ జహీర్ ఖాన్ స్పందిస్తూ ఆసక్తికర విషయాలు పంచుకు న్నాడు. ధోనీ రిటైర్మెంట్ నిర్ణయం వ్యక్తిగతంగా తనను ఆశ్చర్యానికి గురిచేసిందని జహీర్ ఖాన్ పేర్కొన్నాడు. అయితే ఏ సమయంలో సరైన నిర్ణయం తీసుకోవాలో ధోనీకి బాగా తెలుసని చెప్పాడు. పిక్క కండరాల గాయం కారణంగా ధోనీ 2026 ఐపీఎల్ సీజన్‌కు పూర్తిగా దూరమయ్యాడు. అతడు చివరిసారిగా 2025 సీజన్‌లో మైదానంలో కనిపించాడు. నవంబర్ 17న ప్లేయర్ రిటెన్షన్ జాబితా విడుదలైన సమయంలో ధోనీని మెంటార్‌గా నియమిస్తున్నట్లు సీఎస్‌కే యాజమాన్యం ప్రకటించింది. 2008 నుంచి 19 సీజన్ల పాటు ఐపీఎల్‌లో కొనసాగిన ధోనీ, మొత్తం 278 మ్యాచ్‌లలో 5,439 పరుగులు



సాధించాడు. కెప్టెన్‌గా సీఎస్‌కే జట్టుకు 5 ఐపీఎల్ టైటిళ్లు, 2 ఛాంపియన్స్ లీగ్ ట్రోఫీలను అందిం చాడు. ఆటగాడిగా బరిలోకి దిగకపోయినా, రాబోయే సీజన్లలో మెంటార్‌గా అతడు ఇచ్చే సూచనలు జట్టుకు కొండంత బలాన్నిస్తాయని యాజమాన్యం భావిస్తోంది.

స్పోర్ట్స్

వరుసగా మూడో కప్ప కొడతాం చరిత్ర సృష్టిస్తాం: ఆర్సీబీ కోచ్ ఆండీ ఫ్లవర్



ఐపీఎల్ 2027 సీజన్‌లో వరుసగా మూడోసారి టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించడంపై డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ధీమాగా ఉంది. డిసెంబర్ 16న జరగనున్న మినీ వేలానికి ముందు జట్టు అట్టిపెట్టుకున్న ఆటగాళ్లపై హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్ పూర్తి సంతృప్తి వ్యక్తం చేశాడు. తమ కోర్ టీమ్‌తో హ్యాట్రిక్ టైటిల్ సాధిస్తామని విశ్వాసం వెలిబుచ్చాడు.మినీ వేలానికి ముందు ఆర్సీబీ తమ టైటిల్ విన్నింగ్ జట్టులోని కీలక సభ్యులతో సహా మొత్తం 20 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది. రూ. 14.15 కోట్ల పర్స్‌తో వేలంలోకి అడుగుపెట్టనుంది. జట్టులో ఇంకా ఐదు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. తక్కువ పర్స్‌తో వేలానికి వెళ్తున్నప్పటికీ, తమ వద్ద పటిష్ఠమైన జట్టు ఉండటం సానుకూలాంశమని ఫ్లవర్ అన్నాడు.‘జియోస్టార్’తో మాట్లాడుతూ ఫ్లవర్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. “గత రెండు సీజన్లు మాకు అద్భుతంగా గడిచాయి. ఈ సైకిల్‌లో మూడో ఏడాదిలోకి అడుగుపెడుతున్నాం. మా ప్రస్తుత జట్టుతో ఎంతో నమ్మకంగా ఉన్నాము. వేలంలో జట్టును మరింత మెరుగుపరచడం మా బాధ్యత. అయితే, ఇతర జట్లతో పోలిస్తే మా వద్ద ఖర్చు చేసేందుకు తక్కువ డబ్బు ఉంది. అయినా మేం దాని గురించి ఆందోళన చెందడం లేదు. ఎందుకంటే గత రెండేళ్లుగా అద్భుతంగా రాణించిన మా కోర్ టీమ్‌ను అట్టిపెట్టుకున్నాం. ఈ కలయిక 2027లో కూడా మాకు బాగా పనిచేస్తుందని ఆశిస్తున్నాం. వరుసగా మూడు టైటిళ్లు గెలిచి చరిత్ర సృష్టించేందుకు ఇది మాకు చాలా ముఖ్యమైన సీజన్” అని ఫ్లవర్ వివరించాడు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com